

గుండ్లకమ్మ గేట్లు ఎత్తడంతో దిగువకు వెళ్తున్న నీరు


ఒంగోలులోని బాలినేని కాలనీలో గుడిసెలో ఉన్న వృద్ధుడు


ఒంగోలులోని శివారు కాలనీలో పరిస్థితిని పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా


చదలవాడ వద్ద పరిస్థితిని సమీక్షిస్తున్న ఎస్పీ దామోదర్


చదలవాడ వద్ద చెరువు తెగి రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు

వణికించిన వాన

- పలుచోట్ల కుండపోత
- జిల్లావ్యాప్తంగా జనజీవనం అస్తవ్యస్తం
- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
- వివిధ మార్గాల్లో రవాణాకు ఆటంకం
- చదలవాడ వద్ద తెగిన చెరువు
- ఒంగోలు-చీరాల రోడ్డుపై పారిన నీరు
- తీరంలో ఎగసిపడుతున్న అలలు
- పంటలపై రైతుల ఆందోళన
- అప్రమత్తంగా యంత్రాంగం
- వివిధ ప్రాంతాల్లో కలెక్టర్, ఎస్పీ పర్యటన
- గుండ్లకమ్మ నాలుగు గేట్లు ఎత్తి 17వేల క్యూసెక్కులు దిగువకు విడుదల

జిల్లాను వర్షం ముంచెత్తింది. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో ఆదివారం రాత్రి నుంచి వాన ప్రారంభమైంది. మూడు, నాలుగు రోజులుగా కురుస్తూనే ఉంది. జిల్లాలోని తూర్పుప్రాంతంతోపాటు నెల్లూరు జిల్లా సరిహద్దుగా ఉండే ప్రాంతాల్లో ప్రభావం అధికంగా ఉంది. ముసురుపట్టి కురుస్తున్న వానలతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. రవాణాకు ఆటంకం ఏర్పడింది. చాలాచోట్ల రోడ్లు దెబ్బతిన్నాయి. జలవనరుల్లోకి భారీగా నీరు చేరుతోంది. తీరప్రాంతంలో 'అల'జడి నెలకొంది. ఆయా గ్రామాల్లో ముంపుభయం ఉన్న ప్రాంతాల వారిని పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. అధికారులు అన్ని ప్రాంతాల్లో పర్యటిస్తూ క్షేత్రస్థాయిలోని సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు.

ఒంగోలు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావం జిల్లాపై తీవ్రంగా చూపింది. మూడు రోజులుగా తెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. ఈనెల 14నుంచి 16 వరకు ఏకంగా 10.50 సెం.మీ సగటు వర్షపాతం నమోదైంది. బుధవారం పగటి పూట కూడా అత్యధిక ప్రాంతాల్లో వర్షం కురుస్తూనే ఉంది. సాధారణంగా ఈసమయంలో జిల్లాలో కొద్దిపాటి జల్లులు పడుతుంటాయి. అలాంటిది భారీ వర్షాలు కురుస్తుండటంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. అధిక ప్రాంతాల్లో ప్రత్యేకించి జిల్లా తూర్పు, దక్షిణ భాగంలోని ఒంగోలు, కొండపి, సంతనూతలపాడు, కనిగిరి నియోజకవర్గాల్లోని పలు మండలాల ప్రజలను వర్షం వణికించింది. ఈ మూడు రోజుల్లో 15 నుంచి 23 సెం.మీ సగటు వర్షపాతం ఆప్రాంతాల్లో నమోదైంది. పశ్చిమంలోని మండలాల్లో కూడా భారీ వర్షమే పడింది. జిల్లాలోని అత్యధిక ప్రాంతాల్లో

మిగతా 6వ పేజీలో

నేడు విద్యా సంస్థలకు సెలవు

జిల్లాలో గురువారం భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో అన్ని పాఠశాలలు, కళాశాలు, ఇతర విద్యా సంస్థలకు కలెక్టర్ తమీమ్ అన్సారియా సెలవు ప్రకటించారు. అత్యవసరమైతేనే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి నుంచి బయటకు రావొద్దని ఆమె కోరారు. భారీ వర్షాలతో ఎలాంటి పరిస్థితి తలెత్తినా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు యంత్రాంగం సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు.


పాకల వద్ద ముందుకు వచ్చిన సముద్రం


భైరవకోన జలపాతం వద్ద ఎమ్మెల్యే ఉగ్ర


దర్శిలోని విద్యుత్‌శాఖ కార్యాలయానికి వేసిన తాళాలు

విద్యుత్ శాఖ కార్యాలయానికి తాళం

- మోసం చేసిన ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని బాధితుల డిమాండ్
- రోజంతా నిలిచిపోయిన కార్యకలాపాలు
- అధికారుల చర్చలు విఫలం
- బిల్లులు చెల్లించే వీలులేక వినియోగదారుల ఇక్కట్లు

దర్శి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నమ్మించి మోసం చేసిన విద్యుత్ శాఖ జేఏవో నాదెళ్ల వేణుగోపాల్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బాధితులు దర్శి పట్టణంలోని విద్యుత్‌శాఖ కార్యాలయానికి తాళాలు వేశారు. తమకు న్యాయం చేసేంతవరకూ కదిలేది లేదని భీష్మించారు. దీంతో బుధవారం విద్యుత్‌శాఖ కార్యాలయం విధులు నిలిచిపోయాయి. బిల్లులు చెల్లించేందుకు వచ్చిన అనేకమంది

మిగతా 6వ పేజీలో

సర్కార్ మద్యం గోల్‌మాల్

ఒంగోలులో రూ.5 కోట్లు మాయం



- మాల్స్, దుకాణాలలో సరుకు పక్కదారి
- ఎక్సైజ్ కానిస్టేబుల్ చేతివాటం
- అధికారుల తీరుపైనా అనుమానాలు
- ఎస్పీకి ఫిర్యాదు చేసిన ప్రైవేటు సిబ్బంది
- అనేక దుకాణాలలో అవకతవకలు
- నిల్వలను స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ అధికారులు

ఒంగోలు క్రైం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సర్కారు దుకాణాల్లో మద్యం అమ్మకాలలో గోల్‌మాల్ జరిగింది. సిబ్బంది చేతివాటం, అధికారుల పర్యవేక్షణ లోపం వెరసి ప్రభుత్వ ఖజానాకు కోట్లలో గండిపడింది. ఒంగోలులో సుమారు రూ.5కోట్ల మేర అవకతవకలు జరిగాయని ప్రాథమికంగా అంచనా. జిల్లావ్యాప్తంగా ఉన్న మద్యం దుకాణాలలో కూడా ఇదే తరహాలో నిధులు గల్లంతైనట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒంగోలు మంగమ్మ కాలేజీ వద్ద ఉన్న మాల్‌లో రూ.1.65 కోట్ల నిధులు మాయమైనట్లు అక్కడ పనిచేసే సిబ్బంది ఎస్పీ దామోదర్‌కు మంగళవారం ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనతో ఎక్సైజ్ శాఖ ఉలికిపాటుకు గురైంది. హడావుడిగా అధికారులు జిల్లాలో ఉన్న మద్యం దుకాణాలలో నిల్వలతోపాటు అక్కడ ఫర్నిచర్‌కు పంచనామా నిర్వహించి స్వాధీనం చేసుకుంటున్నారు. దీంతో ఆయా మద్యం దుకాణాలలో చోటుచేసుకున్న అవకతవకలు బయటపడుతున్నాయి. మద్యం డిపోల నుంచి వచ్చిన బాటిళ్ల దుకాణాలలో స్కాన్ చేసిన తర్వాత మాత్రమే విక్రయించాలి. అందుకు విరుద్ధంగా అమ్మకాలు చేసి కొందరు సిబ్బంది భారీగా జేబులు నింపుకొన్నట్లు తెలుస్తోంది.

ఒంగోలులో బార్లకు మద్యం అమ్మకాలు

ఒంగోలులో 18 మద్యం దుకాణాలు, రెండు మాల్స్ ఉన్నాయి. అక్కడ ప్రైవేటు వ్యక్తులు సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్‌లుగా పనిచేస్తుంటారు. వారిపై పర్యవేక్షణకు ఒక సీఐ, ఎస్ఐ, ఒక కానిస్టేబుల్‌ను నియమించారు. ఆయా దుకాణాలకు డిపోల నుంచి మద్యం వస్తుంది. రోజూ

మిగతా 6వ పేజీలో

వెలిగొండ ప్రాజెక్టును సందర్శిస్తా

- నిర్వాసితులతో నేరుగా మాట్లాడతా
- సీపీఐ ప్రతినిధి బృందానికి మంత్రి రామానాయుడు హామీ

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వెలిగొండను త్వరలో సందర్శించడంతోపాటు నిర్వాసితులతో నేరుగా మాట్లాడతానని ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు హామీ ఇచ్చారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నిర్మాణానికి తగిన నిధులు కేటాయించేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఆధ్వర్యంలో వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణానికి పూర్తిస్థాయిలో నిధులు కేటాయించాలని కోరుతూ సీపీఐ ప్రతినిధుల బృందం బుధవారం విజయవాడలో మంత్రి రామానాయుడును కలిసి వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా రామకృష్ణ పలు అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వెలిగొండ పూర్తయితే ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని 36 మండలాలకు కరువు తీరే అవకాశం ఉందన్నారు. పది లక్షల మంది ప్రజలకు తాగునీటి సమస్య కూడా పరిష్కారమవుతుందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. 1996లో నాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేశారని, గడిచిన 28 ఏళ్లలో 80శాతం ప్రాజెక్టు నిర్మాణ పనులు పూర్తికాగా ఇంకా రెండో టన్నెల్‌లో ఐదు కిలోమీటర్ల మేర లైనింగ్ పనులు నిలిచిపోయాయని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీని నిర్మాణం కోసం రూ.800 కోట్లు అవసరమవుతాయని ఇంజనీరింగ్ అధికారులు చెప్తున్నారని, 11 ముంపు గ్రామాల నుంచి 7,500 మంది నిర్వాసితులు ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించిందన్నారు. నిర్వాసితులకు చెల్లించేందుకు రూ.వెయ్యి కోట్లు అవసరం అవుతాయని, ఆమేరకు నిధులు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ప్రాజెక్టుకు సంబంధించి పలు అంశాలను మంత్రికి సీపీఐ నేత రామకృష్ణ వివరించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, కార్యదర్శివర్గ సభ్యులు కె.వెంకట్రావు, రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.వీరారెడ్డి తదితరులు ఉన్నారు.


మంత్రి రామానాయుడుకి వినతిపత్రం ఇస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, నేతలు

దిద్దుబాటు

- బదిలీల తప్పులు సరిదిద్దే పనిలో తలమునకలైన పంచాయతీ అధికారులు
- గ్రేడ్-5, 6 ఉద్యోగులకు ఆర్డర్లు ఇచ్చేందుకు సిద్ధం
- నేడో, రేపో ముగియనున్న ప్రక్రియ



ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీ కార్యాలయ పరిధిలో పనిచేసే గ్రేడ్-5,6 (పంచాయతీ కార్యదర్శులు) ఉద్యోగుల బదిలీల్లో చోటుచేసుకున్న తప్పిదాలను సరిచేసేందుకు ఆ శాఖ అధికారులు సిద్ధమయ్యారు. ప్రభుత్వం గత నెలలో ఉద్యోగుల బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ఆ ప్రక్రియను చేపట్టారు. అయితే ఆ విషయంలో అనేక అక్రమాలు చోటుచేసుకోవడంతో కలెక్టర్

మిగతా 6వ పేజీలో


ఎస్ఎన్‌పాడులో సీసీరోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

జోరువానలోనూ..

- కొనసాగుతున్న పల్లె పండుగ
- ఎమ్మెల్యేలు, ముఖ్యనాయకులు హాజరు

ఒంగోలు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పల్లె పండుగ కార్యక్రమం మూడోరోజైన బుధవారం కూడా కొనసాగింది. ఎక్కడికక్కడ టీడీపీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొన్నాయి. జోరువానలోనూ అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్యనేతలు

మిగతా 6వ పేజీలో



పోషకం.. ఆరోగ్యం

- మారుతున్న ఆహారపు అలవాట్లు
- రాగి, జొన్న జావలపై శ్రద్ధ
- ఖర్చుకు వెనుకాడని జనం
- నగరంలో 30కిపైగా కేంద్రాలు

7

అంధకారంలో సర్వజన ఆస్పత్రి

చీకటిలో రోగుల అవస్థలు

7



చీమకుర్తి-కర్నూలు రోడ్డుపై
నీటిని తోడించిన అధికారులు

చీమకుర్తి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : చీమకుర్తి-కర్నూలు రహదారి దుస్థితి అత్యంత దారుణంగా ఉన్న నేపథ్యంలో ప్రయాణికుల ఇక్కట్లు గమనించిన మండల అధికారులు బుధవారం తాత్కాలిక ఉపశమనచర్యలు చేపట్టారు. రహదారిపై నిలిచిపోయిన నీటిని ఇంజన్ల ద్వారా బయటికి కొట్టేసి గుంతలను గ్రానైట్ మట్టితో పూడ్చివేత పనులను చేపట్టారు. తహసీల్దార్ బ్రహ్మయ్య, ఎంపీడీవో రాఘవేంద్రలు దగ్గరుండి ఈ పనులను పర్యవేక్షించారు. మరోసారి వర్షం పడితే సమస్య మళ్లీ ఎప్పటిలాగే ఉంటుంది. కాబట్టి శాశ్వత చర్యల దిశగా అడుగులు వేయాల్సిన అవసరం ఉంది.

సర్కార్ మద్యం గోల్‌మాల్

(5వ పేజీ తరువాయి)

విక్రయాల ద్వారా వచ్చిన నగదు బ్యాంక్‌లో జమచేయాలి. అలా చేస్తున్నారా.. లేదా? నిల్వ ఎంత ఉంది అని ఎక్సైజ్ అధికారులు చూడాలి. నగరంలో పది మద్యం దుకాణాలు, రెండు మాల్స్‌కు ఒక కానిస్టేబుల్ ఇన్‌చార్జి గా ఉన్నారు. అయితే సదరు కానిస్టేబుల్ దుకాణాలలోని మద్యం పెట్టెలను బార్లకు విక్రయించినట్లు తెలిసింది. అంతేకాకుండా స్కాన్ చేయకుండా విక్రయాలు చేసి ఆ మొత్తాన్ని సిబ్బంది, కానిస్టేబుల్ కలిసి స్వాహా చేశారని సమాచారం. 2022 నుంచి ఇప్పటివరకు మంగమ్మ కాలేజీ వద్ద ఉన్న మాల్‌లో రూ.1.65 కోట్లు, మంగమూరు రోడ్డు జంక్షన్ సమీపంలో ఉన్న మాల్‌లో రూ.95 లక్షలు నిధులు గోల్ మాల్ అయినట్లు సమాచారం. అదేవిధంగా మిగిలిన మద్యం దుకాణాలలో మరో రూ.2.50కోట్లకుపైగా అవకతవకలు ఉన్నట్లు అధికారులు అంచనాకు వచ్చారు.

అధికారుల నిర్లక్ష్యం

ఈ వ్యవహారంలో ఎక్సైజ్ అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనబడుతోంది. కోట్ల రూపాయలు గోల్‌మాల్ అయితే ఇప్పటి వరకూ గుర్తించకపోవడం అధికారుల పనితీరుకు అద్దం పడుతోంది. మద్యం దుకాణాలకు ఇన్‌చార్జిగా ఉన్న ఎక్సైజ్ కానిస్టేబుల్ వారంలో ఒక రోజు నిల్వలను పరిశీలించాలి. అదేవిధంగా నిత్యం బ్యాంక్‌లో నగదు జమ అవుతున్నాయా లేదా అనేది చూడాలి. అదేవిధంగా ఎక్సైజ్ ఎస్ఐ 15 రోజులకు ఒకసారి, సీఐ నెలరోజులకు ఒకసారి దుకాణాలను తనిఖీ చేసి నిల్వలను సరిచూడాలి. అంతేకాకుండా ఒక దుకాణం డిపోకు రూ.20 లక్షలు బాకీ ఉంటే ఇక నిల్వలు ఇవ్వకూడదు. నిబంధన ఇలా ఉంటే కోట్ల రూపాయల సరుకు దుకాణాలకు రావడం, ఆపై దారిమళ్లడం చూస్తే అంతా తెలిసే జరిగిందని ప్రచారం జరుగుతోంది. అధికారులు పర్యవేక్షణను గాలికొదిలేసి సిబ్బంది ఇచ్చే మామూళ్లకు తలొగ్గి అంటీముట్టనట్లు వ్యవహరించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి..

ఎస్పీకి ఫిర్యాదు చేసిన సిబ్బంది

మంగమ్మ కాలేజీ వద్ద మాల్‌లో పనిచేసే సిబ్బంది అక్కడ జరిగిన అవకతవకల గురించి మంగళవారం ఎస్పీ ఏఆర్.దామోదర్‌కు ఫిర్యాదు చేశారు. రూ.1.65 కోట్లు ఎక్సైజ్ కానిస్టేబుల్ కాజేశారని, ఇప్పుడు ఆ పాపం అంతా తమకు చుట్టుకుందని విన్నవించారు. అంతేకాకుండా మాల్‌ను తగలబెట్టేందుకు కానిస్టేబుల్ ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. రెండురోజుల క్రితం సిబ్బందికి చెప్పి ఐదు లీటర్ల పెట్రోలు తెచ్చి తగులబెట్టేందుకు కుట్ర చేశారని ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

విచారిస్తున్న పోలీసులు

మద్యం దుకాణాలలో చోటుచేసుకున్న గోల్‌మాల్‌పై ఒంగోలు తాలూకా పోలీసులు విచారణ చేపట్టారు. మాల్స్ మద్యం దుకాణాలకు ఇన్‌చార్జిగా ఉన్న ఎక్సైజ్ కానిస్టేబుల్‌తోపాటుగా ఒంగోలు ఎక్సైజ్ స్టేషన్ సీఐని పిలిపించి బుధవారం విచారణ చేశారు. ఏమి జరిగింది, ఎలా నిధులు మాయం అయ్యాయి అనే కోణంలో విచారిస్తున్నారు. కాగా ఎక్సైజ్ అధికారుల ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేస్తామని సీఐ అజయ్‌కుమార్ తెలిపారు.

అక్రమాలకు పాల్పడ్డ వారిపై కేసులు

సర్కార్ మద్యం దుకాణాలలో అక్రమాలకు పాల్పడ్డ వారిపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్.కె. ఖాజామొహిద్దిన్ తెలిపారు. వారిలో ఎక్సైజ్ సిబ్బంది ఉంటే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని మద్యం దుకాణాలలో ఉన్న ఫర్నిచర్, మద్యం నిల్వలను స్వాధీనం చేసుకుంటున్నామని వివరించారు.

- ఖాజామొహిద్దీన్, ఈఎస్

మద్యం విక్రయాలు ప్రారంభం

జిల్లాలో 50 దుకాణాలు ఏర్పాటు

మా ఊరిలో వద్దంటూ అక్కడక్కడా వినతులు



ఒంగోలులో మొదలైన మద్యం విక్రయాలు

ఒంగోలు క్రైం, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): మద్యం నూతన పాలసీలో ప్రైవేటు మద్యం దుకాణాలను ఏర్పాటు చేసి విక్రయాలు ప్రారంభించారు. మొత్తం 171 దుకాణాలు ఉండగా అందుకు సంబంధించిన ప్రొవిజినల్ లైసెన్స్‌లు ఎక్సైజ్ శాఖ నుంచి ఇచ్చారు. అయితే బుధవారం జిల్లా వ్యాప్తంగా 50 దుకాణాలకు మద్యం చేరింది. దీంతో విక్రయాలు ప్రారంభించారు. ఒక్కసారిగా 171 మద్యం దుకాణాలకు సరుకు ఇవ్వడం కష్టతరంగా మారింది. పేర్నమిట్ట డిపో వద్ద లైసెన్సీలు పెద్దఎత్తులో బారులు తీరి ఉన్నారు. అక్కడ మద్యం దుకాణం యూజర్, పాస్‌వర్డును తయారుచేసిన తరువాత సరుకుకు సంబంధించిన డీడీలను తీసుకొని మద్యం పెట్టెలు ఇస్తున్నారు. దీంతో ముందుగా వెళ్లిన వారు సరుకు తీసుకొని దుకాణంలో విక్రయాలు చేపట్టారు. కొంతమంది నిన్నటివరకు కొనసాగిన సర్కార్ మద్యం విక్రయించిన షాపులు అద్దెకు తీసుకున్నారు. దీంతో ఆ దుకాణాలు ఇంకా ఖాళీ చేయకపోవడం కూడా అవరోధంగా మారింది. గురువారం నుంచి ఎక్కువ దుకాణాలు అందుబాటులోకి రానున్నాయి. అదేక్రమంలో కొన్ని ప్రాంతాలలో మద్యం దుకాణాలు వద్దు అంటూ ఇప్పటికే ఎక్సైజ్ అధికారులకు వినతులు అందాయి. జనావాసాల మధ్య, దేవాలయాలు, స్కూళ్లకు సమీపంలో దుకాణాలు పెట్ట వద్దు అంటూ అనేకమంది విన్నవిస్తున్నారు.కొత్తపట్నం మండలం మడనూరులో ప్రస్తుతం ప్రభుత్వం నిర్వహించే దుకాణం ప్రాంతంలోనే కొత్తదానిని ఏర్పాటు చేయాలని అక్కడి ప్రజలు విన్నవించారు. అదేవిధంగా చీమకుర్తి కల్లుకొట్ల బజార్‌లో దుకాణం ఏర్పాటు చేయవద్దని ఇప్పటికే అధికారులకు వినతులు అందాయి. ఇలాంటి సమస్యలు కూడా ఉండటంతో మద్యం దుకాణాలు ఏర్పాటుకు ఆలస్యమవుతోంది. ఒంగోలు నగరంలో ముందుగానే మద్యం దుకాణాలు అద్దెకు తీసుకోవడంతో ఐదు దుకాణాలను తెరిచి విక్రయాలు ప్రారంభించారు.

చదలవాడ చెరువుకు గండి

● 216 జాతీయ రహదారిపైకి చేరిన వరద నీరు ● పరిశీలించిన కలెక్టర్ అన్సారియా, ఎస్పీ ఏ.ఆర్ దామోదర్

నాగులుప్పలపాడు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు బుధవారం చదలవాడలోని రామన్న చెరువు కట్ట తెగిపోయింది. వరద నీరు 216 జాతీయ రహదారి మీదుగా ప్రవహిస్తోంది. దీంతో పోలీసులు రాకపోకలను అటుగా నిలిపివేసి చదలవాడ గ్రామంలో నుంచి మళ్లించారు. కలెక్టర్ అన్సారియా, ఆర్డీవో శ్రీలతతో కలసి చెరువుకట్ట తెగిన ప్రాంతాన్ని పరిశీలించారు. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితి ఎదురవకుండా చెరువుకట్టకు శాశ్వత రివిట్‌మెంట్ చేపట్టాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. ఆ తర్వాత సమీపంలోని ఎస్సీ కాలనీ వద్దకు చేరుకొని కాలనీవాసులతో మాట్లాడారు. ఎస్పీ దామోదర్ హైవేపై వరదనీరు చేరిన ప్రాంతాన్ని పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ కె.ప్రవీణ్ కుమార్, ఎంపీడీవో వై.మహాలక్ష్మి, వివిధ శాఖల అధికారులు చీర్వానుప్పలపాడు వద్ద నుంచి రామన్న చెరువులోకి వస్తున్న వరద నీటిని ఎక్స్‌కవేటర్‌తో కాలువ తీసి గుండ్లకమ్మ కాలువలోకి మళ్లించారు. ఎస్పీ సైతం ఆ పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎస్ఐ బి.శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఉప్పుగుండూరు-నీలాయపాలెం మధ్య పొలాల్లో వరదనీరు తగ్గుముఖం పట్టలేదు. అలాగే మండలంలో మిరప పంట 205 హెక్టార్లలో, ఐదెకరాలలో సజ్జ పంట దెబ్బతిన్నట్లు ఏవో వెంకట్రావు తెలిపారు. ఇక కొత్తకోట-హనుమాపురం మధ్య వాగు పొంగడంతో రాకపోకలు నిలిచిపోయాయి.

రౌడీ షీటర్లు తోక జాడిస్తే పీడీ యాక్ట్

డీఎస్పీ శ్రీనివాసరావు

ఒంగోలుక్రైం, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి) : రౌడీషీటర్లు గొడవలు సృష్టించినా, దందాలలో పాల్గొన్నా పీడీయాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు హెచ్చరించారు. బుధవారం స్థానిక తాలూకా పోలీసుస్టేషన్ వద్ద నగరంలో ఉన్న రౌడీషీటర్లను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారు. రౌడీషీటర్లు నేరాలకు పాల్పడినా, ప్రోత్సహించినా అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రౌడీషీటర్లు జీవనవిధానం. ఇతర వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు నాగరాజు శ్రీనివాసరావు, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ కార్యాలయానికి తాళం

(5వ పేజీ తరువాయి)

వినియోగదారులు కార్యాలయం మూతపడటంతో వెనుదిరిగి వెళ్లిపోయారు. బాధితులతో విద్యుత్‌శాఖ అధికారులు చర్చించి కార్యాలయం తెరిచేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. దర్శి పట్టణానికి చెందిన రవికృష్ణ, ప్రసన్న దంపతుల భవనంలో విద్యుత్‌శాఖ సబ్ డివిజనల్ కార్యాలయం నడుస్తోంది. అందులోని ఒక పోర్షన్‌లో డీఈ, సిబ్బంది విధులు నిర్వహిస్తారు. మరో పోర్షన్‌లో సిబ్బంది విద్యుత్ బిల్లులు కట్టించుకుంటారు. రవికృష్ణ, ప్రసన్నలకు చెందిన ఈ భవనాన్ని గత ఏప్రిల్‌లో విద్యుత్‌శాఖ కార్యాలయానికి అద్దెకు ఇచ్చారు. అద్దె ఖరారు పేరుతో అక్కడ పనిచేస్తున్న జేఏవో వేణుగోపాల్ పలు డాక్యుమెంట్లపై సంతకాలు చేయించుకున్నారు.

కొంతకాలం తర్వాత వేణుగోపాల్ అదనంగా ఖాళీ పత్రాలపై సంతకాలు పెట్టించుకున్న డాక్యుమెంట్లపై రవికృష్ణ, ప్రసన్న దంపతులకు చెందిన భవనం పక్కనగల ఖాళీ స్థలం తనకు విక్రయించినట్లు వేణుగోపాల్ డాక్యుమెంట్లు సృష్టించుకున్నాడని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. విద్యుత్‌శాఖ అధికారులతోపాటు జిల్లా ఎస్పీ కార్యాలయంలో, స్పందనలో తమకు న్యాయం చేయాలని రవికృష్ణ, ప్రసన్న దంపతులు ఫిర్యాదు చేశారు.

అధికారుల విచారణ

ఈ నేపథ్యంలో విద్యుత్‌శాఖకు చెందిన కార్పొరేట్ అధికారులు గత సోమవారం ఇక్కడకు వచ్చి ఈ సంఘటనపై విచారణ చేపట్టి వెళ్లారు. ఈక్రమంలో రవికృష్ణ, ప్రసన్న దంపతులు తమకు న్యాయం చేయాలని, మోసం చేసిన జేఏవో వేణుగోపాల్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం కార్యాలయానికి తాళాలు వేశారు. విద్యుత్‌శాఖ కార్యాలయంలో ఎమర్జెన్సీ ప్రభుత్వ కార్యాలయాల్లో ఒకటిగా గుర్తింపు ఉంది. ప్రస్తుతం తుఫాన్ ప్రభావం తీవ్రంగా ఉన్నందుకు జిల్లాలోని విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది 24గంటలు అందుబాటులో ఉండాలని ఆదేశించిన విషయం విదితమే. ఈసమయంలో విద్యుత్‌శాఖ సబ్ డివిజన్ కార్యాలయం వివాదంతో మూతపడటంతో అధికారులు, సిబ్బంది ఏం చేయాలో పాలుపోలేదు. బాధితులతో విద్యుత్‌శాఖ డీఈ పిచ్చయ్య ఇతర అధికారులు చర్చించారు. ప్రభుత్వ కార్యాలయానికి తాళాలు వేయటం చట్టవిరుద్ధమని నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. జేఏవో తప్పుచేసినట్లయితే అతనిపై కేసుపెట్టి చట్టపరంగా న్యాయం పొందాలని సూచించారు. సాయంత్రం వరకు విద్యుత్‌శాఖ అధికారులు చర్చలు ఫలించకపోవటంతో వేసిన తాళాలు అలాగే ఉన్నాయి.

ఇదిలాఉండగా తనకు రవికృష్ణ అనే వ్యక్తి విద్యుత్‌శాఖ కార్యాలయం పక్కన ఉన్న ఖాళీ స్థలాన్ని విక్రయించి కోటి రూపాయలు తీసుకొని ఇప్పుడు తాను మోసం చేశానని అబద్ధం చెబుతున్నాడని జేఏవో ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఇరువర్గాల్లో ఎవరిది న్యాయమో, ఎవరిది మోసమో విచారణలో తేలాల్సిఉంది. ఆ భవనాన్ని విద్యుత్‌శాఖ అధికారులు అద్దెకు తీసుకొని ఆరునెలలు అవుతున్నప్పటికీ ఇప్పటివరకు అద్దె ఖరారు కాలేదు. ఇంటి యజమానులకు అద్దె చెల్లించలేదు. ఈవిషయంపై కూడా అధికారుల నిర్లక్ష్యవైఖరి అవలంబించారని బాధితులు వాపోయారు.

చట్టపరమైన చర్యలు తీసుకుంటాం

ఈసంఘటనపై విచారణలో దోషులు ఎవరనే విషయం తేలిన వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని విద్యుత్ శాఖ ఈఈ శ్రీనివాసులు తెలిపారు. కార్యాలయానికి తాళాలు వేయటంతో విధులకు ఆటంకం కల్గటంతోపాటు వినియోగదారులు బిల్లులు చెల్లించే వీలులేక ఇబ్బంది పడిన విషయాన్ని ఆంధ్రజ్యోతి ఆయన దృష్టికి తీసుకెళ్లగా విద్యుత్ అధికారులు అన్నీ విషయాలు మాట్లాడుతున్నారన్నారు. ఉన్నతాధికారులకు ఇక్కడ జరిగిన సంఘటనలను తెలిపామని చెప్పారు. వెంటనే దోషులపై చర్యలు తీసుకోవటం జరుగుతుందని స్పష్టం చేశారు.

దిద్దుబాటు

(5వ పేజీ తరువాయి)

తమీమ్ అన్సారియా విచారణకు ఆదేశించారు. ఫారెస్టు సెటిల్‌మెంట్ అధికారి లోకేశ్వరరావు విచారణ చేసి బదిలీల ఆర్డర్లు ఇచ్చే విషయంలో కార్యాలయ ఉద్యోగులు, కీలక అధికారి అనేక అక్రమాలకు పాల్పడ్డారని నివేదికను అందజేశారు. దీంతో ఆ బదిలీల ప్రక్రియలో భాగస్వామ్యం ఉన్న ముగ్గురు ఉద్యోగులను కలెక్టర్ తమీమ్ అన్సారియా సస్పెండ్ చేశారు. దీంతో కొంతమంది ఉద్యోగులకు ఇంత వరకు బదిలీల ఆర్డర్లు అందని పరిస్థితి ఏర్పడింది. ప్రతిరోజూ జిల్లా పంచాయతీ కార్యాలయం వచ్చి తిరిగిపోతున్నారు. ఈనేపథ్యంలో జిల్లా పంచాయతీ అధికారి గొట్టిపాటి వెంకటనాయుడు ఈ ప్రత్యేక దృష్టిసారించి ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటి వరకు బదిలీ ఉత్తర్వులు అందని ఉద్యోగుల వివరాలను సేకరించి నోట్‌ఫైల్ పెట్టాలని ఆదేశించినట్లు సమాచారం.

ఉద్యోగుల వివరాల సేకరణ

కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా పంచాయతీ అధికారులు బదిలీలపై ప్రత్యేక దృష్టిసారించారు. మండలాల వారీగా గ్రేడ్-5. గ్రేడ్-6 ఉద్యోగులు ఎంతమంది బదిలీ అయ్యారు, ఎంతమంది జాయిన్ అయ్యారు, ఇంకా ఉత్తర్వులు అందని వారు ఎంతమంది ఉన్నారు తదితర వివరాలను సేకరిస్తున్నారు. వాటిని ప్రత్యేక ప్రొఫార్మాలో పొందుపరుస్తున్నారు. పూర్తి స్థాయిలో సేకరించి కలెక్టర్ తమీమ్ అన్సారియాకు అందజేయనున్నారు. ఆ జాబితాను పరిశీలించిన తర్వాత కలెక్టర్ ఆదేశాలకు అనుగుణంగా తదుపరి చర్యలు తీసుకోనున్నారు. మరోవైపు గ్రేడ్-5, 6 ఉద్యోగుల బదిలీల్లో ఒక స్థానానికి ఇద్దరికి ఏమైనా ఆర్డర్లు ఇచ్చారా అనే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నారు. పెద్దారవీడు మండలంలో ఒక పంచాయతీకి ఇరువురు కార్యదర్శులను నియమించడంపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంతో వెంటనే ఆ శాఖ ఉన్నతాధికారులు సంబంధిత ఎంపీడీవోతో మాట్లాడినట్లు తెలుస్తోంది.

సూత్రధారిని వదిలి... పాత్రదారులను పట్టారు

పంచాయతీ కార్యదర్శులు, ఇతర సిబ్బంది బదిలీల్లో జరిగిన అవకతవకలు, ఆర్థిక లావాదేవీలకు ప్రధాన సూత్రధారిగా ఉన్న నాటి డీపీవోని వదిలేసి పాత్రధారులుగా ఉన్న అప్పటి ఏవో, జూనియర్ అసిస్టెంట్‌లపై వేటు వేయడం హాస్యాస్పదంగా ఉందని సర్పంచ్‌ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జి.వీరభద్రాచారి అన్నారు. స్థానిక సంఘ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు నెలలుగా బదిలీల ప్రక్రియ జరుగుతుందని, ఆర్థిక లావాదేవీలు కొనసాగుతున్నాయన్నారు. బదిలీలపై కలెక్టర్ ఆమోదం తర్వాత కూడా వారంరోజులపాటు ఉత్తర్వుల కోసం కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నా ఆ శాఖ అధికారి పట్టించుకున్న పరిస్థితి లేకుండాపోయిందన్నారు. ఆ అధికారి తీరు వల్ల జిల్లా పంచాయతీ పరువు బజారున పడిందన్నారు. ఈ లావాదేవీలన్నింటినిపై విచారణ చేసి వాస్తవాలు బహిర్గతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

జోరువానలోనూ...

(5వ పేజీ తరువాయి)

భాగస్వామ్యమ య్యారు. పెద్దఎత్తున గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, డ్రైన్లు ఇతరత్రా పనులకు శంకుస్థాపనలు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంత అభివృద్ధి, ప్రజలకు మెరుగైన సౌకర్యాల కల్పన కోసం ఆయా ప్రాంతాల్లో తీసుకుంటున్న చర్యలను ఈ సందర్భంగా ప్రజలకు వివరిస్తున్నారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ బుధవారం రూరల్ మండలంలోని దశరాజుపల్లి, మండువవారిపాలెం గ్రామాల్లో పాల్గొన్నారు. సుమారు రూ.70లక్షల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ సంతనూతలపాడు, రుద్రవరం, మంగమూరు గ్రామాల్లో సుమారు కోటి 45 లక్షల విలువైన పనులకు శంకుస్థాపనలు చేశారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తర్లుపాడు మండలం కేతగుడిపి, కలుజువ్వలపాడు గ్రామాల్లో పాల్గొనగా దర్శి టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తాళ్లూరు మండలంలోని తురకపాలెం, దారంవారిపాలెం, మాధవరం గ్రామాల్లోనూ, టీడీపీ ఎర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి గుడూరి ఎరిక్షన్‌బాబు వైపాలెం పంచాయతీ పరిధిలో పలు శంకుస్థాపనలు చేశారు. ఇతర మండలాల్లోనూ స్థానిక ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతలు అధికారులతో కలిసి ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



ఒంగోలులోని మదర్ థెరిస్సా కాలనీలో దుస్థితి ఇదీ..



పామూరు మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న దాసరి వాగు



టంగుటూరు మండలం ఆలకూరపాడు నేల చప్టా వద్ద పరిస్థితిని పరిశీలిస్తున్న తహసీల్దార్ ఆంజనేయులు

వణికించిన వాన

(5వ పేజీ తరువాయి)

వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తుండగా చెరువులు, కాలువలు, నదుల్లోకి సైతం భారీగా వర్షపు నీరు చేరుతోంది. గుండ్లకమ్మకు 13వేల క్యూసెక్కుల వర్షపు నీరు వస్తుండగా ప్రాజెక్టు భద్రత దృష్ట్యా నాలుగు గేట్లు ఎత్తి 17వేల క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. ఇంకా అధికంగా ప్రాజెక్టులోకి నీరు చేరే అవకాశం కనిపిస్తోంది. నెల్లూరు జిల్లాలో కురిసిన భారీ వర్షాలతో భైరవకోన జలపాతాన్ని వర్షపు నీరు ముంచెత్తింది. ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి ఆ ప్రాంతాన్ని అధికారులతో కలిసి సందర్శించి ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు. కొండపి నుంచి ఒంగోలు వచ్చే మార్గంలోని అట్లేరు పొంగి ప్రవహిస్తోంది. నాగులుప్పలపాడు మండలం చదలవాడ వద్ద చెరువు తెగి చీరాల-ఒంగోలు జాతీయ రహదారిని ముంచెత్తడంతో ఆ మార్గంలో రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. నాగులుప్పలపాడు నుంచి గ్రోత్‌సెంటర్‌కు వచ్చే మార్గంలోని కొత్తకోట, హనుమాపురంల వద్ద వాగులు, ఒంగోలు రూరల్ మండలంలోని కొప్పోలు-కరవది మార్గంలో ముదిగొండి వాగు పొంగి ప్రవహించాయి. పలు ఇతర ప్రాంతాల్లోనూ చిన్న, పెద్ద అనేక వాగుల ఉధృతికి రవాణాకు ఆటంకంగా ఏర్పడింది.

నగరం జలమయం

ఒంగోలు నగరంలో భారీవర్షం కురవడంతో శివారు కాలనీలే కాక ప్రధాన ప్రాంతాలు కూడా జలమయమయ్యాయి. పలు కాలనీల్లో ఇళ్లలోకి నీరు చేరి ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఒంగోలు నగరపరిధిలోని అగ్రహారం, కొత్తపట్నం మండలం సంకువానిగుంట, టంగుటూరు మండలం ఆలకూరపాడు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. కొత్తపట్నం తీరప్రాంతంలో అలలు ఎగసిపడుతూ ఉధృతి అధికంగా కనిపించింది. మత్స్యకారులు బోట్లు, వలలు వడ్డుకు చేర్చుకొని వేటకు వెళ్లకుండా ఆగిపోయారు. పాలక తీరంలో సముద్రం 10 మీటర్లు ముందుకు వచ్చింది. ఇప్పటివరకు కురిసిన వర్షాలు చాలా ప్రాంతాల్లో వ్యవసాయానికి మేలు చేశాయి. పొలంలో ఉన్న అత్యధిక పంటలకు ఇవి ఉపయుక్తమయ్యాయి. ఇంకా కొనసాగితే పొలంలో ఉన్న వేలాది ఎకరాల్లోని మిర్చి, కంది, మొక్కజొన్న, సజ్జ వంటి పంటలు దెబ్బతినే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

మూడు రోజుల్లో 10.50 సెం.మీ

పలు మండలాల్లో సాధారణం కన్నా 5 నుంచి 10 రెట్లు అధిక వర్షపాతం


ఈనెల 14 నుంచి 16వ తేదీ ఉదయం వరకు మూడు రోజుల్లో జిల్లాలో ఏకంగా 10.50 సెం.మీ సగటు వర్షపాతం నమోదైంది. సాధారణంగా ఈ మూడు రోజుల్లో జిల్లాలో కేవలం 2.02 సెం.మీ మాత్రమే కురుస్తుంది. అయితే అంతకు ఐదు రెట్లు సగటు వర్షపాతం నమోదు కాగా చాలా మండలాల్లో అది పది రెట్ల వరకూ కూడా ఉంది. సింగరాయకొండ మండలంలో అత్యధికంగా 23.68 సెం.మీ మేర ఈ మూడు రోజుల్లో వర్షపాతం నమోదైంది. దాదాపు జిల్లాలోని సగం మండలాల్లో 10 సెం.మీ కన్నా అధికంగా కురిసింది.

అప్రమత్తంగా యంత్రాంగం

జిల్లాలో భారీవర్షాలు కురుస్తుండటంతో యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. కలెక్టర్ తమీమ్ అన్సారియా నిరంతర పర్యవేక్షణ చేస్తున్నారు. రాత్రింబవళ్లు జిల్లా స్థాయి నుంచి గ్రామస్థాయి అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు. బుధవారం ఉదయం తెగిన చదలవాడ చెరువు ప్రాంతాన్ని కలెక్టర్ అన్సారియా సందర్శించి తగు జాగ్రత్తలకు అధికారులను ఆదేశించారు. అంతకుముందు ఒంగోలు నగరంలోని శివారు కాలనీల్లోనూ పర్యటించారు. ఎస్పీ ఎఆర్.దామోదర్ కూడా చదలవాడ చెరువు ప్రాంతాన్ని సందర్శించడంతోపాటు మొత్తం పోలీస్ యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. జేసీ గోపాలకృష్ణ కంభం చెరువును పరిశీలించారు. భారీ వర్షాల వల్ల జిల్లాలో 42 చోట్ల వాగులు, వంకలు పొంగి రోడ్లపైకి నీరుచేరే అవకాశం ఉందని గుర్తించి ఆయా ప్రాంతాల్లో పోలీసు, రెవెన్యూ అధికారుల పర్యవేక్షణ కొనసాగుతోంది. కాగా వాయుగుండం గురువారం ఉదయానికి నెల్లూరు-పుదుచ్చేరి మధ్య తీరం దాటే అవకాశం ఉన్నట్లు తెలుస్తుండగా ఇంకా వర్షాలు పడితే భారీనష్టమే జిల్లాలో జరిగే అవకాశం ఉంది.

మూడు రోజుల్లో గరిష్ఠ వర్షపాతం నమోదైన మండలాల వివరాలు

మండలం	సాధారణం	నమోదు (సెం.మీ)
సింగరాయకొండ	3.21	23.68
టంగుటూరు	2.96	23.18
కొండపి	2.61	21.15
పొన్నలూరు	2.42	20.60
జరుగుమల్లి	2.78	18.78
ఒంగోలు	2.75	18.12
నాగులుప్పలపాడు	2.43	17.96
సిఎస్‌పురం	1.97	15.82
కొత్తపట్నం	2.79	14.94
పామూరు	1.94	14.48
పీసీపల్లి	2.10	13.76
హెచ్‌ఎంపాడు	1.85	12.52
మర్రిపూడి	1.80	12.50
చీమకుర్తి	2.24	12.48
మర్రిపూడి	1.80	12.10
పొదిలి	1.95	11.24
ఎస్ఎన్‌పాడు	2.51	11.80
మద్దిపాడు	2.18	11.60



పోషకం ఆరోగ్యం

- వ్యాయామానికీ ప్రాధాన్యం
- ఖర్చుకు వెనుకాడని జనం
- వాకింగ్ ట్రాక్‌లు, పార్కుల వద్ద ఆర్గానిక్ జ్యూస్ సెంటర్లు

మారుతున్న ఆహారపు అలవాట్లు
రాగి, జొన్న జావ, జ్యూస్‌లపై శ్రద్ధ
నగరంలో 30కిపైగా కేంద్రాలు





రంగారాయుడు చెరువు వద్ద జావ తాగుతూ..

ఒంగోలు (కార్పొరేషన్), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు పెద్దలు. ఈ సత్యాన్ని కరోనా ఉపద్రవం తరువాత ప్రజలు గ్రహించారు. ఆరోగ్యంపై కేంద్రీకరించారు. ఆహార నియమాలను అలవాటు చేసుకుంటున్నారు. పిజ్జాలు, బర్గర్లు, మసాలాలకన్నా రాగులు, జొన్నలతో కూడిన జావలు, జ్యూస్‌లకు ప్రాధాన్యత ఇస్తున్నారు. కరోనాకు ముందు వరకూ ఆరోగ్యానికి ప్రాధాన్యతివ్వనివారు ఇప్పుడు రోజుకు ఒక గంట సేపు వ్యాయామాన్ని దినచర్యలో భాగం చేసుకుంటున్నారు. దానికి అనుగుణంగానే ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకుంటున్నారు. ఉదయం వాకింగ్ లేదా వ్యాయామం చేసి రాగులు, జొన్నలు లాంటి తృణధాన్యాలతో కూడిన జావ తాగేందుకు ఇష్టపడుతున్నారు. దీనికి అనుగుణంగా తృణధాన్యాలతో జావ, జ్యూస్‌లు అమ్మే సెంటర్లు వాకింగ్ ట్రాక్‌లు, పార్కులు, జిమ్ సెంటర్ల వద్ద కుప్పలు తెప్పలుగా వెలుస్తున్నాయి. నగరంలో ఏడేళ్ల క్రితం రంగారాయుడు చెరువు సమీపంలో ఒక సెంటర్ మాత్రమే ఉండేది. ప్రజలు ఆరోగ్యంపై మక్కువ పెంచుకోవడంతో రాగి, జొన్న జావ, జ్యూస్ కేంద్రాలు పెరిగి నగరంలో 30కిపైగా చేరాయి. రంగారాయుడు చెరువు, మామిడిపాలెం వాకింగ్ ట్రాక్, కొత్తపట్నం బస్టాండ్, కొండమీద శివాలయం సెంటర్లలో వీటి విక్రయాలు ఎక్కువగా ఉన్నాయి. వీటికి ఆర్గానిక్ జ్యూస్ సెంటర్లు అని పేరు పెట్టారు. ఒక్కో బండి వద్ద ఉదయం, సాయంత్రం కలిపి సగటున రోజుకు 200 మంది ఆ జ్యూస్ తీసుకుంటున్నారు. ఒక్కొక్క గ్లాసు జావ లేదా జ్యూస్ రూ.20 చొప్పున అమ్ముతున్నారు. తక్కువ ఖర్చుతో రుచి, ఆరోగ్యం దక్కుతుండటంతో కొనేందుకు ప్రజలు వెనుకాడటం లేదు. దీనికోసం నెలకు రూ.800 నుంచి రూ.1000 వరకు ఖర్చు చేస్తున్నారు. రోగంతో ఆస్పత్రికెళ్లి లక్షల్లో చెల్లించుకునే కన్నా ఇది మేలు అని ప్రజలు భావిస్తున్నారు.

జ్యూస్ సెంటర్లతో ఉపాధి

జ్యూస్ సెంటర్‌లు అనేక మందికి జీవనాధారంగా మారాయి. రోజుకు ఖర్చులన్నీ పోయి కనీసం రూ.వెయ్యి మిగులుతున్నాయి. ఒక్కో వ్యాపారికి నెలకు రూ.30 వేల ఆదాయం వస్తోందని వ్యాపారి తెలిపారు.

ఉపయోగాలివీ

జొన్నలో ఎక్కువ ప్రొటీన్లు, ఐరన్ ఉంటాయి. ఇవి శరీరానికి చాలా మేలు చేస్తాయి. కండ బలానికీ, శరీర ధృడత్వానికీ, ఎముకల పుష్టికీ జొన్నలు దివ్యౌషధం. ముఖ్యంగా మధుమే హాన్ని నియంత్రణలో ఉంచడా నికి ఇవి బాగా ఉపయోగప డతాయి. పీచు పదార్థం అధికంగా ఉండటం వలన జీర్ణ ప్రక్రియను క్రమబద్ధీకరిస్తాయి. జొన్న ఆహారం రాత్రిపూట ఆరగిస్తే ఉదయం పాస్టింగ్ బ్లడ్ షుగర్ లెవల్స్ తగ్గుదల కనిపిస్తుందని వైద్యులు చెబుతున్నారు. బరువు తగ్గడానికి ఉపకరిస్తాయి.



జావలో కలిపే పదార్థాలు

ఆరోగ్యం.. ఆదాయం



గతంలో రోజూ ఏదో ఒక పనికి వెళ్లేవాడిని. జనం రాగి, జొన్న జ్యూస్‌లను ఇష్టపడటం చూసి ఈ సెంటర్ పెడితే బాగుంటుందనుకున్నా. రోజూ ఖర్చు సుమారు రూ.3,500 నుంచి రూ.4వేల వరకు అవుతోంది. నాలుగేళ్లుగా బండిపెట్టుకుని ప్రొటీన్ జ్యూస్ అమ్ముతున్నాను. వామ్ వాటర్, రాగి, జొన్న జావలు, మిక్స్‌డ్ జావలు ఎక్కువ మంది ఇష్టపడుతున్నారు.

- నరేంద్ర, యజమాని

టీ, కాఫీ మానేసి జావ తాగుతున్నా



ఉదయాన్నే కాఫీ, టీ తాగడం వల్ల పెద్దగా ప్రయోజనం లేదు. అదే ఖర్చుకు ఆరోగ్యానికి పెడితే మేలు. రోజూ వాకింగ్ అయిపోగానే, కచ్చితంగా ఒకటి, రెండు గ్లాసులు, రాగి, జొన్న జావ, మిక్స్‌డ్ జావలు ఏదో ఒకటి తాగుతాను. ఇక టిఫిన్ కూడా అవసరం రాదు. దీనివల్ల బరువు తగ్గాను.

- ఏల్చూరి అబ్రహం, వాకర్

ఫోన్ చేసిన ప్రతి ఒక్కరికీ కంట్రోల్‌రూం సిబ్బంది స్పందించాలి

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి) : కంట్రోలు రూంకు ఫోన్ చేసిన ప్రతి ఒక్కరి సమస్యను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని జిల్లా స్థాయి కంట్రోలు రూంను బుధవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అప్పటి వరకు వచ్చిన ఫోన్ కాల్స్ వివరాలను సిబ్బంది నమోదు చేసిన తీరును పరిశీలించారు. అనంతరం ఫిర్యాదుదారులతో కలెక్టర్ ఫోన్‌లో మాట్లాడారు. కాల్ సెంటర్ దృష్టికి తీసుకవచ్చిన సమస్యల పరిష్కారం అయిందా? అధికారులు ఎంత సేపటికి స్పందించి సమస్యను పరిష్కరించారు? తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి సమస్యను సత్వరమే పరిష్కరించేలా స ంబంధిత శాఖలను సమన్వయం చేయాలని కంట్రోలు రూమ్ సిబ్బందికి సూచించారు. కలెక్టర్ వెంట డిఆర్వో ఆర్.శ్రీలత, విపత్తుల నిర్వహణ విభాగ డిపిఎం మాధురి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఎస్‌జీఎఫ్ ఇన్‌చార్జి సెక్రటరీగా హజీరా బేగం

ఒంగోలు, కార్పొరేషన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా ఇన్‌చార్జి సెక్రటరీగా త్రోవగుంట జిల్లా పరిషత్ హైస్కూలు వ్యాయామోపాధ్యాయురాలు ఎండీ హజీరా బేగంను నియమిస్తూ ఇన్‌చార్జి జిల్లా విద్యాశాఖాధికారి సామా సుబ్బారావు ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు స్కూల్ గేమ్స్ సెక్రటరీగా ఉన్న వనజ తన విధులు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో, ఇటీవల ఓ విద్యార్థిని రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఆమెపై శాఖాపరమైన చర్యల్లో భాగంగా అధికారులు ఆమెను సస్పెండ్ చేశారు. ఆ స్థానంలో హజీరా బేగంను నియమించారు. కాగా అండర్ 14, 17 వయస్సు విభాగాలలో ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలకు ఇన్‌చార్జి సెక్రటరీగా వ్యవహరిస్తారు.

ప్రజలకు ఇబ్బందులు రాకూడదు

- అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టాలి
- అధికారులను ఆదేశించిన కలెక్టర్
- శివారు కాలనీల్లో పర్యటన

ఒంగోలు, కార్పొరేషన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు నిలవకుండా పూడికతీత పనులు యుద్ధప్రాతిపదికన చేయాలని, లోతట్టు ప్రాంత ప్రజలు ఎలాంటి ఇబ్బందులూ పడకుండా చూడాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా మునిసిపల్ అధికారులను ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యంలో ఆమె బుధవారం నగర పరిధిలోని పలు కాలనీల్లో పర్యటించారు. స్థానిక మదర్ థెరిసా కాలనీ, నల్లవాగును పరిశీలించారు. అక్కడి ప్రజలు వర్షం వల్ల ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కాలనీ ప్రజల వర్షం కారణంగా ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని అవసరమైతే వారిని పునరవాస కేంద్రానికి తరలించాలని కమిషనర్‌ను ఆదేశించారు. విద్యుత్ సమస్య లేకుండా చూడాలని ఆదేశించారు. తాగునీటి ఇబ్బందులు కలగకుండా, ఎప్పటికప్పుడు బలరాం కాలనీ, కేశవరాజుకుంట, బిలాల్ నగర్, భరత్ కాలనీ, నెహ్రూ కాలనీ, నేతాజీ కాలనీ, తదితర ముంపు కాలనీల్లోని ప్రజలను అప్రమత్తం చేసినట్లు తెలిపారు. భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కలెక్టరేట్, కార్పొరేషన్ ఆఫీసుల్లో టోల్‌ఫ్రీ నెంబరు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 35 పునరావాస కేంద్రాలు గుర్తించడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఒంగోలు, టంగుటూరు, కొత్తపట్నం, సింగరాయకొండ మండలాల్లో ఐదు పునరావాస కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కేంద్రాల్లో సుమారు 200 మంది ప్రజలకు వసతి కల్పించినట్లు తెలిపారు. అందుకోసం కార్పొరేషన్, రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీ, వైద్య, ఆరోగ్య యంత్రాంగాన్ని అప్రమత్తం చేసినట్లు కలెక్టర్ తెలిపారు. అనంతరం పెళ్లూరు చెరువును ఆమె పరిశీలించారు. ఆమెతోపాటు మేయర్ గంగాడ సుజాత, కమిషనరు వెంకటేశ్వరరావు, ఆర్డీఓ లక్ష్మీప్రసన్న ఇతర అధికారులు పాల్గొన్నారు.



మదర్ థెరిస్సా కాలనీలో పర్యటిస్తున్న కలెక్టర్, మేయర్

జిల్లా సగటు వర్షపాతం 33.2 మిల్లీమీటర్లు

ఒంగోలు కలెక్టరేట్ : బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో జిల్లాలో ఒక మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. బుధవారం ఉదయానికి గడిచిన 24 గంటల్లో 33.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. అత్యధికంగా టంగుటూరు మండలంలో 95.6 మి.మీ.నమోదు కాగా అత్యల్పంగా యర్రగొండపాలెం మండలంలో 4.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. కొండపి 93.8, సింగరాయకొండ 73.4, జరుగుమల్లి 61.6, హనుమంతునిపాడు 61.2, పొన్నలూరు 60.4, సిఎస్‌పురం 54.0, పామూరు 52.2, పిసిపల్లి 51.0, చీమకుర్తి 50.4, మర్రిపూడి 50.4, గిద్దలూరు 48.2, కొమరోలు 41.2, కొత్తపట్నం 40.6 మి.మీ. నమోదైంది. కనిగిరి 36.2, రాచర్ల 35.4, ఒంగోలు 32.2, తాళ్లూరు 31.4, నాగులుప్పలపాడు 30.4, వెలిగండ్ల 27.0, సంతనూతలపాడు 26.8, దొర్నాల 23.6, దర్శి 21.6, బేస్తవారిపేట 21.2, పుల్లలచెరువు 19.0, పొదిలి 16.8, దొనకొండ 16.0, కేకేమిట్ల 14.2, అర్థవీడు 10.8, ముండ్లమూరు 10.4 మి.మీ. నమోదైంది. మిగిలిన మండలాల్లో కొద్దిపాటి జల్లులు పడ్డాయి.

జిల్లాలో 1077 హెక్టార్లలో పంట నష్టం

జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలకు 1077 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయాధికారులు ప్రాథమికంగా గుర్తించారు. 12 మండలాల పరిధిలో సజ్జ, మినము, ఆలసంద పంటలు దెబ్బతిన్నాయి, సజ్జ 310, మినుము 647, ఆలసంద 120 హెక్టార్లలో దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా అంచనా వేశారు ఆ మేరకు ప్రభుత్వానికి ప్రాథమిక నివేదికను వ్యవసాయ శాఖ అధికారులు పంపారు.



గానుగపాలెంలో సీసీరోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

గ్రామాల అభివృద్ధే 'పల్లె పండుగ' లక్ష్యం

- సంతనూతలపాడు ఎమ్మెల్యే విజయ్‌కుమార్

సంతనూతలపాడు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో వంద శాతం మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం 'పల్లె పండుగ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని ఎమ్మెల్యే విజయ్‌కుమార్ చెప్పారు. మండలంలోని మంగమూరు, సంతనూతలపాడు, రుద్రవరం గ్రామాల్లో 'పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా ఉపాధిహామీ పథకం కింద మంజూరైన రూ.1.45 కోట్లతో నిర్మించనున్న సీసీరోడ్డు, సైడుకాలువల నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. అనంతరం సంతనూతలపాడు గానుగపాలెంలో అధ్వానంగా ఉన్న రోడ్డును పరిశీలించారు. అంబేడ్కర్‌నగర్‌లోని డాక్టర్ బిఆర్.అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, రాష్ట్ర కార్యదర్శి అడకా స్వాములు, నాయకులు అబ్బూరి శ్రీనివాసరావు, రంపతోటి అంకారావు, కూకట్ల శరత్, నల్లూరి నారాయణరావు, బి.వై.ప్రసాద్, తన్నీరు శ్రీను, ఆర్.సురేష్, శంకర్, జడ్పీ సీఈవో, మండల ప్రత్యేక అధికారి చిరంజీవి, ఉపాధిహామీ పథకం పీడీ జోసెఫ్‌కుమార్, ఏపీడీ వెంకటస్వామి, జిల్లా వ్యవసాయశాఖ డైరెక్టర్ ఎస్.శ్రీనివాసరావు, ఏడీ రమేష్‌బాబు, ఎంపీడీవో డి.సురేష్‌బాబు, తహసీల్దార్ వి.ఆదిలక్ష్మి పాల్గొన్నారు. సంతనూతలపాడు, పి.గుడిపాడు గ్రామాల్లో జరిగిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమానికి ఎమ్మెల్యే బిఎన్.విజయ్‌కుమార్ హాజరై రైతులతో మాట్లాడారు. అనంతరం మినుముల మినీకిట్స్ ప్యాకెట్లను రైతులకు అందజేశారు.



మండవవారిపాలెంలో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జనార్దనరావు

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి : ఎమ్మెల్యే జనార్దన్

ఒంగోలురూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ చెప్పారు. ఒంగోలు మండలం దశరాజుపల్లి, మండవవారిపాలెం, వలేటివారిపాలెం గ్రామాలలో బుధవారం నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. తొలుత దశరాజుపల్లిలో సచివాలయ ఉద్యోగులతో మాట్లాడారు. గ్రామాభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేయాలని చెప్పారు. అనంతరం గ్రామస్థులు మాట్లాడుతూ ముదిగొండి వాగుపై వలేటివారిపాలెం, దశరాజుపల్లి గ్రామాల మధ్య వంతెన నిర్మించాలని, ఎస్సీకాలనీలో పాఠశాల ఏర్పాటు చేయించాలని, తాగునీటి చెరువును పూర్తిగా మరమ్మతులు చేయించాలని కోరారు. మండవవారిపాలెం గ్రామస్థులు మాట్లాడుతూ మంగమ్మ కళాశాల వద్ద నుంచి తారురోడ్డు నిర్మించాలని, ఫిల్టర్ బెడ్‌లకు నిధులు ఏర్పాటు చేయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమాలలో ఎంపీడీవో రాజశేఖరరావు, ఈఓఆర్డీ ఎ.బాలచెన్నయ్య, సర్పంచ్‌లు మండవ వెంకటసుబ్బయ్య, పులిచర్ల శ్రీలక్ష్మి, నేతలు నలమోతు బాలగంగాధర్, కామేపల్లి శ్రీనివాసరావు, పోలవరపు వెంకటరామయ్య, కె.ఉదయభాస్కర్, మారెళ్ల రామకృష్ణ, నాయకులు మండవ శ్రీధర్, మధుసూదనరావు, కారుమూడి గోపినాథ్, మాలంపాటి యానాదినాయుడు, పులిచర్ల మోహన్‌రెడ్డి, పాలేటి ప్రభాకర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి

మద్దిపాడు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని కొలచనకోటలో బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... కొలచనకోటకు చెందిన కొలచనకోట సాయికుమార్(30) ప్రైవేట్‌గా విద్యుత్ పనులు చేస్తుంటాడు. ఉదయాన్నే గ్రామంలో విద్యుత్ పనులు చేస్తుండగా షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. అతనికి భార్య తిరుపతమ్మ, కుమార్తె రెబక ఉన్నారు. సాయికుమార్‌ను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ నాయకులు తొట్టెంపూడి వెంకటశేషయ్య కోరారు. ఎస్సై శివరామయ్య సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సాయికుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

టెట్ పరీక్షకు 143 మంది గైర్హాజరు

ఒంగోలు విద్య, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో బుధవారం జరిగిన ఏపీ ఉపాధ్యాయ(టెట్) అర్హత పరీక్షకు 143 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. జిల్లాలో నాలుగు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా ఒంగోలులోని బ్రిలియంట్ కంప్యూటర్ సెంటర్, ఎన్‌సీఎస్ఐ పరీక్షా కేంద్రాల్లో మాత్రమే పరీక్ష నిర్వహించారు. మిగిలిన రెండు చోట్ల పరీక్ష నిర్వహించలేదు. పరీక్షకు 671 మంది అభ్యర్థులను కేటాయించగా 528 మంది పరీక్షకు హాజరయ్యారు. ఉదయం సెషన్‌కు 336 మంది అభ్యర్థులను కేటాయించగా 271 మంది, మధ్యాహ్న సెషన్‌కు 335 మందిని కేటాయించగా 257 మంది హాజరైనట్లు ప్రభుత్వ పరీక్షల సహాయ కమీషనర్ కే శివకుమార్ తెలిపారు.

అంధకారంలో సర్వజన ఆస్పత్రి

చీకటిలో రోగుల అవస్థలు

మార్కాపురం రూరల్, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): స్థానిక సర్వజన వైద్యశాలలో బుధవారం విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో చీకటిలో రోగులు అవస్థలు పడ్డారు. వైద్యశాలలో జనరేటర్ సౌకర్యం ఉన్నా సాంకేతిక కారణాలతో ఉపయోగించడం లేదు. బుధవారం ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సుమారు పది గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో వార్డులలో రోగులు, ఓపీలలో వైద్య సేవలు అందించేందుకు డాక్టర్‌లు ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ముఖ్యంగా గర్భిణులు, ఆపరేషన్ చేయించుకున్న రోగులు, చంటి బిడ్డలతో ఉన్న తల్లులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విద్యుత్ అంతరాయం సమస్యపై వైద్యశాల సూపరింటెండెంట్ సావిత్రిని వివరణ కోరగా స్పందించిన ఆమె మాట్లాడుతూ బుధవారం ఉదయం విద్యుత్ సరఫరా అవుతున్న వైర్లు షార్ట్ సర్క్యూట్ అవడంతో వైద్యశాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని తెలిపారు. వెంటనే మరమ్మతు పనులు ప్రారంభించామని, సాయంత్రం ఐదు గంటలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించామని ఆమె తెలిపారు.

వైద్యశాలను పరిశీలించిన సబ్ కలెక్టర్

సూపరింటెండెంట్‌పై ఆగ్రహం

మార్కాపురం రూరల్ : రోగులకు సత్వరమే మెరుగైన వైద్యసేవలు అందించాలని అలసత్వం వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సబ్‌కలెక్టర్ వెంకట్ సహదిత్ త్రివినాగ్ అన్నారు. స్థానిక సర్వజన వైద్యశాలను సబ్ కలెక్టర్ బుధవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యశాలలో ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా లేకపోతే ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరించాని వైద్యశాల సూపరింటెండెంట్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రోగులకు వైద్యం అందిచేందుకు అవసరమైతే మరిన్ని సౌకర్యాలను అందించాలని సూచించారు. వార్డులలో వైద్య సేవలు పొందుతున్న రోగులతో మాట్లాడి వారికి వైద్యశాలలో అందిస్తున్న సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

డీసీఎంఎస్‌లో అక్రమం

- ముగ్గురిపై కేసు నమోదు

ఒంగోలుక్రైం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్)లో నిధుల గోల్‌మాల్‌పై అధికారులు కదిలారు. ముగ్గురిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఒంగోలు తాలుకా సీఐ అజయ్‌కుమార్ తెలిపారు. గతంలో డీసీఎంఎస్ చైర్మన్‌గా పనిచేసిన రావి పద్మావతి, బిజినెస్ మేనేజర్ సతీష్, అకౌంటెంట్ బొమ్మరాజు రామచంద్రరావులపై కేసు నమోదు చేశామని అన్నారు. డీసీఎంఎస్‌లో సుమారు రూ.3.5 కోట్లు గోల్‌మాల్ అయ్యాయి. ప్రస్తుతం బిజినేస్ మేనేజర్‌గా ఉన్న రామచంద్రన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని చెప్పారు. ఇండియన్ పోటష్ లిమిటెడ్‌కు చెల్లించేందుకు డీసీఎంఎస్ ఖాతకు పొగాకు బోర్డు జమ చేసింది. అయితే ఆ మొత్తాన్ని అకౌంటెంట్ రామచంద్రరావు తన సొంత ఆకౌంటుకు బదిలీ చేసుకున్నారు. దీనిపై విచారణ చేసిన విచారణాధికారి మాలకొండయ్య రూ.52.95 లక్షలు దుర్వినియోగం అయినట్లు తెల్చారు. అందుకు కారకులైన అప్పటి డీసీఎంఎస్ చైర్మన్ రావి పద్మావతి, బిజినేస్ మేనేజర్ సతీస్, అకౌంటెంట్ రామచంద్రరావులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాల మేరకు ఒంగోలు తాలుకా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

బోధన పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

ఒంగోలు విద్య, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యా శిక్షణ పరిశోధన మండలిలో పొరుగు సేవల నిబంధనల కింద పనిచేసేందుకు ప్రొఫెసర్లు, అధ్యాపకుల నియామకానికి పాఠశాల విద్యా కమిషనర్ విజయకుమార్ రాజు నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ పోస్టులకు ఈనెల 16నుంచి 25లోపు దరఖాస్తు చేసుకోవచ్చు. వాటిని 28 నుంచి 30 వరకు పరిశీలిస్తారు. నవంబరు 4, 5 తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేస్తారు. డైట్ సీనియర్ లెక్చరరు, లెక్చరర్లు, సీటీఈ లెక్చరర్లు, ప్రభుత్వ, జడ్పీ హైస్కూళ్లలో పనిచేస్తున్న హెచ్‌ఎంలు, స్కూలు అసిస్టెంట్లు, 15 ఏళ్ల బోధన అనుభవం ఉన్న వారు అర్హులు. ఈ ఏడాది సెప్టెంబరు 29 నాటికి 58 ఏళ్లు నిండిన వారు అర్హులు. పీజీలో ఎమ్మెస్సీ, ఎంఏ, ఎంకాం విద్యార్హతలు, ఎంఈడీ ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చని కమిషనర్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.


సింగరాయకొండ మండలంలో పంట పొలాల్లో నిలిచిన నీరు

ముసురు.. కసురు

» భారీ వర్షానికి తడిసి ముద్దయిన ఊళ్లు » పొంగిన వాగులు » నిలిచిన రాకపోకలు » అక్కడక్కడా దెబ్బతిన్న పంట పొలాలు
» ఒంగోలులోని పలు ప్రాంతాలు అస్తవ్యస్తం » ముంపు ప్రాంతాల్లో పర్యటించిన కలెక్టర్, ఎస్పీ


కరవది-గుత్తికొండవారిపాలెం మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న ముదిగొండి వాగు

జలదిగ్బంధంలో అగ్రహారం

ఒంగోలు విద్య, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగర పాలక సంస్థ పరిధిలోని నర్సాపురం అగ్రహారం జలదిగ్బంధంలో చిక్కుకుంది. గ్రామానికి ఇరువైపులా ఉన్న నల్లవాగు, ఒంగోలు మురుగునీరు ప్రవహించే మొండివాగు, దక్షిణాన ఉన్న పెద్ద వాగులు భారీ వర్షాలకు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో అగ్రహారం ఓ లంకలా మారిపోయింది. దీంతో ఒంగోలు-అగ్రహారం మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. అంతేగాక పొలాలన్నీ జలమయమయ్యాయి. వేసిన పంటలు దెబ్బతింటాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి) : మూడురోజులుగా వీడని ముసురుతో ఒంగోలు నగరం తడిసి ముద్దయింది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి బుధవారం నగరం అస్తవ్యస్తంగా మారింది. లోతట్టు ప్రాంతాలు ముంపుతోపాటు బురదమయం కాగా, నగర ప్రధాన రహదారుల్లో నీరు నిలిచి, రాకపోకలకు ఇబ్బందిగా మారాయి. కాలువల్లో పూడికతీత పనులు పూర్తి స్థాయిలో చేయకపోవడంతో మురుగునీటికి వర్షపు నీరు తోడై రోడ్లపైకి ఎక్కాయి. భాగ్యనగర్‌లో పలు వీధుల్లో నీరు నిలిచి ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. స్థానిక కర్నూలురోడ్డు నుంచి మంగమూరు జంక్షన్‌కు వెళ్లే సర్వీస్ రోడ్లు మరింత అస్తవ్యస్తంగా తయారయ్యాయి. గడిచిన ఐదేళ్లలో కనీస అభివృద్ధి జరగకపోవడంతో రోడ్లన్నీ ప్రస్తుత వర్షానికి మరింత రోతగా తయారయ్యాయి. ఎక్కడికక్కడే నీరు నిలవడంతో కనీసం కాలినడకకూ కష్టంగా మారింది.


వానలో కర్నూలురోడ్డు...(ఇన్‌సెట్లో) ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్న కలెక్టర్ అన్సారియా, మేయర్ సుజాత

లోతట్టు ప్రాంతాలు మరీ అధ్వానం

నగరంలోని లోతట్టు ప్రాంతాలు, రహదారులు అస్తవ్యస్తంగా మారాయి. వెంకటేశ్వరకాలనీ, బలరాంకాలనీ, బిలాల్‌నగర్, కరుణా, మిలటరీ కాలనీ, బాలినేని భరత్‌కాలనీ, ఇందిరాకాలనీ, గుర్రం జాషువా కాలనీ, మదర్ థెరిస్సాకాలనీ, ప్రగతి కాలనీ, చినమల్లేశ్వర కాలనీతోపాటు కర్నూలురోడ్డు, నెల్లూరు బస్టాండ్, ఆర్టీసీ ఆవరణ, స్టేషన్ రోడ్, పలు ప్రాంతాలలో నీరు నిలిచి ప్రజలు, ఇబ్బందులు పడ్డారు. ఫుట్‌పాత్‌లపై అమ్మకాలు చేపట్టే చిరువ్యాపారులు, చెప్పులు కుట్టుకునేవారు, తోపుడు బండ్ల వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు.

ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు

డాక్టర్ కే వెంకటేశ్వరరావు, నగర కమిషనరు

భారీ వర్షాలకు నగర ప్రజలు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకుంటున్నాం. ప్రధాన డ్రెయిన్లలో పూడికతీత పనులు, చెట్ల తొలగింపు చర్యలు చేపట్టాం. శివారుకాలనీల్లోని ప్రజలకు ముందస్తుగా పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశాం. అలాగే కార్పొరేషన్ ఆధ్వర్యంలో టోల్‌ఫ్రీ నెంబరు ఏర్పాటు, క్విక్ రెస్పాన్స్ టీంలను నియమించాం. 24 గంటలూ అందుబాటులో ఉండాలని కార్పొరేషన్ అధికారులు, సిబ్బందిని ఆదేశించాం. వ్యాధులు విజృంభించకుండా బ్లీచింగ్, ఆయిల్ స్ప్రే వంటివి చల్లిస్తున్నాం.

సింగరాయకొండ, టంగుటూరు మండలాలను ముంచెత్తిన వాన

సింగరాయకొండలో జ్వాలాముఖి అమ్మవారి గుడిపై పిడుగు

టంగుటూరు/సింగరాయకొండ అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : కొండపి నియోజకవర్గాన్ని వాన ముంచెత్తింది. వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. సింగరాయకొండ, టంగుటూరు మండలాల్లో కుండపోత కురిసింది. సింగరాయకొండ మండలంలో లోతట్టు ప్రాంతాలైన సోమరాజుపల్లి పంచాయతీ పరిధిలోని అప్పాపురం జలమయమైంది. ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో భారీగా వర్షపు నీరు చేరింది. హనుమాన్‌నగర్‌లో ఆవాసాల మధ్య నీరు నిలిచింది. పీబీ చానల్ ఉధృతంగా ప్రవహిస్తోంది. పంట పొలాలు మునిగాయి. పాకల తీరంలో సముద్రం కూడా 10 మీటర్లు ముందుకొచ్చింది. అధికారుల ఆదేశాలతో మత్స్యకారులు వేటకు వెళ్లకుండా బోట్లను తీరంలో నిలిపివేశారు. పాకల జ్వాలాముఖి అమ్మవారి గుడిపై పిడుగు పడింది. దీంతో ఆలయ గోపురంపైన ఉన్న బొమ్మలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. పిడుగుపాటుకు ఇళ్లలోని విద్యుత్ ఉపకరణాలు కాలిపోయాయి.


ముసి వద్ద పరిస్థితిని పరిశీలిస్తున్న ఎస్సై, పోలీసులు

తడిసిముద్దయిన టంగుటూరు

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి టంగుటూరు పంచాయతీ పరిధిలోని పలు కాలనీలు జలమయమయ్యాయి. పోతుల వెస్ట్ కాలనీలో పరిస్థితి మరింత దయనీయంగా మారింది. అధికారులు కాలనీని సందర్శించి నీటికి బయటకు పంపించే పనులు చేపట్టారు. జమ్ములపాలెం కొత్త కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ లేదు. దీంతో వర్షపు నీరంతా కాలనీలో నిలిచిపోయింది. తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీవో దేవసేనకుమారి, హౌసింగ్ అధికారులు దగ్గరుండి ఎక్స్‌కవేటర్ కాలనీలో కాలువలు తీయించి నీటిని బయటకు పంపుతున్నారు. ఆలకూరపాడు జలదిగ్బంధంలో చిక్కుకుంది.

పొందూరు-కొణిజేడు మధ్య బంద్

భారీ వర్షాలకు ఇనగలేరు పొంగి ప్రవహిస్తోంది. పొందూరు-కొణిజేడు మధ్య రెండు రోజులుగా రాకపోకలు నిలిచిపోయాయి. ఇనగలేరు వైపు ఎవరూ వెళ్లకుండా గ్రామ సర్వేయర్, నౌకర్‌లను అధికారులు కాపలాగా ఉంచారు. ఆలకూరపాడు-పాతపల్లారెడ్డిపాలెం మధ్య ముసి కాజ్‌వే వద్ద పోలీసులు పహారా కాస్తున్నారు.


కొండపి వద్ద వాగుకు అడ్డు పెట్టి...

ఉధృతంగా వాగులు

కొండపి : భారీ వర్షాల కారణంగా మండలంలో ముసి, అట్లేరు చప్టాల పైనుంచి నీరు పారుతోంది. కొండపి-అనకర్లపూడి గ్రామాల మధ్య అట్లేరు, అనకర్లపూడి-మద్దులూరు గ్రామాల వైపు రాకపోకలను అధికారులు నిలిపివేశారు. రెవెన్యూ, పోలీసు సిబ్బంది వాగులకు అడ్డంగా దుంగలు, చెట్లు, ముళ్లకంప వేశారు. చినకండ్లగుంట గ్రామం వద్ద కొయ్యలవాగు, కొండపి-పెరిదేపి గ్రామాల మధ్య వాగు, చోడవరం గ్రామం వద్ద నల్లవాగుపై ఉన్న చప్టా, కె.ఉప్పలపాడు- ఎం.నిడమలూరు గ్రామాల మధ్య ముసివద్ద పరిస్థితిని తహసీల్దార్ పి.మురళి, ఎస్సై ప్రేమ్‌కుమార్ పరిశీలించారు. పోలీసు, రెవెన్యూ సిబ్బందిని అన్ని చోట్లా కాపలా ఉంచారు.

పంటకాలువను తలపిస్తున్న కొప్పోలు రోడ్డు

ఒంగోలురూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి) : మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో ఒంగోలు నగర పరిధిలోని కొప్పోలు రోడ్డు పంటకాలువను తలపిస్తోంది. ఫ్లైఓవర్ వంతెన నుంచి కొప్పోలు వర కు ఉన్న రోడ్డు నీటి ప్రవాహంతో నిండిఉంది. రోడ్డుపై గుంతలు పెద్దవి అవడంతో వాటి లోతు తెలియక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

కరవది-గుత్తికొండవారిపాలెం మధ్య రాకపోకలు బంద్

కరవది-గుత్తికొండవారిపాలెం మధ్య ముదిగొండి వాగు చప్టాపై నీటి ప్రవాహం ఉధృతంగా ప్రవహిస్తోంది. రాకపోకలు నిలిచిపోయాయి. జేసీ గోపాలకృష్ణ వాగును పరిశీలించారు.

ఆటోనగర్‌లో నిలిచిన పనులు

త్రోవగుంట దగ్గర ఆటోనగర్‌లో వర్షపు నీటితో నిండిపోవడంతో పనులు నిలిచిపోయాయి. అంతర్గత రోడ్లు పూర్తిగా నీటితో నిండిపోయాయి. కార్మికులకు పనులు లేకపోవటంతో ఇబ్బందులు పడుతున్నారు. నీటిని త్వరగా బయటకు పంపే ఏర్పాట్లు చేయాలని కార్మికులు కోరుతున్నారు.

తీరంలో ఎగిసిపడుతున్న అలలు

కొత్తపట్నం, ఆంధ్రజ్యోతి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి) : తుఫాన్ కారణంగా సముద్రం అల్లకల్లోలంగా మారింది. బుధవారం సాయంత్రానికి అలల ఉధృతి పెరగింది. మండలంలోని పలు గ్రామాలు జలమయమయ్యాయి. వాగులు పొంగిపొర్లుతున్నాయి. సంకువానిగుంట రోడ్డులో వాగు పొంగి పొర్లుతుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి. అధికారులు కొత్తపట్నం హైస్కూలు వద్ద వరద మోటార్ల ద్వారా తోడి మెరక చేయించారు. మండల ప్రత్యేక అధికారి వెంకటనాయుడు, తహసీల్దార్ మధుసూదనరావు, ఎంపీడీవో శ్రీకృష్ణ పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.




నల్లవాగును పరిశీలిస్తున్న అధికారులు

మంగమూరు-ఒంగోలు మధ్య నిలిచిన రాకపోకలు

సంతనూతలపాడు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు మండలంలోని మంగమూరు-ఒంగోలు మధ్య ఉన్న నల్లవాగు పొంగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే మాచవరం, మద్దులూరు గ్రామాల మధ్య ఉన్న ఇనగలేరు వాగుపొంగడంతో రాకపోకలు ఆగిపోయాయి. తహసీల్దార్ బి.ఆదిలక్ష్మి నల్లవాగు వద్ద పరిస్థితిని గమనించారు. పి.తక్కెళ్లపాడులో కాలువ పొంగడంతో ఈఓఆర్డీ రమణమ్మ ఎక్స్‌కవేటర్‌తో సమస్యను పరిష్కరించారు. పొంగుతున్న వాగుల వద్ద ఎస్సై అజయ్‌బాబు బందోబస్త్ ఏర్పాటుచేశారు.

మద్దిపాడులో దంచికొట్టిన వర్షం

మద్దిపాడు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలో వాన దంచి కొట్టింది. ఎగువ ప్రాంతంలో వర్షాల కారణంగా గుండ్లకమ్మ ప్రాజెక్టులోకి 13 వేల క్యూసెక్కులు వరద నీరు చేరుతుండడంతో అధికారులు అప్రమత్తమై 17 వేల క్యూసెక్కుల నీటిని నాలుగు గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు. నేలటూరు-గురవారెడ్డి పాలెం, పెద్దకొత్తపల్లి చప్టాపై వరద నీరు పారుతుండడంతో రాకపోకలు నిలిపేసి రెవెన్యూ, పంచాయతీ కార్యదర్శులు, పోలీసులు అక్కడ పర్యవేక్షిస్తున్నారు. మద్దిపాడులో హైవే ప్రాంతం జలమయమైంది. గుండ్లాపల్లి, అన్నంగి, ఘడియపూడి కాలనీ ప్రాంతాల్లో పొలాల్లో నీరు చేరాయి. మండల పరిధిలో పొంగిన వాగులను ఎస్సై శివరామయ్య పరిశీలించారు. లింగంగుంట గ్రామంలో నీరు నిలవడంతో సర్పంచ్ కళ్యాణి సహాయక చర్యలు చేపట్టారు.


వాగు పొంగడంతో రాకపోకలు నిలిపేసిన అధికారులు, పోలీసులు

కల్వర్టులను పరిశీలించిన తహసీల్దార్, ఎంపీడీవో

మండలంలోని ఏడుగుండ్లపాడు, నేలటూరు, పెద్దకొత్తపల్లి, అన్నంగి, బూరేపల్లి కల్వర్టులను ఎంపీడీవో వీ.జ్యోతి, తహసీల్దార్ సృజనకుమార్‌లు పరిశీలించారు. ఆ తర్వాత ఏడుగుండ్లపాడు దళితకాలనీలో చేరిన వర్షపు నీటిని బయటికి పంపించే విధంగా చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో వీఆర్వోలు వెంకటరమణారావు, మీరావలి, పర్వతరెడ్డి శేషారావు, అంకమ్మరావు, రంగారావు, దిలీప్, ఏడుగుండ్లపాడు సర్పంచ్ దాసరి శిల్ప సౌందర్య, టీడీపీ నాయకులు దాసరి రమేష్‌బాబు, మండవ హరిప్రసాద్, మండవ వెంకటస్వామి, అలా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా దేవతా విగ్రహాల ప్రతిష్ఠ

మద్దిపాడు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని నందిపాడు బగంగా పార్వతీ కాశీవిశ్వేశ్వర స్వామి దేవాలయంలో బుధవారం అయ్యప్ప స్వామి, సరస్వతీ దేవి అమ్మవారి విగ్రహాల ప్రతిష్ఠ అంగరంగ వైభవంగా జరిగింది. వేద పండితులు శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

డీఎస్‌వోకు అభినందనలు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి(డీఎస్‌వో)గా బాధ్యతలు స్వీకరించిన పద్మశ్రీని రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నాయకులు అభినందించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఎస్‌వో కార్యాలయంలో పద్మశ్రీని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆర్‌వీఎస్ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి బొకే ఇచ్చి అభినందించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి దానియేలు, కలెక్టరేట్ యూనిట్ అధ్యక్షుడు ఊతకోలు శ్రీనివాసరావు, కోశాధికారి ప్రశాంత్, సల్మాన్ పాల్గొన్నారు.

పీఏసీ సమావేశంలో మాగుంట

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : బెంగళూరులో బుధవారం జరిగిన పబ్లిక్ అకౌంట్స్ కమిటీ(పీఏసీ) సమావేశంలో ఆ కమిటీ సభ్యుడు, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు. కమిటీ చైర్మన్ కేసీ వేణుగోపాల్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఎంపీ మాగుంట రెవెన్యూశాఖ అధికారులకు పలు సూచనలు చేశారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

పొన్నలూరు (కొండపి), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని వెంకుపాలెంలో రూ.20 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు టీడీపీ మండల అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు బుధవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుజాత, పీఆర్ ఏఈ కోటేశ్వరరావు, గ్రామ నాయకులు మాదాల ప్రసాద్, మాదాల కోటేశ్వరావు, తానికొండ మహేంద్ర పాల్గొన్నారు.

ఊరి చివరనే మద్యం షాపులు

కొండపి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : లాటరీ ద్వారా మద్యం దుకాణాలు పొందిన వారు కొండపికి వెలుపల మద్దులూరు రోడ్డులో వాటిని ఏర్పాటు చేశారు. బుధవారం నుంచి విక్రయాలను ప్రారంభించారు. నివాసాల మధ్య షాపులు ఏర్పాటు చేయొద్దని ప్రజలు మంత్రి స్వామికి విజ్ఞప్తి చేశారు. దీంతో గ్రామానికి దూరంగా దుకాణాలు ఏర్పాటు చేయాలని మంత్రి ఎక్సైజ్ అధికారులను ఆదేశించడంతో వారు అందుకు అనుగుణంగా చర్యలు తీసుకున్నారు.

కంది, మిర్చి పొలాల్లో నీరు నిల్వ ఉంచొద్దు

కొండపి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రైతులు కంది, మిరప పంటల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని వ్యవసాయశాఖాధికారి డి.విజయకుమార్ సూచించారు. బుధవారం మండలంలోని ఇలవర(నేతివారి పాలెం), కటావారిపాలేలో కంది, మిరప పంటలను ఆయన పరిశీలించారు.

నిస్వార్థ సేవకుడు గుమ్మళ్ల

పొన్నలూరు (కొండపి), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు నిస్వార్థంగా సేవలందించిన నాయకుడు కొండపి ఏఎంసీ మాజీ చైర్మన్ గుమ్మళ్ల మాలకొండయ్య అని పలువురు వక్తలు కొనియాడారు. మాలకొండయ్య 6వ వర్ధంతి ఆయన స్వగ్రామమైన నాగిరెడ్డిపాలెంలో బుధవారం జరిగింది. టీడీపీ మండల అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు, నాయకులు కర్నా కోటిరెడ్డి, కంటుగోపి, అనుమోలు సుధాకర్, మాలకొండయ్య కొడుకు గుమ్మళ్ల వెంకటరావు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా మాలకొండయ్య కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు.


గుమ్మళ్ల చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న టీడీపీ నేతలు

ఘనంగా శిద్దా సుధీర్‌కుమార్ పుట్టినరోజు వేడుకలు

చీమకుర్తి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు శిద్దా సుధీర్‌కుమార్ పుట్టినరోజు వేడుకలను బుధవారం గోల్డెన్ గ్రానైట్ జనరల్ మేనేజర్ ఏ.గిరిబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చీమకుర్తి పట్టణంలోని గంగాకాలనీలో రెండువందల గిరిజన కుటుంబాలకు దుప్పట్లు పంపిణీ చేశారు. పాటిమీదపాలెం ప్రభుత్వ పాఠశాలలో మొక్కలు నాటారు. బధిరుల పాఠశాల విద్యార్థుల సమక్షంలో కేక్ కట్ చేశారు. గుంటిగంగ వృద్ధాశ్రమంలో భారీ కేక్‌ను కట్‌చేశారు. ఈ కార్యక్రమాల్లో మేనేజర్ ఏ.గిరిబాబు, టీడీపీ నాయకులు కాట్రగడ్డ రమణయ్య, కందిమళ్ల గంగాధరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ కొత్రపు రాఘవరావు, గ్రానైట్ వ్యాపారులు బొమ్మిశెట్టి రవికిరణ్, జీ.శ్రీహరి, నూకల సురేంద్ర, హనుమంతరావు, జి.మధుబాబు, ఎం.వెంకట్రావు, అశోక్, రవి, గోపి, సత్యనారాయణ పాల్గొన్నారు.


దుప్పట్లు పంపిణీ చేస్తున్న గిరి తదితరులు

అవీ..ఇవీ

ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు

గిద్దలూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : గిద్దలూరు మండలం దిగువ మెట్ట గ్రామానికి చెందిన ఆర్లగడ్డ వంశీకుమార్ అనే యువకుడు ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకున్నాడు. వంశీకుమార్ ఇటీవల తన చిత్రకళలో భాగంగా బూజుతో మదర్‌థెరిస్సా ఫొటోను వేయగా ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకున్నాడు. వంశీకుమార్‌కు ఇంటర్నేషనల్ వరల్డ్ రికార్డ్స్ ఆఫ్ ఎక్సలెన్స్ సంస్థ ఆ మేరకు ప్రశంసాపత్రాన్ని, మెడల్‌ను పంపించింది.



అవార్డుతో వంశీకుమార్

ఎంఈవోలకు షోకాజ్ నోటీసులు

కంభం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) :విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన కంభం, అర్ధవీడు ఎంఈవో 2లు అయిన శార్వాణి, లక్ష్మీనారాయణలకు జిల్లా విద్యాశాఖ కార్యాలయం నుంచి షోకాజ్ నోటీసులు అందాయి. ఈనెల 5వ తేదీన ఒంగోలులో జరిగే ఎంఈవోల మీటింగ్‌కు హాజరు కావాలని ఉత్తర్వులు వచ్చినా గైర్హాజరయ్యారు. సీసీఏ రూల్స్ ప్రకారం మీపై ఎందుకు క్రమశిక్షణ చర్యలు తీసుకోకూడదో తెలుపాలని బుధవారం షోకాజ్ నోటీసులు పంపారు. ఈ నోటీసులు అందిన 3 రోజుల్లో సంజాయిషీ తెలుపాలన్నారు.

పంటల యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన



మాల్యవంతునిపాడులో పత్తి పంటను పరిశీలించి సూచనలు తెలియజేస్తున్న అధికారులు

మార్కాపురం రూరల్ అక్టోబరు16 (ఆంధ్ర జ్యోతి): వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటల యాజమాన్య పద్ధతులపై మాల్యవంతుని పాడు, కోలభీమునిపాడు గ్రామాలలోని రైతులకు బుధవారం అధికారులు అవగాహన కల్పించారు. కంది, వరి, పత్తి , పొగాకు పంటలను పరిశీలించి పలు సలహాలు, సూచనలు తెలియజేశారు. వ్యవసాయాధికారి దేవిరెడ్డి శ్రీనివాసులు, ఉద్యాన శాఖాధికారి రమేష్‌లు రైతులకు పలు సలహాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కోలభీమునిపాడు సర్పంచ్ సుబ్బారెడ్డి, సేవా కేంద్రాల సిబ్బంది నాగమణి, సంధ్య, రైతులు పాల్గొన్నారు.



కంభం చెరువుకట్ట వద్ద అధికారులకు సూచనలు చేస్తున్న జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ

కంభం చెరువు పరిశీలన

కంభం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : అల్పపీడన ప్రభావంతో కంభం, అర్ధవీడు మండలాల్లో భారీ వర్షాలతో వరద వచ్చే అవకాశం ఉందని కలెక్టర్ తమీమ్ అన్సారియా ప్రజలను హెచ్చరించిన నేపథ్యంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ బుధవారం సాయంత్రం కంభం చెరువును పరిశీలించారు. ప్రస్తుతం కంభం చెరువులో 10 అడుగుల మేర నీరు ఉందని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. ఈప్రాంతంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు చేసిన హెచ్చరికలతో అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ కిరణ్, ఇతర అధికారులకు జాయింట్ కలెక్టర్ సూచించారు.



గుండ్లకమ్మ నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న అధికారులు

వర్షాలపై అధికారుల సమీక్ష

త్రిపురాంతకం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం కురుస్తున్న వర్షాల నేపథ్యంలో పరిస్థితులను పరిశీలించేందుకు తహసీల్దారు జి.శ్రీనివాస్, ఎంపీడీవో రాజ్‌కుమార్, ఈవోపీఆర్‌డీ రామసుబ్బయ్యలు మండలంలోని పలు గ్రామాలలో బుధవారం పర్యటించారు. ముడివేముల, వెల్లంపల్లి, మిరియంపల్లి గ్రామాలలోని గుండ్లకమ్మ నది నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో నీటి ప్రవాహం పెరిగితే తీసుకోవాల్సిన చర్యలు, ప్రజలను అప్రమత్తం చేయడం వంటి అంశాలపై గ్రామస్థాయి అధికారులకు పలు సూచనలు చేశారు. మిరియంపల్లి గ్రామ సచివాలయాన్ని పరిశీలించి వర్షాల పరిస్థితులపై సమీక్షించారు. పలు సూచనలు చేశారు.

రాయితీపై పప్పు శనగలు

పెద్ద దోర్నాల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి):రబీ సీజనులో సాగుచేసేందుకు ప్రభుత్వం 25శాతం రాయితీతో పప్పు శనగల విత్తనాలు మంజూరు చేసిందని మండల వ్యవసాయాధికారి జవహర్ లాల్ నాయక్ అన్నారు. మండలంలోని ఐనముక్కల గ్రామంలో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో సాగు చేసిన మిరప పైరును పరిశీలించారు. రైతులకు సస్య రక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలానికి 50 క్వింటాళ్లు మంజూరయ్యాయని, కావలసిన రైతులు రైతు సేవా కేంద్రంలో నమోదు చేసుకోవాలని సూచించారు. వీహెచ్‌ఏ సుస్మిత, వీఏఏ శివ నాయక్, విశ్వనాథ్, పార్వతీభాయి, రైతులు పాల్గొన్నారు.

రెండోరోజుకు మున్సిపల్ కార్మికుల దీక్షలు

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 16 ఆంధ్రజ్యోతి: మున్సిపల్ కార్మికుల పట్ల అధికారులు మొండివైఖరి విడనాడాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ అన్నారు. అక్రమంగా తొలగించిన మున్సిపల్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు చేస్తున్న రెండో రోజు దీక్షలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి కార్మికులను తొలగించి వారిని వీధిపాలు చేయటం ఏమిటని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కె.సుబ్బరాయుడు, రమణ, సలాంఖాన్, యూసుఫ్, దొడ్డా శేషిరెడ్డి, అల్లూరయ్య, సుబ్బారెడ్డి, మరియదాసు, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

రూ.కోట్ల విలువైన స్థలంపై నేతల కన్ను

● పొదిలిలో రెచ్చిపోతున్న అక్రమార్కులు ● బస్టాండ్ సెంటర్‌లో రాత్రికి రాత్రే మరుగుదొడ్ల కూల్చివేత ● నిద్రావస్థలో అధికారులు ● ప్రయాణికులకు అవస్థలు



మంగళవారం అర్ధరాత్రి పూర్తిగా నేలమట్టం చేసిన మరుగుదొడ్లు

పొదిలి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : నగరపంచాయతీ అధికారుల నిద్రావస్థను అదునుగా చూసుకొని పట్టణంలో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ప్రభుత్వ స్థలాలు ఎక్కడ కనపడితే అక్కడ కబ్జాదారులు గద్దల్లా వాలిపోతున్నారు. పెద్దబస్టాండ్ సెంటర్‌లో వైసీపీ పాలనలో పాక్షికంగా పగులగొట్టారు. నేడు టీడీపీ ప్రభుత్వ హయాంలో మరుగుదొడ్లను మంగళవారం అర్ధరాత్రి పూర్తిగా నేలమట్టం చేసిన ఘటనే ఇందుకు నిదర్శనం. పట్టణ నడికూడలి అంతేకాదు.. నాలుగురోడ్ల జంక్షన్.. అందులో 24 గంటలు కాపలాకాసే సీసీ కెమెరాలు ఉన్నాయి. వీటన్నింటి కళ్లుకప్పి అధికారులకు తెలియకుండా కూల్చివేశారు. పొదిలి పట్టణంలోని పెద్దబస్టాండ్ కూడలి ప్రాంతంలో కోట్ల రూపాయలు విలువచేసే స్థలాలు ఇలా అన్యాక్రాంతమై



ఏడాది క్రితం వైసీపీ నేతలు కూల్చివేసిన కొన్ని మరుగుదొడ్లు (ఫైల్)

పోతున్నా నగరపంచాయత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. పట్టణ ప్రజలతోపాటు వివిధ అవసరాలకోసం పొదిలికి వచ్చే ప్రయాణికులకు మరుగుదొడ్లు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. అత్యవసర సమయాల్లో మహిళలు సైతం మరుగుదొడ్లను వినియోగించుకునేవారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆ కోట్లాది రూపాయల విలువైన స్థలంపై అక్రమార్కుల కన్ను పడింది. నేతల అండదండలతో ఏడాది క్రితం అర్ధరాత్రి సమయంలో మరుగుదొడ్లను కొందరు వ్యక్తులు ధ్వంసం చేశారు. అప్పట్లో ఈఘటనపై లీజుదారుడు పొదిలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆరువాత కేసు నమోదు చేశారు. ఏడాది దాటినప్పటికి అక్రమార్కులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై ప్రజల్లో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పెద్దబస్టాండ్ కూడలిలో మరుగుదొడ్లు లేకపోవడంతో మహిళా ప్రయాణికులు తీవ్రఇబ్బందులకు గురవుతున్నారని పలువురు ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోలేదు. ఇప్పటికైనా నగరపంచాయతీ అధికారులు అక్రమార్కుల బారినుండి విలువైన నగరపంచాయతీ స్థలాన్ని కాపాడటంతోపాటు మరుగుదొడ్లను పునర్నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

వర్షాలకు తోడు ఈదురుగాలులు



వర్షాలకు దెబ్బతిన్న మిరప తోటను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖాధికారిణి

నేలవాలిన అరటి, బొప్పాయి
మిర్చి చేలల్లో నిలిచిన నీరు
రైతుల కన్నీటిపర్యంతం

గిద్దలూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ కారణంగా మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు, ఈదురు గాలులకు పండ్లతోటల యజమానులు తీవ్రంగా నష్టపోయారు. గిద్దలూరు, రాచర్ల మండలాల్లో అరటి, మిరప పంటలు సాగు చేసిన రైతులకు ఈ తుఫాన్ కన్నీళ్లను మిగిల్చింది. సుమారు 70 ఎకరాల్లో అరటిచెట్లు నేలవాలాయి. రాచర్ల మండలం ఆకవీడు గ్రామంలో ఎస్.చిన్నఈశ్వరయ్య 6.5 ఎకరాల మేర అరటితోట సాగు చేయగా సుమారు 1000కి పైగా కాపులో ఉన్న అరటిచెట్లు కూలిపోవడంతో రైతు తీవ్ర ఆవేదనకు గురయ్యాడు. అలాగే మిరప సాగు చేస్తున్న రైతులకు కూడా తుఫాన్ నష్టాన్ని మిగిల్చింది. మిరప తోటల్లో నీరు నిలబడి పోవడంతో మొక్కలు వాలిపోయాయి. అలాగే బొప్పాయి తోటల్లో కూడా ఈదురు గాలులకు కొన్ని చెట్లు పడిపోయాయి. కొన్ని పంటలకు ఈ వర్షం జీవం పోసినప్పటికీ ముఖ్యంగా అరటి, మిరప, బత్తాయి రైతులకు మాత్రం నష్టాన్ని మిగిల్చింది. కూరగాయల తోటల్లో సైతం నీరు ఎక్కువగా ఉండడంతో నాణ్యత, దిగుబడులపై ప్రభావం కనిపించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

మిరప పైరు పరిశీలన

తుపాన్ కారణంగా కురిసిన వర్షాలతో మిరప పంటకు కొంతమేర నష్టం వాటిల్లింది. రాచర్ల మండలంలోని చోళ్ళవీడు, జేపీచెరువు, చినగానిపల్లి, అనంపల్లి గ్రామాలలో సాగైన మిరపలో వర్షం నీరు నిలిచిపోయింది. ఉద్యాన శాఖాధికారిణి విష్ణుప్రియ మిరప పైరును పరిశీలించారు. పొలాల్లో నిలువ ఉన్న నీటిని కాలువలు చేసి వెంటనే బయటకు పంపాలని రైతులకు సూచించారు. లీటరు నీటికి 5 గ్రాముల యూరియా చొప్పున కలిపి మొక్కలపై పిచికారీ చేయాలని సూచించారు. వేరుకుళ్లు ఆశించకుండా లీటరు నీటిలో 3 గ్రాముల కాపర్ ఆక్సి క్లోరైడ్ కలిపి మొక్క మొదలు వద్ద వేరు తడిచేలా పోయాలని సూచించారు. అరటి, బొప్పాయి తోటల్లో సైతం నీరు నిలబడగా ముందు జాగ్రత్తగా మొక్కలకు ఊతం అందించాలని సూచించారు.

కూలిన పెంకుటిల్లు



గోగులదిన్నెలో కూలిన పెంకుటిల్లు

మార్కాపురం రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని గోగులదిన్నె గ్రామంలో బుధవారం పెంకుటిల్లు కుప్పకూలి పోయింది. ఇంటి యజమాని అంబలపూడి పిచ్చమ్మ వెంటనే అప్రమత్తమై ఇంట్లో నుంచి బయటకు పరుగులు తీయడంతో స్వల్ప గాయాలతో బయట పడింది. అధికారులు తనకు సహాయం అందించేందుకు కృషి చేయాలని బాధితురాలు కోరుతున్నారు.



రాచర్ల మండలం ఆకవీడులో పడిపోయిన అరటిచెట్లు

కంభం, అర్ధవీడు మండలాల్లో..

కంభం, : తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు పంటలు ఉరకెత్తకుండా తెగుళ్ల బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను ఉద్యాన శాఖాధికారిణి శ్వేత, వ్యవసాయ శాఖాధికారిణి స్వరూప రైతులకు సూచించారు. బుధవారం కంభం మండలంలోని మదారుపల్లి, నర్సిరెడ్డిపల్లి గ్రామాలలో మిరప పంటను పరిశీలించారు. మిరప, పత్తి పంటలను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. అర్ధవీడు మండలంలోని నాగులవరం, బొమ్మిలింగం గ్రామాలలో పంటలను కూడా పరిశీలించారు.



బాదినేనిపల్లి వద్ద పులివాగును పరిశీలిస్తున్న జేసీ గోపాలకృష్ణ

పల్లెల్లో అభివృద్ధి పరుగులు / ఎమ్మెల్యే నారాయణరెడ్డి

తర్లుపాడు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అభివృద్ధే లక్ష్యంగా పల్లె పండుగ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని బుడ్డపల్లెలో రూ.3.60 కోట్లతో నిర్మించనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గ్రామ పంచాయతీల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. గత టీడీపీ హయాంలో నియోజకవర్గంలో 85 కి.మీ. సీసీ రోడ్లు వేస్తే వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో కేవలం 7 కి.మీ మాత్రమే వేసిందని విమర్శించారు. గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అలాగే వైసీపీ ప్రభుత్వంలో అధికారులు అక్రమాలకు పాల్పడి ఫ్రీ హోల్డ్ భూములు చేశారని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. త్వరలో వాటిపై విచారణ చేయిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎస్.భూలక్ష్మీ, జడ్పీటీసీ వెన్నా ఇందిరా, సర్పంచ్ డి.పెద్దమస్తాన్, మండల టీడీపీ అధ్యక్షులు ఉడుముల చిన్నపురెడ్డి, పంచాయతీరాజ్ డీఈ రవిప్రకాష్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ లక్ష్మీనాయక్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో చిన్నకొండయ్య, ఎంపీడీవో టి.సుకుమార్, తహసీల్దార్ ఉదయ్ కుమార్, నంద్యాల కాశయ్య, మోరా వెంకటరెడ్డి, టి.శ్రీను, పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కందుల

పులివాగును పరిశీలించిన జేసీ

కొమరోలు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) :స్థానిక జడ్పీ రహదారిలోని పులివాగును బుధవారం జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ పరిశీలించారు. వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రాకపోకలను పూర్తిగా అధికారులు నిలుపుదల చేశారు. మార్కాపురం స్పెషల్ కలెక్టర్ వెంకట సువిధ వినోద్‌తో కలిసి పరిశీలించిన జేసీ సంబంధిత అధికారులకు పలు సూచనలను ఇచ్చారు. తుఫాన్ వల్ల మండలంలో ఎక్కడా ప్రజలకు ఇబ్బందిరాకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. జేసీ వెంట తహసీల్దార్ భాగ్యలక్ష్మి, ఎస్ఐ వెంకటేశ్వర్లు నాయక్, ఈవోఆర్‌డీ దేవరశెట్టి బ్రహ్మయ్య, వీఆర్వో రాజేశ్వరి, రమణారావు తదితరులు ఉన్నారు.

రికార్డుల పరిశీలన జేసీ

కొమరోలు తహసీల్దార్ కార్యాలయంలో జేసీ గోపాలకృష్ణ రికార్డులను పరిశీలించారు. కొమరోలు మండల పర్యటనకు వచ్చిన ఆయన తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులతో పాటు గదులను, పరిసరాలను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో పలు అంశాలపై మాట్లాడారు. వారికి పలు సూచనలు చేశారు.

లోతట్టు ప్రాంతాలలో ఎమ్మెల్యే పరిశీలన

- అధికారులకు సూచనలు

గిద్దలూరు టౌన్, అక్టోబరు 16 : తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా చూడాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని వివేకానంద కాలనీలోకి వర్షం నీరు చేరడంతో వెంటనే ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ఆప్రాంతానికి చేరుకుని పరిశీలించారు. డ్రైనేజీలు లేకపోవడం వల్లనే వర్షం నీరు ఇళ్లలోకి చేరిందని మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు రావడంతో అక్కడ చేరుకున్న నీటిని దారి మళ్లించాలని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా శాశ్వత పరిష్కారం చేయాలని అధికారులను ఆదేశించారు. నంద్యాల రోడ్డులోని సగిలేరు వాగు ప్రవాహాన్ని పరిశీలించారు. ప్రజలకు ఏ అవసరం వచ్చినా కంట్రోల్ రూమ్ నెంబరుకు ఫోన్ చేయవచ్చని తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వలన ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. సమస్యను తెలుసుకున్న వెంటనే తమ ప్రాంతానికి చేరుకుని సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డికి కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే వెంట నగర పంచాయతీ కమిషనర్ వెంకటదాస్, తహసీల్దార్ ఆంజనేయరెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షులు షానేషావలి, టీడీపీ నాయకులు దప్పిలి శ్రీనివాసరెడ్డి, సిద్దా రమేష్‌యాదవ్, శివారెడ్డి తదితరులు ఉన్నారు.



సగిలేరు బ్రిడ్జి వద్ద అధికారులకు సూచనలు ఇస్తున్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి



జాతీయ రహదారిపై నికరంపల్లి వద్ద అదుపుతప్పి బోల్తా పడ్డ లారీ

అదుపుతప్పి లారీ బోల్తా

మార్కాపురం రూరల్, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నికరంపల్లి గ్రామం వద్ద అమరావతి - అనంతపురం జాతీయ రహదారిపై బుధవారం లారీ అదుపుతప్పి బోల్తా పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎరువుల లోడుతో కంభం వైపు నుంచి విజయవాడ వైపునకు వెళుతున్న లారీ అదుపుతప్పి నికరంపల్లి వద్ద జాతీయ రహదారిపై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు, క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. రూరల్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

గ్రామాల్లో రాజకీయాలకు అతీతంగా పనులు : ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం(పుల్లలచెరువు)అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణమే లక్ష్యం అని టీడీపీ వైపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు.బుధవారం ఎర్రగొండపాలెం పట్టణంలోని స్టేట్ బ్యాంకు రోడ్డులోని వేగినాటి కోటయ్య బజారులో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఎర్రగొండపాలెం పట్టణంలో రూ. 1.40 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల పాలనలో నియోజకవర్గంలో రూ. 15 కోట్లతో సీసీ రోడ్లు మంజూరయ్యాయని అన్నారు. గ్రామాల్లో రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులు చేసి ప్రభుత్వానికి, చంద్రబాబుకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, టీడీపీ మండలాధ్యక్షులు చేకూరి సుబ్బయ్య టీడీపీ ముఖ్య నాయకులు వేగినాటి శ్రీనివాస్, కాకర్ల కోటయ్య గోళ్ళ సుబ్బారావు, మహేష్ నాయుడు, వలీ, చీదేళ్ల నాగేశ్వరరావు, చేదూరి కిషోర్ ,సర్పంచి అరుణాబాయి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎర్రగొండపాలెంలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న టీడీపీ వైపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు

భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్యాయత్నం

మార్కాపురం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): భర్త వేధింపులు తాళలేక ఓ మహిళ నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పట్టణ ఎస్సై సైదుబాబు కథనం మేరకు.. పట్టణంలోని కొండారెడ్డి కాలనీకి చెందిన దద్దనాల మల్లిఖార్జునకు హోమ్‌గార్డ్స్ కాలనీకి చెందిన జ్యోతితో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. వారికి ఒక కుమారుడున్నాడు. గత కొన్ని నెలలుగా మల్లిఖార్జున అన్న భార్య చెప్పుడు మాటలు విని భార్య జ్యోతిని వేధిస్తున్నాడు. ఈ క్రమంలో గత కొన్నాళ్లుగా జ్యోతి హోమ్‌గార్డ్స్ కాలనీలోని తల్లి వద్ద ఉంటోంది. ఫోన్‌లో మల్లిఖార్జున వేధింపులు ఎక్కువ కావడంతో మనో వేదనకు గురైన జ్యోతి మంగళవారం రాత్రి ఇంట్లోవున్న నిద్రమాత్రలు మింగింది. ఎంతసేపటికి నిద్రలేవకపోయేసరికి అనుమానం వచ్చిన ఆమెతల్లి వెంటనే ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించింది. ప్రాథమిక చికిత్సలు చేసిన వైద్యులు ప్రాణాపాయం లేదని తేల్చారు. ఈ మేరకు పట్టణ ఎస్సై సైదుబాబు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

న్యూస్ బాక్స్



బోడవాడలో వర్షాలకు కూలిన బ్యారన్ గోడ

వర్షానికి పడిపోయిన పొగాకు బ్యారన్ గోడ

పామూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోడవాడ గ్రామంలో కురుస్తున్న వర్షం ప్రభావంతో దొడ్డ ఈశ్వరమ్మ, ఇల్లూరి మాలకొండయ్య, బంక రమణయ్యలకు చెందిన పొగాకు బ్యారన్ గోడలు దెబ్బతిని కూలిపోయాయి. ఈ ప్రమాదంలో బ్యారన్ పొయ్యి గొట్టాలు, టైర్లు, కర్ర పూర్తిగా ధ్వంసమై సుమారు రూ.2 లక్షలు నష్టం వాటిల్లిందని బాధిత రైతులు తెలిపారు. గ్రామంలో వర్షం నీరు ఇళ్లల్లోకి చేరడంతో సర్పంచ్ ఎక్స్‌కవేటర్ సహాయంతో సైడ్ కాలువలు తీసి నీటిని మళ్లించారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు కోటిలింగం దాసరి రత్తయ్య, ఐటీడీపీ కోఆర్డినేటర్ మల్లికార్జున పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

కురిచేడు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పొలాల్లో వర్షపు నీరు నిలబడితే యాజమాన్య పద్ధతులు పాటించి పంటలను రక్షించుకోవాలని మండల వ్యవసాయాధికారి మధుబాబు సూచించారు. బుధవారం మండలంలోని కల్లూరు, పడమర కాశీపురం గ్రామాలలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులకు యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా శిద్దా సుధీర్ జన్మదినం

దర్శి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు, పారిశ్రామిక వేత్త శిద్దా సుధీర్ జన్మదిన వేడుకలను బుధవారం దర్శిలో ఘనంగా నిర్వహించారు. శిద్దా యూత్ ఆధ్వర్యంలో వ్యక్తిగత కార్యదర్శి మందాది సుబ్బారావు, ఆర్యవైశ్య సంఘం నాయకుడు బొగ్గవరపు సుబ్బారావు తదితరులు పుట్టినరోజు కేకు కట్ చేసి అభిమానులకు పంచారు. షిర్డి సాయిబాబా, వెంకటరమణ ఆశ్రమాల్లోని వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో అచ్చనాల కోటి, కంచెర్ల శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

దర్శిలో వ్యక్తి ఆత్మహత్య

దర్శి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): దర్శి సమీపంలోని సాగర్ కాలువలో పడి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని కొత్త వెంకటాపురం గ్రామానికి చెందిన జింకల హరిచంద్రారెడ్డి(38) ఈనెల 15 నుంచి కనిపించటం లేదు. రెండురోజులు గడిచినా ఇంటికి రాకపోవటంతో కుటుంబసభ్యులు పలుచోట్ల వెతికారు. కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో సాగర్ కాలువపై దర్శి-లంకోజనపల్లి రోడ్డు సమీపంలో హరిచంద్రారెడ్డికి చెందిన మోటార్‌సైకిల్ కనిపించింది. అనుమానంతో కాలువలో వెతకగా పవర్ ప్రాజెక్టు వద్ద సాగర్ కాలువలో మృతదేహం లభించింది. దర్శి ఎస్సై ఎం.మురళి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆర్థిక సమస్యలే ఆత్మహత్యకు కారణంగా భావిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

41 మద్యం బాటిళ్లు స్వాధీనం

పామూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పామూరు పట్టణంలో అక్రమంగా బెల్ట్ షాపును నిర్వహిస్తున్న ముగ్గురిని బుధవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అక్రమంగా మద్యం అమ్మకాలు చేపడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ కిశోర్‌బాబు తన సిబ్బందితో దాడిచేశారు. వారినుంచి 41 మద్యం క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆముదంలో సస్యరక్షణ చేపట్టాలి

దొనకొండ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆముదం పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి లక్ష్మీనారాయణ సూచించారు. బుధవారం మండలంలోని రుద్రసముద్రం, మల్లంపేట గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మండలంలో 700 ఎకరాల్లో ఆముదం సాగుచేస్తున్నారని చెప్పారు. పంటలో నామాల పురుగు, పొగాకులో లద్దె పురుగు ఆశించి నష్టపరచిన ఆకులను రైతులకు చూపించారు. ఈ పురుగులు ఆశిస్తే వెంటనే సస్యరక్షణ చేపట్టకపోతే తీవ్రనష్టం కల్గిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో రైతు వ్యవసాయ సహాయకులు నాసర్‌వలి, మురళి, విన్నీబాబు, తదితరులు పాల్గొన్నారు.

విస్తారంగా వర్షాలు

పొంగి ప్రవహిస్తున్న వాగులు

లోతట్టు ప్రాంతాలు జలమయం

పలుచోట్ల రాకపోకలకు అంతరాయం

అధికారుల సహాయక చర్యలు

పామూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గత రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం రాత్రి, బుధవారం ఉదయం నుంచి పలు దఫాలుగా కురిసిన వర్షంతో మండలంలోని వాగులు, వంకల్లో వర్షపు నీరు ప్రవహించింది. మోపాడు రిజర్వాయర్‌లో మూడు అడుగుల మేర నీరు చేరింది. గతంలో 3 అడుగులు నీరు నిల్వ ఉండగా, మొత్తం ఆరు అడుగుల నీరు చేరింది. రేణిమడుగు వద్ద దాసరివాగులో నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో గ్రామంలోకి రాకపోకలు నిలిచిపోయాయి. సుబ్బక్కపల్లిలోగల మన్నేరు వాగు, నాసావాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పట్టణంలోని తహసీల్దార్, మండలపరిషత్ కార్యాలయాల వద్ద ప్రధాన రోడ్డుపై ఐదు అడుగులమేర నీరు నిలిచిపోయింది. దాంతో లోతట్టు ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. గోపాలపురం ఎస్సీ కాలనీ, ఎన్జీవో కాలనీల్లో ఇళ్లలోకి నీరు చేరకుండా పంచాయతీ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు.

పడమటకట్టకిందపల్లి గ్రామంలో చెరువుకు గండిపడటంతో టీడీపీ నాయకుడు యారవ శ్రీను ఎక్స్‌కవేటర్ సహాయంతో పూడ్చివేత కార్యక్రమం చేపట్టారు. మండలంలోని మోపాడు, నక్కలగండి రిజర్వాయర్ ప్రాంతాలను తహసీల్దార్ బీవీ రమణారావు, సీఐ ఎంభీమానాయక్‌లు పరిశీలించి ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



కనిగిరి: హెచ్‌ఎంపాడులో పొంగిప్రవహిస్తున్న హనుమంతాపురం వాగు

దర్శిలో ముసురు వర్షం

దర్శి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): దర్శి ప్రాంతంలో బుధవారం ముసురుతో కూడిన వర్షం కురిసింది. ఉదయం నుంచి జల్లులు పడుతూనే ఉన్నాయి. మధ్యాహ్నం కొంతసేపు విరామం ఇచ్చినా సాయంత్రం మళ్లీ ఆరంభమై జల్లులు పడుతున్నాయి. అల్పపీడనం ప్రభావంతో గత రెండు రోజులుగా వర్షం పడుతూనే ఉంది. దీంతో రోడ్లు బురదమయమయ్యాయి. జనజీవనానికి కొంతమేర ఇబ్బంది కల్గింది. ఈ వర్షం ఇంకా అధికమైతే వైట్‌బర్లీ పొగాకు, మొక్కజొన్న పైర్లు దెబ్బతింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.



కురిచేడు: పొలాల్లో నిలిచిన వర్షపు నీరు



పామూరులో: తహసీల్దార్ కార్యాలయ రోడ్డుపై చేరిన వర్షం నీరు

కురిచేడులో..

కురిచేడు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో కురిచేడులో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఉదయం కొద్దిసేపు ఎండ కాసినా వెంటనే భారీ వర్షం కురిసింది. విడతల వారీగా వర్షం కురుస్తూనే ఉంది. వర్షపు నీరు పొలాల్లో నిలబడుతుండటంతో పంటలు పాడైపోతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా పొగాకు తోటలో నీరు నిలబడితే వెంటనే వేరు కుళ్లిపోయే ప్రమాదముంది.

అధికారుల సహాయక చర్యలు

కనిగిరి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షంతో కనిగిరిని ముసురు కమ్మింది. కనిగిరి నియోజకవర్గంలోని పామూరు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలోకి వరద నీరు చేరటంతో అధికారులు సహాయక చర్యలు చేపట్టి నీటిని మళ్లించారు. సీఎస్‌పురం మండలంలోని కోవిలంపాడు గ్రామంలో రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా చెరువుకు కాలువ తవ్వటంతో వాటిగుండా ఎస్సీ కాలనీల్లోకి వరద నీరు ఉధృతంగా చేరటంతో స్థానికులు ఆందోళన చెందారు. దీంతో పంచాయతీ అధికారులు, సిబ్బంది ఎక్స్‌కవేటర్ ద్వారా నీటిని మళ్లించి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. పీసీపల్లి, కనిగిరి మండలాల్లో వరద నీరు పంట పొలాల్లోకి చేరింది. హెచ్‌ఎంపాడు మండలంలోని హనుమంతాపురం ఎస్సీ పాలెం నుంచి కొత్తపల్లి వరకు రోడ్డుపైకి వరద నీరు చేరింది. సమీప వాగు నుంచి నాలుగు అడుగులు పైకి నీరు ఉధృతంగా ప్రవహించింది. దీంతో టీడీపీ మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి, తహసీల్దార్ దిలీప్‌కుమార్ వాగును పరిశీలించారు. వాగు వద్ద రెండువైపులా వీఆర్ఏలను ఉంచి వాహనదారులకు ఇబ్బందులు లేకుండా రాకపోకలు సాగించేలా చర్యలు చేపట్టారు. సాయంత్రానికి వాగు ఉధృతి తగ్గటంతో యథావిధిగా వాహనాలు రాకపోకలు సాగాయి.

పంట పొలాల్లో నిలిచిన వర్షపునీరు

పీసీపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. పొగాకు, కంది పంట పొలాల్లో వర్షపునీరు నిలిచింది. చింతగుంపల్లి ప్రాంతంలోని పొగాకు చేలల్లో నీరు చేరడంతో దెబ్బతింటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే మండలంలో 13.7సెం.మీ. వర్షం కురిసింది. ఇంకా ఎక్కువగా వర్షం కురిస్తే పొగాకు, మినుము పంటలు దెబ్బతింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.



చింతగుంపల్లి ప్రాంతంలో పొగాకు చేలో నిలిచిన వర్షపునీరు

ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు

తాళ్లూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. బుధవారం 85.5 మి.మీ. వర్షపాతం నమోదయింది. పల్లెపండుగ కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొట్టిపాటి లక్ష్మి తాళ్లూరు -విఠలాపురం రోడ్డు మార్గంలో ఉధృతంగా ప్రవహిస్తున్న దోర్నపు వాగును పరిశీలించారు. అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రాకపోకలకు ఆటంకం కలిగింది. ఎస్సై ఎస్.మల్లికార్జునరావు వాగుల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేశారు. తహసీల్దార్ కె.నాగలక్ష్మి వాగుల ప్రవాహన్ని పరిశీలించి ప్రజలను అప్రమత్తం చేశారు. వాగుల వద్ద వీఆర్‌వోలను కాపలాగా ఉంచారు. మండలంలోని దారంవారిపాలెం వద్దగల కొంగవాగు ఉధృతానికి చప్టా అప్రోచ్ కుంగిపోయి దెబ్బతింది.



దోర్నపువాగు ప్రవాహాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ లక్ష్మి

భైరవకోనలో సహాయక చర్యలు చేపట్టాలి

ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

సీఎస్‌పురం(పామూరు), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన భైరవకోనలో అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో దేవస్థాన ప్రాంతంలో వర్షపునీరు ప్రవహించింది. కొండమీద నుంచి నీరు ఉధృతంగా పరువళ్లు తొక్కుతుండటంతో జలపాతం ఉధృతంగా ప్రవహిస్తున్నది. దాంతో ఆలయ ప్రాంగణం అంతా నీటితో నిండిపోయింది. విషయం తెలుసుకొన్న ఎమ్మెల్యే ఉగ్ర హుటాహుటిన భైరవకోన క్షేత్రాన్ని అధికారులతో కలిసి బుధవారం పర్యటించారు.

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జలపాతం ఉధృతంగా ప్రవహిస్తుండటంతో చూసేందుకు భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. వర్షాలు తగ్గేవరకు ఎవరినీ అనుమతించకుండా పోలీసులు తగిన చర్యలు చేపట్టాలని సీఐ ఎం.భీమానాయక్‌కు సూచించారు. మరో మూడు రోజుల పాటు భారీ నుంచి అతి భారీగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున భక్తులు దర్శనానికి రావద్దని కోరారు. వరదనీటితో ముంపునకు గురైన ఆలయ ప్రాంతాన్ని, జలపాత ప్రాంతాన్ని, అన్నదాన సత్రం ప్రాంతాన్ని ఎమ్మెల్యే పరిశీలించి తగు సూచనలు చేశారు. అనంతరం భైరవేశ్వర స్వామి దేవస్థానంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మంజునాథరెడ్డి, ఎస్ఐ ఆర్.సుమన్, టీడీపీ నాయకులు ఎన్‌సీ మాలకొండయ్య, పి.రవికుమార్, రామకృష్ణంరాజు, సీహెచ్ వెంకటయ్య, కె.తిరుపతయ్య, ఆలయ సిబ్బంది. తదితరులు పాల్గొన్నారు.



భైరవకోనలో ఆలయప్రాంగణాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ ఉగ్ర

కాగా, అంబవరం వద్ద డొక్కలవాగు పొంగి ప్రవహిస్తుండటంతో పోలీసులు సహాయకచర్యలు చేట్టి రాకపోకలను నియంత్రించారు. కోవిలంపాడులోని చెరువు కాలువ తెగింది. గ్రామంలోకి నీరు రాకుండా సర్పంచ్ ఎక్స్‌కవేటర్‌తో మరమ్మతులు చేపట్టారు. సీఎస్‌పురంలో యానాది కాలనీలో వర్షపునీరు రావడంతో స్థానికులు ఇబ్బందులు పడగా, తహసీల్దార్ మంజునాథరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా సహాయక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



సీఐ కార్యాలయం ప్రాంగణంలో నిలిచిన వర్షం నీరు

ప్రభుత్వ కార్యాలయాల్లోకి వర్షపు నీరు

ఇబ్బందులు పడుతున్న సిబ్బంది

కనిగిరి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కనిగిరిలో కాస్త వర్షం పడిందంటే ప్రభుత్వ కార్యాలయాలు మూసివేయాల్సిన పరిస్థితి నెలకొంది. అల్పపీడనం ప్రభావంతో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాల ఆవరణల్లోకి వర్షపు నీరు చేరింది. దీంతో అధికారులు నానా ఇబ్బందులు పడ్డారు. స్థానిక సర్కిల్ కార్యాలయం పోలీస్‌స్టేషన్ కంటే చాలా కిందకు ఉండటంతో వర్షపు నీరంతా సర్కిల్ కార్యాలయాన్ని చుట్టేసింది. వివిధ కేసుల నిమిత్తం వచ్చే ప్రజలకు కూడా ఇబ్బందిగా మారింది. అలాగే, సబ్‌రిజిస్ట్రార్, తహసీల్దార్ కార్యాలయాల వద్ద వర్షం నీరు నిలబడింది. గార్లపేట రోడ్డులోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం ఆవరణలో వర్షపు నీరు నిలబడటంతో అధికారులు, సిబ్బంది కార్యాలయం లోపలికి వెళ్లేందుకు ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని బాలికల ఇంటిగ్రేటెడ్ హాస్టల్ ఎదుట వర్షపు నీరు నిలిచింది. సబ్‌జైలు, పోలీస్‌స్టేషన్, అగ్రికల్చర్, ఎంపీడీవో, ఐసీడీఎస్, స్త్రీశక్తి భవనం కార్యాలయాలన్నీ బాగా ఎత్తుగా ఉన్నాయి, అయితే, సబ్‌రిజిస్ట్రార్, సీఐ కార్యాలయం, తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాలు పల్లంగా ఉండటంతో వర్షం పడిన సమయంలో తరచూ ఇబ్బందిగా మారుతుంది.

రాష్ట్రాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

తాళ్లూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. బుధవారం మండలంలోని తురకపాలెం, దారంవారిపాలెం, మాధవరం గ్రామాల్లో జరిగిన పల్లెపండుగ వారోత్సవాల్లో ఆమె మాట్లాడారు. సీఎం చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పంచాయతీరాజ్ వ్యవస్థను ప్రక్షాళన చేస్తున్నారన్నారు. ఈఆర్థిక సంవత్సరంలో పంచాయతీలకు రూ.4500 కోట్లు మంజూరు చేయటం జరుగుతుందన్నారు. పల్లెలు అభివృద్ధి చెందితేనే పట్టణాలు అభివృద్ధి చెందుతాయన్నారు. సీఎం చంద్రబాబు అభివృద్ధికి అంబాసిడర్ అని అన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రత్యేక అభిమానంతో పల్లెల అభివృద్ధికి శ్రీకారం చుట్టారని చెప్పారు.



మాధవరంలో సీసీ రోడ్లకు భూమిపూజచేస్తున్నటీడీపీ ఇంచార్జి డాక్టర్ లక్ష్మి

తాళ్లూరు మండలంలో 58 పనులకు రూ.3 కోట్ల నిధులు మంజూరయ్యాయని డాక్టర్ లక్ష్మి పేర్కొన్నారు. రాష్ట్రంలో పండుగ వాతావరణంలో ప్రారంభమైన పనులు సంక్రాంతి నాటికి పూర్తిచేసి ప్రారంభించాలన్నారు. ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో మండలంలో ఒక్క అభివృద్ధి పనికూడా జరగలేదన్నారు. మండలంలో ఆయాగ్రామాల్లో రూ.70 లక్షల పనులకు భూమి పూజ కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమాల్లో టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్ సాగర్, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, మండల ప్రత్యేకాధికారి ఉషారాణి, ఎంపీడీవో సుందరరామయ్య, తహసీల్దార్ కె.నాగలక్ష్మి, టీడీపీ మండల అధ్యక్షుడు బొమ్మిరెడ్డి ఓబుల్‌రెడ్డి, శాగంకొండారెడ్డి, మానం రమేష్‌బాబు, మేడగం వెంకటేశ్వరరెడ్డి, కుమ్మిత సుబ్బారెడ్డి, మంచాల వెంకటేశ్వరరెడ్డి, రత్నారెడ్డి, సోము శ్రీనివాసరెడ్డి, పాలెపోగు దాసు, కృష్ణారెడ్డి, ఐ.శ్రీనివాసరెడ్డి, వేణుబాబు వెంకట్రావు పాల్గొన్నారు. అలాగే, తురకపాలెం, మన్నేపల్లి సర్పంచ్‌లు చంద్రగిరి గుర్వారెడ్డి, మంచాల వెంకటేశ్వరరెడ్డి, ఏపీవో మురళి, ఏతఃవెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు. ఎస్ఐ మల్లికార్జున బందోబస్తు నిర్వహించారు.

కాగా, తురకపాలెంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ అభిమాని కుమ్మిత ఓబుల్‌రెడ్డి దర్శిలోని అన్న క్యాంటీన్ నిర్వహణకు రూ.50 వేల చెక్కును డాక్టర్ గొట్టిపాటి లక్ష్మికి అందజేశారు. ఈసందర్భంగా ఆయనను అభినందించారు.

వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ఈదర వాగును పరిశీలిస్తున్న తహసీల్దార్ లక్ష్మీనారాయణ

ముండ్లమూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఎగువ ప్రాంతంతోపాటు మండలంలో కురుస్తున్న వర్షాలతో వాగులు, చెరువులు పొంగి ప్రవహించే ప్రమాదముందని తహసీల్దార్ లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం ఆయన మారెళ్ల సమీపంలోని ఈదర వాగును పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవాగుపై వర్షపు నీరు ప్రవహిస్తుండటంతో ముందుజాగ్రత్తగా రాకపోకలు నిలిపివేసినట్టు చెప్పారు. చిలకలేరు వాగు, తోడేళ్ల వాగు, వేములవాగులను కూడా పరిశీలించి ఆయా గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశామన్నారు.

రాత్రుళ్లు వాగుల్లోకి దిగొద్దు!

వర్షాలతో వాగులు పొంగి ప్రవహిస్తున్నందున రాత్రుళ్లు ప్రయాణం చేయవద్దని ఎస్ఐ వై.నాగరాజు సూచించారు. బుధవారం ముండ్లమూరు - యాంపాడు మధ్య ఉన్న చిలకలేరు వాగును ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ తొందరపడి రాత్రుల సమయాల్లో బ్రిడ్జి మీదుగా ప్రయాణం చేయవద్దన్నారు. అద్దంకి, దర్శి వైపుల నుంచి వాహన చోదకులకు హెచ్చరిక బోర్డుల ద్వారా తెలియపరిచినట్టు చెప్పారు. తమ సిబ్బందిని రాత్రుల సమయాల్లో వాగుల వద్ద కాపలా ఉంచుతున్నట్టు చెప్పారు. జమ్మలమడక వాగు, తోడేళ్లవాగు, నక్కల వాగులను కూడా సందర్శించి ఆయా గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశామన్నారు.

నేడు పీసీపల్లిలో ఎమ్మెల్యే ఉగ్ర పర్యటన

పీసీపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పీసీపల్లి మండలంలో గురువారం జరిగే పలు కార్యక్రమాల్లో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి పాల్గొంటున్నారని ఎంపీడీవో ప్రభాకరశర్మ తెలిపారు. పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా నేరేడుపల్లి, మురుగుమ్మి, పీసీపల్లి గ్రామాల్లో నిర్మించనున్న సిమెంట్ రోడ్లకు ఆయన శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నారు. మండలంలోని పలుగ్రామాలకు రూ.3 కోట్ల నిధులతో 13 పనులు మంజూరయినట్టు ఎంపీడీవో తెలిపారు.

బాలికా విద్యకు పెద్దపీట

దొనకొండ జడ్పీ పాఠశాలలో కేజీబీవీ హాస్టల్ ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు

గత వైసీపీ హయాంలో నిరుపయోగంగా ఉన్న భవనం

పేద కుటుంబాలకు ప్రయోజనం



దొనకొండ జడ్పీ పాఠశాల ఆవరణలోని బాలికల వసతి గృహ భవనం

దొనకొండ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని పేద కుటుంబాలకు చెందిన పిల్లలు మధ్యలోనే చదువు మానేయకుండా కూటమి ప్రభుత్వం బాలికా విద్యకు పెద్దపీట వేస్తోంది. ఈక్రమంలో దొనకొండ జడ్పీ పాఠశాల ఆవరణలో నిర్మించిన భవనాన్ని కేజీబీవీ టైప్-4 హాస్టల్‌గా ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలోని పలు గ్రామాల్లోని పేద కుటుంబాలకు చెందిన బాలికలు గ్రామాల్లో ప్రాథమిక విద్య అనంతరం ఉన్నత విద్య చదువుకొనేందుకు హాస్టల్ సౌకర్యం లేదు. కేజీబీవీ పాఠశాలలో చదువుదామన్నా సీటు దొరక్క అనేకమంది బాలికలు విద్యకు దూరమవుతున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లోని పేద కుటుంబాలకు చెందిన బాలికలకు పూర్తిస్థాయి సౌకర్యాలతో విద్యాభివృద్ధి అందించాలనే ధ్యేయంతో 2018లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం 150 మంది బాలికలు ఉండేందుకు దొనకొండకు బాలికల వసతిగృహం మంజూరు చేసింది. జడ్పీ పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేస్తే వసతిగృహంలో ఉంటూ ఇక్కడే చదువు కునేందుకు బాలికలకు రక్షణగా ఉంటుందని అప్పట్లో అధి కారులు భావించారు. పాఠశాల ఆవరణలో దాదాపు కోటిన్నర రూపాయల వ్యయంతో మంజూరైన వసతిగృహ భవనానికి అప్పటి మంత్రి శిద్దా రాఘవరావు శంకుస్థాపన చేశారు. పనులుపొందిన కాంట్రాక్టర్ 2021 ఆగస్టులో పూర్తి చేశారు. అయితే, వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంతో దొనకొండ జడ్పీ పాఠశాల ఆవరణలో నిర్మించిన బాలికల వసతిగృహ భవనం మూడేళ్ళుగా ప్రారంభానికి నోచుకోలేదు. దొనకొండలో బాలికల విద్యాభివృద్ధి నిమిత్తం బీసీ బాలికల హాస్టల్, కేజీబీవీ టైప్-3 పాఠశాలలు మాత్రమే ఉన్నాయి. కేజీబీవీలో సీట్లు రాక, బీసీ హాస్టల్‌లో అడ్మిషన్లు రాక పలు గ్రామాలకు చెందిన బాలికలు చదువును మధ్యలో నిలిపివేస్తున్నారు. మరికొందరు ఆటోల్లో వస్తూ తీవ్రఇబ్బందులు పడుతున్నారు.

కాగా, టీడీపీ కూటమి ప్రభుత్వం బాలికల విద్యాభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని 6 నుంచి 10వ తరగతి వరకు వంద మంది బాలికలు హాస్టల్‌లో ఉంటూ దొనకొండ జడ్పీ పాఠశాలలో చదువుకునేలా కేజీబీవీ టైప్-4 బాలికల హాస్టల్ ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. త్వరలో ఇది వినియోగంలోకి వచ్చేలా ప్రస్తుతం రూ.2.50 లక్షలు నిధులు మంజూరుచేసి కావాల్సిన మౌలిక సౌకర్యాల ఏర్పాటుచేస్తున్నారు, బోధనేతర సిబ్బంది నియామకాన్ని ప్రకటించి అసక్తిగల మహిళల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. త్వరలో జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడి ఆధ్వర్యంలో కేజీబీవీ టైప్-4 హాస్టల్‌లో ప్రారంభమయ్యేలా అధికారులు రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. బాలికల హాస్టల్ ఏర్పాటుకు ప్రభుత్వం తక్షణ చొరవ చూపటం పట్ల గ్రామాల్లోని పలువురు తల్లితండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి జరగాల్సిన దూరవిద్య పరీక్షలు వాయిదా

పెదకాకాని(ఏఎన్‌యూ) అక్టోబర్ 16 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ దూరవిద్య కేంద్రం గురువారం (17వ తేదీ) నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించ తలపెట్టిన యూజీ, పీజీ పరీక్షలను వాయిదా వేసినట్లు దూరవిద్య కేంద్రం పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య డి. రామచంద్రన్ బుధవారం తెలిపారు. భారీ వర్షాల కారణంగా పరీక్షలను వాయిదా వేసినట్లు తెలిపారు. మొదటి, మూడో సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేశామని, 27 నుంచి జరగాల్సిన రెండో, నాలుగో సెమిస్టర్ పరీక్షలు యథావిధిగా కొనసాగుతాయన్నారు. వాయిదా పడ్డ పరీక్షలు నవంబర్ 17 నుంచి నిర్వహిస్తామన్నారు.



మా వాళ్లకి

వాటా ఇవ్వాల్సిందే



- స్టాక్‌పై డిపోల్లో కొనసాగుతున్న గందరగోళం
- చాలా ప్రాంతాల్లో ప్రారంభంకాని దుకాణాలు
- మద్యం ధరలు యథావిధిగానే.. అమల్లోకి రాని కొత్త ధరలు

మద్యం లైసెన్సీలపై రాజకీయ ఒత్తిళ్లు

ప్రభుత్వ మద్యం.. ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వచ్చేసింది. అదృష్టంతో దక్కించుకున్న వారు ఆనందంతో మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేసుకునే హడావుడిలో ఉండగా వారికి అనేక అవాంతరాలు ఎదురవుతున్నాయి. పెద్దసంఖ్యలో దరఖాస్తులు చేసిన వారికి.. నేతల అండ ఉన్నా వారికి.. మద్యం వ్యాపారంపై ఆసక్తి ఉన్న వారిలో చాలామందికి లాటరీలో దుకాణాలు దక్కలేదు. దీంతో వీరంతా దుకాణాలు దక్కించుకున్న వారిపై కన్నేశారు. తమకు వాటా ఇవ్వాలని.. తమ వారిని భాగస్వాములుగా చేర్చుకోవాలనే డిమాండ్లతో పలువురు ఒత్తిళ్లు తెస్తున్నారు. తాము చెప్పినట్లు చేయకపోతే తమ ప్రాంతంలో వ్యాపారం ఎలా చేస్తావో చూస్తామనే హెచ్చరికలు.. బెదిరింపులు కూడా లైసెన్సీలకు వస్తున్నాయి. మరోవైపు తమ ప్రాంతాల్లో మద్యం దుకాణాలను ఏర్పాటు చేయవద్దని స్థానికుల నుంచి నిరసనలు వస్తున్నాయి. ఇక మద్యం ధర తగ్గకపోవడంతో మందుబాబులు నిరాశలో ఉండగా.. స్టాకుపై సాంకేతిక అవాంతరాలతో దుకాణదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో పలు ప్రాంతాల్లో బుధవారం నుంచి దుకాణాలు ప్రారంభానికి నోచుకోలేదు.

బాపట్ల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మద్యం షాపుల కోసం లాటరీ ప్రక్రియ ముగిసింది. తొలి వాయిదా లైసెన్సు ఫీజును లాటరీ విజేతలు చెల్లించేశారు. స్టాక్ కోసం డిపోల్లో ఇండెంట్ పెట్టి షాపు ప్రారంభించుకోవడానికి లైసెన్సీదారులు సిద్ధపడుతున్నారు. అయితే తొలి నుంచి మద్యం వ్యాపారం చేజిక్కించుకోవాలని.. దుకాణాలను దక్కించుకోవాలని తీవ్రంగా ప్రయత్నించిన నేతలు, వారి అనుచరులు టీడీపీ అధిష్ఠానం హెచ్చరికలతో వెనక్కితగ్గారు. అయితే వీరు తిరిగి ఎలాగైనా మద్యం వ్యాపారంపై పట్టు సాధించాలని లైసెన్సీదారులపై ఎవరిస్థాయిలో వారు ఒత్తిళ్లు తెస్తున్నారు. కొన్ని చోట్ల నేతల అండతో వారి అనుచరగణం భాగస్వామ్యం దక్కించుకోవడానికి పట్టు వీడడం లేదు. తమను కాదని వ్యాపారం చేసే పరిస్థితి ఉండదని, కొంతమందిని భాగస్వాములుగా చేర్చుకోమని లైసెన్సుదారులకు ఫోన్ చేసి మరీ బేరసారాల పర్వాన్ని కొనసాగిస్తున్నారు. లైసెన్సు పొందిన వారిలో చాలామంది అంతకు ముందు నలుగురు నుంచి పది మంది వరకు కలిసి అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. ఇప్పుడు వారిలో ఒక్కరికి తగిలినా సరే ఆ షాపులో వారంతా భాగస్వాములుగానే ఉండి నిర్వహించనున్నారు. ఇప్పటికే ఎక్కువగా భాగస్వాములు ఉంటే ఇప్పుడు నేతలు చెప్పిన వారిని చేర్చుకుంటే తమకు మిగిలేది ఏముంటుందనే భావనను వారు వ్యక్తపరుస్తున్నారు. లాటరీలో షాపు దక్కించుకున్న స్థానికేతరులను పిలిచి తాము సూచించిన వారిని వ్యాపారంలో భాగస్వాములు చేసుకోవాలనే ఒత్తిడికి నేతలు తెరలేపినట్లు తెలుస్తోంది. స్థానిక నేతలను కాదని మద్యం వ్యాపారం చేయడం అంత సులువైన విషయం కాదు. అధికార పార్టీ కాబట్టి వారి ఆదేశాలను ఎక్సైజ్ శాఖ, పోలీస్ శాఖ ఇతర శాఖల అధికారులు తూచా తప్పకుండా పాటిస్తారు. ఈ నేపథ్యంలో స్థానిక నేతలను కాదని మద్యం వ్యాపారం చేయడం సాహసంతో కూడుకున్న పనిగా వ్యాపారులు భావిస్తున్నారు. నేతల ఒత్తిడి ఎక్కువ అవడంతో ఏం చేయాలో తోచక వ్యాపారులు తలలు పట్టుకుంటున్నారు. నేతల మాట కాదని ముందుకెళ్తే ఎన్నో ఇబ్బందులు పడతాం. ఆ విధంగా వెళ్లడం కూడా కరెక్ట్ కాదని కొందరు ఆలోచన చేస్తున్నారు. ఇక మద్యం సరఫరాలో డిపోల వద్ద గందరగోళం నెలకొంది. బాపట్ల జిల్లాలో 117 షాపులు బుధవారం ప్రారంభం కావాల్సి ఉండగా అన్నీ కలిపి 53 దుకాణాల్లో మాత్రమే తొలిరోజు అమ్మకాలు జరిగాయి. మద్యం స్టాక్ విషయంలో బాపట్ల, రేపల్లె, వేమూరు, నగరం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని షాపుల వారు తెనాలి డిపో నుంచి, అద్దంకి, పర్చూరు, చీరాల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని షాపులకు ఒంగోలు డిపో నుంచి స్టాక్ తెచ్చుకోవాల్సి ఉంది. అయితే స్టాక్ విషయంలో సదరు డిపోల్లో స్పష్టత లేకపోవడంతో ఇండెంట్ కోసం వెళ్లిన లైసెన్సుదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పల్నాడు జిల్లాలో 129 షాపులకు 75 షాపులకు మాత్రమే బుధవారం డిపోల నుంచి మద్యం సరఫరా జరిగింది. మద్యం నిల్వలకు డబ్బు చెల్లించిన వారికి డిపోల నుంచి మద్యం సరఫరా చేయలేకపోయారు. ఇదే పరిస్థితి గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలో కూడా నెలకొంది. మరికొందరు దుకాణాల ఏర్పాట్లలో ఉన్నారు. గురువారానికి నూతన పాలసీ ప్రకారం మద్యం దుకాణాలు తెరుచుకునే అవకాశం ఉండవచ్చు.

చీరాలలో యువనేత అత్యుత్సాహం..

చీరాల నియోజకవర్గంలో ఉన్న 20 షాపులకు 7 షాపుల వరకు వైసీపీ సానుభూతిపరులు దక్కించుకున్నారు. మరో 5 షాపులను ఎన్నికలకు ముందే జాతీయ పార్టీ తీర్థం పుచ్చుకున్న సదరు నేత అనుచరగణం చేజిక్కించుకుంది. దీంతో మద్యం షాపుల విషయంలో అధికారపార్టీకి చెందిన ఓ యువనేత అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నట్లు సమాచారం. ఏకంగా లైసెన్సుదారులకు ఫోన్ చేసి వాటా సంగతేంటని ప్రశ్నిస్తున్నారు. తమ కనుసన్నల్లోనే వ్యాపారం జరగాలనే హుకుం జారీ చేస్తున్నట్లు చర్చ జరుగుతోంది. రేపల్లెతో పాటు బాపట్లలో రెండు షాపుల విషయంలో బేరసారాలు జరుగుతున్నట్లు సమాచారం. లాటరీకి ముందు సిండికేట్ పర్వం ఒక ఎత్తయితే రూరల్ మండలాల పరిధిలో షాపులు దక్కించుకున్న వారంతా కలిసి రింగ్ అవుతున్నట్లు తెలుస్తోంది. లోకేషన్ విషయంతో పాటు ఇతరాత్ర వాటిలో తమలో తాము విభేదాలకు దిగితే నష్టపోతామనే అంచనాకు వచ్చిన వ్యాపారులు మధ్యేమార్గంగా షాపులన్నీ కలిసి రింగ్ అయి లాభాన్ని పంచుకోవాలనే అవగాహనకు వస్తున్నట్లు సమాచారం.

ఈ నెల 30 వరకు ఎక్కడైనా....

మద్యం షాపు లైసెన్సు పొందిన వారు ఈ నెల 30 వరకు తాత్కాలిక ప్రాతిపదికన, ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఎక్కడైనా అమ్ముకోవచ్చని ఎక్సైజ్ శాఖ స్పష్టం చేసింది. లక్షలు పెట్టి షాపు దక్కించుకున్న వారు నష్టపోకూడదనే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. అయితే 30వ తేదీ తర్వాత మాత్రం శాశ్వత షాపులోనే వ్యాపారం చేయాలని ఇందులో ఎటువంటి మినహాయింపు ఉండదని అధికారులు చెబుతున్నారు. బుధవారం ఉదయం నుంచే ప్రభుత్వ మద్యం షాపులు మూసివేసి ఉండడంతో మద్యం కోసం మందుబాబులు గంటల తరబడి వేచి ఉన్నారు. నూతన మద్యం విధానంలో భాగంగా ప్రైవేటు మద్యం షాపులు బుధవారం ఉదయం నుంచి అందుబాటులోకి వస్తాయని ఎక్సైజ్ శాఖ ప్రకటించినా మధ్యాహ్నానికి కొన్ని షాపులు మాత్రమే అందుబాటులోకి వచ్చాయి. మిగిలినవి గురువారం నాటికి తెరుచుకునే అవకాశం ఉంది. ప్రభుత్వ మద్యం షాపుల్లో ఉన్న స్టాక్‌తో పాటు ఫర్నిచర్‌ను రెవెన్యూ విభాగం సమక్షంలో లెక్కకట్టి వాటిని డిపోలకు తరలించే ప్రక్రియను ఎక్సైజ్ శాఖ చేపట్టింది.



అద్దంకి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని షాపునకు తరలిస్తున్న మద్యం

మందుబాబులకు షాక్

ఉమ్మడి గుంటూరు జిల్లాలో నూతన మద్యం పాలసీ ప్రకారం ప్రైవేట్ మద్యం దుకాణాలు కొన్ని ప్రాంతాల్లో ప్రారంభమయ్యాయి. అయితే మందుబాబులు నిరాశకు గురయ్యారు. తక్కువ ధరకు, నాణ్యమైన మద్యం కోసం ఎదురుచూస్తున్న మందుబాబులు బుధవారం ప్రారంభమైన దుకాణాల్లో మద్యం ధరలు చూసి షాక్‌కు గురయ్యారు. ఆశగా మద్యం షాపులకు వెళ్లిన మందుబాబులు అక్కడి ధరలు చూసి ఖంగుతిన్నారు. నిన్నటి వరకు ప్రభుత్వ మద్యం షాపుల్లో విక్రయించిన ధరలకే ప్రైవేట్ మద్యం షాపుల్లో కూడా విక్రయాలు జరిపారు. ప్రభుత్వం చెప్పినట్టుగా రూ.99 క్వార్టర్ మద్యం ప్రైవేట్ షాపుల్లో అందుబాటులోకి ఇంకా రాలేదు. పాత ధరలే అమలు కావడంతో మందు బాబులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పల్నాడు ఎక్సైజ్ ఈఎస్ మణికంఠను వివరణ కోరగా కొత్త ఎమ్మార్పీ ఇంకా రాలేదని, అది మారే వరకు పాత ధర లకే మద్యం విక్రయాలు జరుగుతాయన్నారు.

నష్టపోయారు.. న్యాయం చేయాలి

మా కార్యకర్తలకు మీ షాపులో 25 పైసలు వాటా ఇవ్వాల్సిందేనని స్థానిక నేతలు మద్యం వ్యాపారులపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. మా కార్యకర్తలు నష్టపోయి ఉన్నారు. వారికి కూడా మేము న్యాయం చేయాలి. మీకు రావాల్సిన వాటా ప్రకారం వారు చెల్లిస్తారు. లైసెన్సు ఫీజులో కూడా వాటా ప్రకారం చెల్లిస్తారు. మీరు కూడా మా వారితో సహకరించండి. మీకు అన్ని విధాలుగా ఉపయోగం ఉంటుందంటూ చాలా చోట్ల నేతలు లైసెన్స్‌దారులతో బేరసారాలు మాట్లాడుకుంటున్నారు. అయితే పది పైసలు వాటా మాత్రం ఇవ్వగలమని కొందరు వ్యాపారులు ముందుకొచ్చారు. కుదరదు మావారికి 25 పైసలు వాటా ఇవ్వాల్సిన అంటూ కొందరు నేతలు హుకుం జారీ చేస్తున్నారు. దీంతో మద్యం వ్యాపారులు నేతల పక్కన ఉండే ద్వితీయ శ్రేణి నేతలను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

షాపుల ఏర్పాటుపై నిరసనలు

మద్యం షాపుల ఏర్పాటు హడావుడిలో నిర్వాహకులు ఉండగా.. కొన్ని ప్రాంతాల్లో స్థానికుల నుంచి నిరసనలు వ్యక్తమవుతున్నాయి. గుంటూరు నగరం నందివెలుగు రోడ్డులోని మణి హోటల్ సెంటర్లో మహిళలు తమ ప్రాంతంలో మద్యం షాపు వద్దంటూ నిరసన చేపట్టారు. బుధవారం రోడ్డుపై టెంటేసి ఆందోళన చేపట్టారు. కాకానిరోడ్డులోని ఉదయ్ హాస్పిటల్ ఎదుట మద్యం షాపును ఏర్పాటు చేయొద్దని స్థానికులు ఎక్సైజ్ డీసీ డాక్టర్ కే శ్రీనివాసులు, ఈఎస్ ఏ అరుణ కుమారిలకు ఫిర్యాదు చేశారు. వివాదాస్పద స్థలంలో హాస్పిటల్ కు మధ్యలో ఏ విధంగా మద్య షాపు ఏర్పాటు చేస్తారని, తక్షణమే ఈ ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. తాడేపల్లి, మంగళగిరి తదితర ప్రాంతాల్లో కూడా మద్యం దుకాణాల ఏర్పాట్లను స్థానికులు వ్యతిరేకిస్తున్నారు. ఊరుకు దూరంగా ఏర్పాటు చేసుకోవాలని మహిళలు డిమాండ్ చేస్తున్నారు. ఇలా ఉమ్మడి గుంటూరు జిల్లాలో పలు ప్రాంతాల్లో మద్యం షాపుల ఏర్పాటుపై స్థానికుల నుంచి నిరసనలు, ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.



గుంటూరు మణిహోటల్ సెంటర్లో ఆందోళన చేస్తున్న మహిళలు.

పల్లె ప్రగతికి..

ఇసుక గండం

- పట్టణాల్లో అభివృద్ధికి ఆటంకం
- వెంటాడుతున్న కొరత
- ఎక్కడికక్కడ నిలిచిపోతున్న అభివృద్ధి పనులు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

పల్లెల ప్రగతిపై ఇసుక ప్రభావం పడింది. ఇసుక కొరతతో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. పంచాయతీలు, మున్సిపాల్టీలు, గుంటూరు కార్పొరేషన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులకు ఇసుక దొరకక కాంట్రాక్టర్లు ఇబ్బంది పడుతున్నారు. దీంతో అభివృద్ధి కుంటుపడుతున్నది. ఇప్పట్లో ఇసుక కొరత తీరే పరిస్థితులు కనిపించడంలేదు. ఇక ప్రైవేట్ నిర్మాణదారులు కూడా పనులను నిలిపేసుకుంటున్నారు. ఇసుక సమస్య కార్మికుల ఉపాధిపై ప్రభావం చూపుతోంది. బ్లాక్‌లో టన్ను ఇసుక రూ 1,700 నుంచి రూ 1,800లకు కొనుగోలు చేయాల్సి ఉండటంతో ఇటు కాంట్రాక్టర్లు.. అటు నిర్మాణదారులు పనులు నిలుపుదల చేస్తున్నారు.

ప్రభుత్వం పల్లె పండుగ వారోత్సవాలను అట్టహాసంగా నిర్వహిస్తోంది. పెద్దఎత్తున ప్రగతి పనులకు ఎమ్మెల్యేలు శంకుస్థాపనలు చేస్తున్నారు. సిమెంట్ రోడ్లు, మురుగు కాలువలు, గోకులాలు ఇలా అనేక పనులను వారోత్సవాల్లో భాగంగా ప్రారంభిస్తున్నారు. ఒక ఉద్యమంలా ప్రగతి పనులను చేపడుతున్నారు. 1386 పనులకు రూ 157.19 కోట్లు వ్యయం చేస్తున్నారు. గుంటూరు జిల్లాలో రూ. 14.35 కోట్ల వ్యయంతో 166 పనులు చేపడుతున్నారు. ఈ పనులకు శంకుస్థాపనలు విస్తృతంగా నిర్వహిస్తున్నారు. పల్నాడు జిల్లాలో పల్లెల్లో రూ 70.84 కోట్ల వ్యయంతో 620 పనులు చేపడుతున్నారు. బాపట్ల జిల్లాలో రూ 72 కోట్ల వ్యయంతో 600 పనులు చేపడుతున్నారు. ఈ పనుల్లో అత్యధికంగా సిమెంట్ రోడ్లు, మురుగు కాలువల పనులు ఉన్నాయి. పనులను శంకుస్థాపనలు చేసి ప్రారంభిస్తున్నా వీటిని చేపట్టే పరిస్థితులు కానరావడంలేదు. ఇసుక కొరత వెంటాడుతుండటంతో ఆయా పనులు నిలిచిపోనున్నాయి. పల్లెలతో పాటు మునిసిపాల్టీలు, గుంటూరు కార్పొరేషన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ నిలిచిపోతున్నాయి. ఇసుక సకాలంలో లభిస్తుండకపోతుండటంతో కాంట్రాక్టర్లు పనులు నిలిపివేస్తున్నారు. అర్థాంతరంగా పనులు నిలిచిపోతుండటంతో పురాల పౌరులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇసుక పుష్కలంగా సరఫరా చేస్తేనే మళ్ళీ ప్రగతి పనులు పట్టాలెక్కే పరిస్థితి ఉంది.

పల్నాడు జిల్లాలో ఇసుక నిల్వలు నిండుకుంటున్నాయి. జిల్లా మొత్తం మీద ఒక్క మాదిపాడు యార్డులోనే ఇసుక నిల్వలు ఉన్నాయి. ఇక్కడ కూడా 9 వేల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ ఉంది. ఈ యార్డు నుంచి రోజుకు 50 లారీల లోపే లోడింగ్ చేసే సామర్థ్యం ఉంది. జిల్లాలో ఇసుకకు ఉన్న డిమాండ్‌కు సరఫరాకు అసలు పొంతన లేదు. ఆరు ఇసుక రీచ్‌లు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు మైనింగ్ శాఖ చర్యలు చేపట్టింది. ఇందుకు సంబంధించి ఇసుకని తోడేందుకు బిడ్‌లు నిర్వహించారు. ఈ పనులకు సంబంధించిన బిడ్‌లను బుధవారం సాయంత్రం వరకు ఆమోదించలేదు. కృష్ణానదికి మళ్లీ వరద వచ్చింది. సాగర్ డ్యాం నుంచి క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆరు ఇసుక రీచ్‌లలో తవ్వకాలు జరిపే పరిస్థితి ఉండదని అధికారులు అంచనా వేస్తున్నారు. పల్నాడు జిల్లాలో ఉన్న ఇసుక నిల్వలు వారం రోజులు మించి వచ్చే పరిస్థితి లేదు. ఇసుక రీచ్‌లలో గత వారం రోజుల క్రితమే తవ్వకాలు జరిపి ఉంటే ఇసుక కొరత కొంత తీరేది. ఈ దిశగా సంబంధిత యంత్రాంగం స్పందించలేదన్న విమర్శలున్నాయి. ఇసుకకు గడ్డుకాలం నెలకొందన్న అభిప్రాయం నిర్మాణదారుల నుంచి వ్యక్తమవుతోంది. ప్రభుత్వ పనులు కూడా ఇప్పట్లో చేపట్టే పరిస్థితి లేదని అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రగతి కుంటుపడటంతో పాటు కార్మికుల ఉపాధి కూడా ప్రమాదకర పరిస్థితిలో పడింది. ముందస్తు చర్యలు లేని కారణంగా ఈ పరిస్థితి దాపురించిందన్న వాదన వినిపిస్తోంది. గుంటూరు, బాపట్ల జిల్లాకు సంబంధించి కూడా ఇసుక తవ్వకాలు ఇంకా ప్రారంభం కాలేదని అధికారులు చెబుతున్నారు.

మాదిపాడు యార్డులో ఇసుక లోడింగ్



ఏడాదిగా రైల్వే గేటు మూత

- గత మార్చి నుంచి సా..గుతోన్న ఆర్‌యూబీ పనులు
- సెప్టెంబరు 10లోపు తెరుస్తామని.. ప్రకటనకే అధికారుల పరిమితం
- అప్పికట్ల-భర్తీపూడి మార్గంలో రాకపోకలకు ప్రయాణికుల అవస్థలు

బాపట్లరూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గేటు కష్టాలు తీరినట్లే.. ఆర్‌యూబీ వచ్చేసింది.. కొన్నాళ్లు ఆగితే చాలు.. ఎన్నో ఏళ్లుగా పడిన అవస్థలు పోతాయి.. అని ఆశపడిన వారి ఆశలు ఏడాదిగా అడియాశలుగా మారాయి. బాపట్ల మండలం అప్పికట్ల-భర్తీపూడి మార్గంలోని రైల్వేగేటు ఏడాదిగా మూసేశారు. ఆ మార్గంలో రాకపోకలు సాగించేవారు ఇబ్బంది పడుతున్నా రైల్వే అధికారుల్లో చలనం లేదు. ఆర్‌అండ్‌బీ రోడ్డులో రైల్వేగేటు వద్ద రైలుకింది వంతెన (ఆర్‌యూబీ) నిర్మాణానికి రూ.6 కోట్ల మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన పనుల పేరుతో గత ఏడాది మార్చిలో రైల్వేశాఖ రైల్వేగేటును మూసేసింది. వంతెన నిర్మాణ పనులు పూర్తి చేసి ఈ సంవత్సరం సెప్టెంబరు 10వ తేదీలోపు తెరుస్తామని ప్రకటిస్తూ గేటు వద్ద అధికారులు బోర్డును కూడా ఏర్పాటు చేశారు. అయితే వారి ప్రకటించిన గడువు దాటి నెలవుతున్నా ఇంతవరకు పనులు పూర్తి చేయలేదు. గేటును తెరవకపోవడంతో ఇరుగ్రామాల ప్రజలు నానా అవస్థలకు గురవుతున్నారు. గేటుమూతతో అప్పికట్ల నుంచి భర్తీపూడి, గుడిపూడి గ్రామాలకు వెళ్లడానికి చుట్టూ తిరిగి 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈతేరు, గుడిపూడి రైల్వేగేటు మీదగా ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. భర్తీపూడి చేరుకోవాలంటే 6 కిలోమీటర్ల దూరం వరకు వెళ్లాల్సి వస్తుందని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. రైలు కింది వంతెన నిర్మాణానికి ఇంక ఎన్నిరోజులు పడుతాయోనని భర్తీపూడి, గుడిపూడివాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈతేరు-గుడిపూడి మార్గంలోని రైల్వేగేటు సాంకేతిక కారణాలతో రాత్రిళ్లు పని చేయక రాకపోకలకు తరచూ అంతరాయం కలిగి ఇబ్బంది పడుతున్నారు.



మరమ్మతుల నిమిత్తం మూసివున్న అప్పికట్ల-భర్తిపూడి రైల్వేగేటు

ముసురు.. ముంపు

- రెండు రోజులుగా వీడని వర్షం
- జలమయమైన లోతట్టు ప్రాంతాలు
- ఉధృతంగా ప్రవహిస్తున్న పర్చూరు వాగు

బాపట్ల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో రెండు రోజులుగా వర్షం కురుస్తూనే ఉంది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతో పాటు జనజీవనం అస్తవ్యస్తమైంది. అల్పపీడనం వాయుగుండంగా మారడంతో బుధవారం ముసురు వర్షం కురిసింది. జిల్లాను వీడడం లేదు. భారీ వర్షాలకు పర్చూరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. బాపట్ల మండల పరిధిలోని రాంనగర్‌లో ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరడంతో ప్రజల అవస్థలు పాలయ్యారు. ఎస్పీ కార్యాలయం వెనక ఉన్న పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో తటాకాన్ని తలపించేలా నీళ్లు చేరాయి. మరో రెండు రోజుల పాటు జిల్లాకు వర్ష సూచన ఉన్న నేపథ్యంలో యంత్రాంగం అప్రమత్తమైంది. మత్స్యకారులు వేటకు వెళ్లొద్దనే ఆదేశాలు జారీ చేశారు. నిజాంపట్నం పోర్టులో ఒకటో నెంబరు ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. లోతట్టు ప్రాంతాలతో పాటు వాగులు పొంగిపొర్లుతున్న కల్వర్టుల వద్ద పటిష్ఠ చర్యలు తీసుకునేలా ఎస్పీ తుషార్‌డూడీ సిబ్బందిని అప్రమత్తం చేశారు. ప్రజలకు ఏవైనా ఇబ్బందులు ఎదురైతే 100, 112 కు డయల్ చేసి తెలపాలన్నారు. మంగళవారం నుంచి బుధవారం ఉదయం వరకు జిల్లా వ్యాప్తంగా 125.7 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా సంతమాగులూరు మండలంలో 21.6 మి.మీ, కొరిశపాడు 14.2, అద్దంకి 11.2, వేటపాలెం 20.2 మి.మీటర్ల వర్షపాతం నమోదు కాగా అత్యల్పంగా చెరుకుపల్లిలో 1 మి.మీ వర్షం నమోదైంది.

- మరో రెండు రోజుల వర్ష సూచనతో అధికారుల అప్రమత్తం
- నిజాంపట్నం పోర్టులో ఒకటో నెంబరు ప్రమాద హెచ్చరిక



రాంనగర్ గ్రామంలో ఇళ్లల్లోకి చేరిన వర్షపు నీరు



ఉధృతంగా ప్రవహిస్తున్న పర్చూరు వాగు

అన్నదాతల బెంబేలు...

గడచిన నెలలో ముంచెత్తిన వరదలు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేశాయి. ఆ భారీ నష్టం నుంచి కోలుకోకముందే మళ్లీ వర్షాలు ముంచెత్తాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు ఇంతటితో వెళ్లిపోతే పైర్లకు మేలు కలిగించేవని, కానీ మరో రెండు రోజుల పాటు వర్ష సూచన నేపథ్యంలో రైతుల్లో ఆందోళన నెలకొంది.

విద్యుత్‌శాఖ కార్యాలయానికి తాళం

- మోసం చేసిన ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని బాధితుల డిమాండ్
- రోజంతా నిలిచిపోయిన కార్యకలాపాలు
- బిల్లులు చెల్లించే వీలులేక వినియోగదారుల ఇక్కట్లు
- బాధితులతో చర్చించిన అధికారులు


దర్శి విద్యుత్‌శాఖ కార్యాలయానికి వేసిన తాళాలు

దర్శి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నమ్మించి మోసం చేసిన విద్యుత్ శాఖ దర్శి జేఏఈ నాదెళ్ల వేణుగోపాల్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బాధితులు దర్శి పట్టణంలోని విద్యుత్‌శాఖ కార్యాలయానికి తాళాలు వేశారు. తమకు న్యాయం చేసేంతవరకూ కదలేదని లేదని భీష్మించారు. దీంతో బుధవారం విద్యుత్‌శాఖ కార్యాలయం విధులు నిలిచిపోయాయి. బిల్లులు చెల్లించేందుకు వచ్చిన అనేకమంది వినియోగదారులు కార్యాలయం మూతపడటంతో వెనుదిరిగి వెళ్లిపోయారు. బాధితులతో విద్యుత్‌శాఖ అధికారులు చ ర్చించి కార్యాలయం తెరిచేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. దర్శి పట్టణానికి చెందిన రవికృష్ణ, ప్రసన్న దంపతుల భవనంలో విద్యుత్‌శాఖ సబ్ డివిజనల్ కార్యాలయం నడుస్తోంది. అందులోని ఒక పోర్షన్‌లో డీఈ, సిబ్బంది విధులు నిర్వహిస్తారు. మరో పోర్షన్‌లో సిబ్బంది విద్యుత్ బిల్లులు కట్టించుకుంటారు. రవికృష్ణ, ప్రసన్నలకు చెందిన ఈ భవనాన్ని గత ఏప్రిల్‌లో విద్యుత్‌శాఖ కార్యాలయానికి అద్దెకు ఇచ్చారు. అద్దె ఖరారు పేరుతో అక్కడ పనిచేస్తున్న జేఏఈ వేణుగోపాల్ పలు డాక్యుమెంట్లపై సంతకాలు చేయించుకున్నారు. కొంతకాలం తర్వాత వేణుగోపాల్ అదనంగా ఖాళీ పత్రాలపై సంతకాలు పెట్టించుకున్న డాక్యుమెంట్లపై రవికృష్ణ, ప్రసన్న దంపతుల కు చెందిన భవనం పక్కనగల ఖాళీ స్థలం తనకు విక్రయించినట్లు వేణుగోపాల్ డాక్యుమెంట్లు సృష్టించుకున్నాడని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. విద్యుత్ అధికారులతోపాటు ఎస్పీ కార్యాలయంలో, స్పం దనలో న్యాయం చేయాలని రవికృష్ణ, ప్రసన్న దంపతులు ఫిర్యాదు చేశారు.

అధికారుల విచారణ

ఈ నేపథ్యంలో విద్యుత్‌శాఖకు చెందిన కార్పొరేట్ అధికారులు గత సోమవారం ఇక్కడకు వచ్చి ఈ సంఘటనపై విచారణ చేపట్టి వెళ్లారు. ఈక్రమంలో రవికృష్ణ, ప్రసన్న దంపతులు తమకు న్యాయం చేయాలని, మోసం చేసిన జేఏఈ వేణుగోపాల్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం కార్యాలయానికి తాళాలు వేశారు. విద్యుత్‌శాఖ కార్యాలయంలో ఎమర్జెన్సీ ప్రభుత్వ కార్యాలయాల్లో ఒకటిగా గుర్తింపు ఉంది. ప్రస్తుతం తుఫాన్ ప్రభావం తీవ్రంగా ఉన్నందుకు జిల్లాలోని విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది 24గంటలు అందుబాటులో ఉండాలని ఆదేశించిన విషయం విదితమే. ఈసమయంలో విద్యుత్‌శాఖ సబ్ డివిజన్ కార్యాలయం వివాదంతో మూతపడటంతో అధికారులు, సిబ్బంది ఏంచేయాలో పాలుపోలేదు. బాధితులతో డీఈ ఇతర అధికారులు చర్చించారు. ప్రభుత్వ కార్యాలయానికి తాళాలు వేయటం చట్టవిరుద్ధమని నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. జేఏఈ తప్పుచేసినట్లయితే అతనిపై కేసుపెట్టి చట్టపరంగా న్యాయం పొందాలని సూచించారు. సాయంత్రం వరకు విద్యుత్ అధికారులు చర్చలు ఫలించకపోవటంతో వేసిన తాళాలు అలాగే ఉన్నాయి. ఇదిలాఉండగా తనకు రవికృష్ణ అనే వ్యక్తి విద్యుత్ శాఖ కార్యాలయం పక్కన ఉన్న ఖాళీ స్థలాన్ని విక్రయించి కోటి రూపాయలు తీసుకొని ఇప్పుడు తాను మోసం చేశానని అబద్ధం చెబుతున్నాడని జేఏఈ ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఇరువర్గాల్లో ఎవరిది న్యాయమో, ఎవరిది మోసమో విచారణలో తేలాల్సిఉంది. ఆ భవనాన్ని విద్యుత్‌శాఖ అధికారులు అద్దెకు తీసుకొని ఆరునెలలు అవుతున్నప్పటికీ ఇప్పటివరకు అద్దె ఖరారు కాలేదు. ఇంటి యజమానులకు అద్దె చెల్లించలేదు. ఈవిషయంపై కూడా అధికారుల నిర్లక్ష్యవైఖరి అవలంబించారని బాధితులు వాపోయారు.

చట్టపరమైన చర్యలు తీసుకుంటాం

ఈసంఘటనపై విచారణలో దోషులు ఎవరనే విషయం తేలిన వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని విద్యుత్ శాఖ ఈఈ శ్రీనివాసులు తెలిపారు. కార్యాలయానికి తాళాలు వేయటంతో విధులకు ఆటంకం కల్గటంతోపాటు వినియోగదారులు బిల్లులు చెల్లించే వీలులేక ఇబ్బంది పడిన విషయాన్ని ఆంధ్రజ్యోతి ఆయన దృష్టికి తీసుకెళ్లగా విద్యుత్ అధికారులు మాట్లాడుతున్నారన్నారు. ఉన్నతాధికారులకు ఇక్కడ జరిగిన సంఘటనలను తెలిపామని చెప్పారు. వెంటనే దోషులపై చర్యలు తీసుకుంటామన్నారు.

సర్కార్ మద్యం గోల్‌మాల్

- మాల్స్, దుకాణాలలో సరుకు పక్కదారి
- ఎక్సైజ్ కానిస్టేబుల్ చేతివాటం
- అధికారుల తీరుపైనా అనుమానాలు
- ఎస్పీకి ఫిర్యాదు చేసిన ప్రైవేటు సిబ్బంది
- అనేక దుకాణాలలో అవకతవకలు
- నిల్వలను స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ అధికారులు

ఒంగోలులో రూ.5 కోట్లు మాయం

ఒంగోలు క్రైం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సర్కార్ దుకాణాల్లో మద్యం అమ్మకాలలో గోల్‌మాల్ జరిగింది. సిబ్బంది చేతివాటం, అధికారుల పర్యవేక్షణ లోపం వెరసి ప్రభుత్వ ఖజానాకు కోట్లలో గండిపడింది. ఒంగోలులో సుమారు రూ.5కోట్ల మేర అవకతవకలు జరిగాయని ప్రాథమికంగా అంచనా. జిల్లావ్యాప్తంగా ఉన్న మద్యం దుకాణాలలో కూడా ఇదే తరహాగా నిధులు మాయమైనట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒంగోలు మంగమ్మ కాలేజీ వద్ద ఉన్న మాల్‌లో రూ.1.65 కోట్ల నిధులు మాయమైనట్లు అక్కడ పనిచేసే సిబ్బంది ఎస్పీ .దామోదర్‌కు మంగళవారం ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనతో ఎక్సైజ్ శాఖ ఉలికిపాటుకు గురైంది. హడావుడిగా అధికారులు జిల్లాలో ఉన్న మద్యం దుకాణాలలో నిల్వలతోపాటు అక్కడ ఫర్నిచర్‌ను పంచనామా నిర్వహించి స్వాధీనం చేసుకుంటున్నారు. దీంతో ఆయా మద్యం దుకాణాలలో చోటుచేసుకున్న అవకతవకలు బయటపడుతున్నాయి. మద్యం డిపోల నుంచి వచ్చిన బాటిళ్లు దుకాణాలలో స్కాన్ చేసిన తర్వాత మాత్రమే విక్రయించాలి. అందుకు విరుద్ధంగా అమ్మకాలు చేసి కొందరు సిబ్బంది భారీగా జేబులు నింపుకొన్నట్లు తెలుస్తోంది.

ఒంగోలులో బార్లకు మద్యం అమ్మకాలు

ఒంగోలులో 18 మద్యం దుకాణాలు, రెండు మాల్స్ ఉన్నాయి. అక్కడ ప్రైవేటు వ్యక్తులు సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్‌లుగా పనిచేస్తుంటారు. వారిపై పర్యవేక్షణకు ఒక సీఐ, ఎస్ఐ, ఒక కానిస్టేబుల్‌ను నియమించారు. ఆయా దుకాణాలకు డిపోల నుంచి మద్యం వస్తుంది. రోజూ విక్రయాల ద్వారా వచ్చిన నగదు బ్యాంక్‌లో జమచేయాలి. అలా చేస్తున్నారా.. లేదా? నిల్వ ఎంత ఉంది అని ఎక్సైజ్ అధికారులు చూడాలి. నగరంలో పది మద్యం దుకాణాలు, రెండు మాల్స్‌కు ఒక కానిస్టేబుల్ ఇన్‌చార్జి గా ఉన్నారు. అయితే సదరు కానిస్టేబుల్ దుకాణాలలోని మద్యం పెట్టెలను బార్లకు విక్రయించినట్లు తెలిసింది. అంతేకాకుండా స్కాన్ చేయకుండా విక్రయాలు చేసి ఆ మొత్తాన్ని సిబ్బంది, కానిస్టేబుల్ కలిసి స్వాహా చేశారని సమాచారం. 2022 నుంచి ఇప్పటివరకు మంగమ్మ కాలేజీ వద్ద ఉన్న మాల్‌లో రూ.1.65 కోట్లు, మంగమూరు రోడ్డు జంక్షన్ సమీపంలో ఉన్న మాల్‌లో రూ.95 లక్షలు నిధులు గోల్‌మాల్ అయినట్లు సమాచారం. అదేవిధంగా మిగిలిన మద్యం దుకాణాలలో మరో రూ.2.50కోట్లకుపైగా అవకతవకలు ఉన్నట్లు అధికారులు అంచనాకు వచ్చారు.

అధికారుల నిర్లక్ష్యం

ఈ వ్యవహారంలో ఎక్సైజ్ అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనబడుతోంది. కోట్ల రూపాయలు గోల్‌మాల్ అయితే ఇప్పటి వరకూ గుర్తించకపోవడం అధికారుల పనితీరుకు అద్దం పడుతోంది. మద్యం దుకాణాలకు ఇన్‌చార్జిగా ఉన్న ఎక్సైజ్ కానిస్టేబుల్ వారంలో ఒక రోజు నిల్వలను పరిశీలించాలి. అదేవిధంగా నిత్యం బ్యాంక్‌లో నగదు జమ అవుతున్నాయా లేదా అనేది చూడాలి. అదేవిధంగా ఎక్సైజ్ ఎస్ఐ 15 రోజులకు ఒకసారి, సీఐ నెలరోజులకు ఒకసారి దుకాణాలను తనిఖీ చేసి నిల్వలను సరిచూడాలి. అంతేకాకుండా ఒక దుకాణం డిపోకు రూ.20 లక్షలు బాకీ ఉంటే ఇక నిల్వలు ఇవ్వకూడదు. నిబంధన ఇలా ఉంటే కోట్ల రూపాయల సరుకు దుకాణాలకు రావడం, ఆపై దారిమళ్లడం చూస్తే అంతా తెలిసే జరిగిందని ప్రచారం జరుగుతోంది. అధికారులు పర్యవేక్షణను గాలికొదిలేసి సిబ్బంది ఇచ్చే మామూళ్లకు తలొగ్గి అంటీముట్టనట్లు వ్యవహరించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి..



ఎస్పీకి ఫిర్యాదు చేసిన సిబ్బంది

మంగమ్మ కాలేజీ వద్ద మాల్‌లో పనిచేసే సిబ్బంది అక్కడ జరిగిన అవకతవకల గురించి మంగళవారం ఎస్పీ ఏఆర్.దామోదర్‌కు ఫిర్యాదు చేశారు. రూ.1.65 కోట్లు ఎక్సైజ్ కానిస్టేబుల్ కాజేశారని, ఇప్పుడు ఆ పాపం అంతా తమకు చుట్టుకుందని విన్నవించారు. అంతేకాకుండా మాల్‌ను తగలబెట్టేందుకు కానిస్టేబుల్ ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. రెండురోజుల క్రితం సిబ్బందికి చెప్పి ఐదు లీటర్ల పెట్రోలు తెచ్చి తగులబెట్టేందుకు కుట్ర చేశారని ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

విచారిస్తున్న పోలీసులు

మద్యం దుకాణాలలో చోటుచేసుకున్న గోల్‌మాల్‌పై ఒంగోలు తాలూకా పోలీసులు విచారణ చేపట్టారు. మాల్స్, మద్యం దుకాణాలకు ఇన్‌చార్జిగా ఉన్న ఎక్సైజ్ కానిస్టేబుల్‌తోపాటుగా ఒంగోలు ఎక్సైజ్ స్టేషన్ సీఐని పిలిపించి బుధవారం విచారణ చేశారు. ఏమి జరిగింది, ఎలా నిధులు మాయం అయ్యాయి అనే కోణంలో విచారిస్తున్నారు. కాగా ఎక్సైజ్ అధికారుల ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేస్తామని సీఐ అజయ్‌కుమార్ తెలిపారు.

అక్రమాలకు పాల్పడ్డ వారిపై కేసులు

- ఖాజామొహిద్దీన్, ఈఎస్

సర్కార్ మద్యం దుకాణాలలో అక్రమాలకు పాల్పడ్డ వారిపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్.కె. ఖాజామొహిద్దీన్ తెలిపారు. వారిలో ఎక్సైజ్ సిబ్బంది ఉంటే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని మద్యం దుకాణాలలో ఉన్న ఫర్నిచర్, మద్యం నిల్వలను స్వాధీనం చేసుకుంటున్నామని వివరించారు.

దిద్దుబాటు

- బదిలీల తప్పులు సరిదిద్దే పనిలో తలమునకలైన పంచాయతీ అధికారులు
- గ్రేడ్-5, 6 ఉద్యోగులకు ఆర్డర్లు ఇచ్చేందుకు సిద్ధం
- నేడో, రేపో ముగియనున్న ప్రక్రియ

ఒంగోలు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పల్లె పండుగ కార్యక్రమం మూడోరోజైన బుధవారం కూడా కొనసాగింది. ఎక్కడికక్కడ టీడీపీ శ్రేణులు ఉత్సా హంగా పాల్గొన్నాయి. జోరువానలోనూ అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్యనేతలు తమీమ్ అన్సారియా విచారణకు ఆదేశించారు. ఫారెస్టు సెటిల్‌మెంట్ అధికారి లోకేశ్వరరావు విచారణ చేసి బదిలీల ఆర్డర్లు ఇచ్చే విషయంలో కార్యాలయ ఉద్యోగులు, కీలక అధికారి అనేక అక్రమాలకు పాల్పడ్డారని నివేదికను అందజేశారు. దీంతో ఆ బదిలీల ప్రక్రియలో భాగస్వామ్యం ఉన్న ముగ్గురు ఉద్యోగులను కలెక్టర్ తమీమ్ అన్సారియా సస్పెండ్ చేశారు.



దీంతో కొంతమంది ఉద్యోగులకు ఇంత వరకు బదిలీల ఆర్డర్లు అందని పరిస్థితి ఏర్పడింది. ప్రతి రోజూ జిల్లా పంచాయతీ కార్యాలయం వచ్చి తిరిగిపోతున్నారు. ఈనేపథ్యంలో జిల్లా పంచాయతీ అధికారి గొట్టిపాటి వెంకటనాయుడు ఈ ప్రత్యేక దృష్టిసారించి ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటి వరకు బదిలీ ఉత్తర్వులు అందని ఉద్యోగుల వివరాలను సేకరించి నోట్ ఫైల్ పెట్టాలని ఆదేశించినట్లు సమాచారం.

ఉద్యోగుల వివరాల సేకరణ

కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా పంచాయతీ అధికారులు బదిలీలపై ప్రత్యేక దృష్టిసారించారు. మండలాల వారీగా గ్రేడ్-5. గ్రేడ్-6 ఉద్యోగులు ఎంతమంది బదిలీ అయ్యారు, ఎంతమంది జాయిన్ అయ్యారు, ఇంకా ఉత్తర్వులు అందని వారు ఎంతమంది ఉన్నారు తదితర వివరాలను సేకరిస్తున్నారు. వాటిని ప్రత్యేక ప్రొఫార్మాలో పొందుపరుస్తున్నారు. పూర్తి స్థాయిలో సేకరించి కలెక్టర్ తమీమ్ అన్సారియాకు అందజేయనున్నారు. ఆ జాబితాను పరిశీలించిన తర్వాత కలెక్టర్ ఆదేశాలకు అనుగుణంగా తదుపరి చర్యలు తీసుకోనున్నారు. మరోవైపు గ్రేడ్-5, 6 ఉద్యోగుల బదిలీల్లో ఒక స్థానానికి ఇద్దరికి ఏమైనా ఆర్డర్లు ఇచ్చారా అనే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నారు. పెద్దారవీడు మండలంలో ఒక పంచాయతీకి ఇరువురు కార్యదర్శులను నియమించడంపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంతో వెంటనే ఆ శాఖ ఉన్నతాధికారులు సంబంధిత ఎంపీడీవోతో మాట్లాడినట్లు తెలుస్తోంది.

సూత్రధారిని వదిలి... పాత్రదారులను పట్టారు

పంచాయతీ కార్యదర్శులు, ఇతర సిబ్బంది బదిలీల్లో జరిగిన అవకతవకలు, ఆర్థిక లావాదేవీలకు ప్రధాన సూత్రధారిగా ఉన్న నాటి డీపీవోని వదిలేసి పాత్రధారులుగా ఉన్న అప్పటి ఏవో, జూనియర్ అసిస్టెంట్‌లపై వేటు వేయడం హాస్యాస్పదంగా ఉందని సర్పంచ్‌ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జి.వీరభద్రాచారి అన్నారు. స్థానిక సంఘ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు నెలలుగా బదిలీల ప్రక్రియ జరుగుతుందని, ఆర్థిక లావాదేవీలు కొనసాగుతున్నాయన్నారు. బదిలీలపై కలెక్టర్ ఆమోదం తర్వాత కూడా వారంరోజుల పాటు ఉత్తర్వుల కోసం కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నా ఆ శాఖ అధికారి పట్టించుకున్న పరిస్థితి లేకుండాపోయిందన్నారు. ఆ అధికారి తీరు వల్ల జిల్లా పంచాయతీ పరువు బజారున పడిందన్నారు. ఈ లావాదేవీలన్నింటినిపై విచారణ చేసి వాస్తవాలు బహిర్గతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.


రంగా విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

పేదల పెన్నిధి రంగా

- ఎమ్మెల్యే ఏలూరి
- కాంస్య విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన

చినగంజాం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రజల హృదయాలలో వంగవీటి మోహనరంగా చెరగని ముద్ర వేసి పేదల పెన్నిధిగా నిలిచారని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. సోపిరాల రైల్వేగేటు సెంటర్‌లో సుమారు రూ.25 లక్షలతో నిర్మించే కాపు నేత స్వర్గీయ వంగవీటి మోహనరంగా కాంస్య విగ్రహానికి, బస్టాండ్‌కి బుధవారం ఆయన సోపిరాల గ్రామ పెద్దలతో కలిసి శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే ఏలూరిని గ్రామ పెద్దలు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏలూరి మాట్లాడుతూ రంగా కుమారుడు రాధా తనకు మంచి ఆప్తమిత్రుడన్నారు. ఆయన తండ్రి విగ్ర హ ఏర్పాటు తన చేతులమీదుగా జరగడం ఆనందంగా ఉందన్నారు. రంగా ఆశయ సాధన దిశగా ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. అనంతరం సోపిరాల పెద్దలు ఎమ్మెల్యే ఏలూరిని ఘనంగా సన్మానించారు. ఆయనకు పలు సమస్యలపై అర్జీలను ప్రజలు అందజేశారు. పలు శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెదపూడి విజయకుమార్, సర్పంచ్ రాయని ఆత్మారావు, టీడీపీ మండల అధ్యక్షుడు పొద వీరయ్య, గ్రామ పార్టీ అధ్యక్షుడు చెరుకూ రి రాఘవయ్య, సోపిరాల గ్రామ పెద్దలు డాక్టర్ టీఎస్‌ఆర్ ఆంజనేయులు, పర్వతరెడ్డి సత్యనారాయణ, తుమ్మలపెంట సీతారామయ్య, కుర్రి రామసుబ్బారావు, టి.సుబ్బారావు, ఎస్.హరనాథ్‌బాబు, మహిళలు పాల్గొన్నారు.

ఇది మీకు తెలుసా ...!

సెక్షన్ 196పై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం



చీరాల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం టచ్ ఫోన్లు. వాట్సాప్ గ్రూపులు, సోషల్ మీడియా ద్వారా సమాచార బదిలీ వేగవంతం అయింది. ఈ నేపథ్యంలో ఆయా మాధ్యమాల్లో చేసే పోస్టులు, వ్యాఖ్యలకు సంబంధించి స్వీయనియంత్రణ అవస రం. లేదంటే సెక్షన్ 196 (ఐపీసీ సెక్షన్153ఏకి అనుగుణంగా జోడించబడింది) ప్రకారం శిక్షార్హమైన నేరం అవుతుందని పోలీసు వర్గాలు చెప్తున్నాయి. ఉపన్యాసాలు, రచనలు, హావభావాలు, కనిపించే ప్రాతినిధ్యాలు, ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్, ఇతర ఏవిధమైన చర్యల ద్వారానైనా ప్రాంతీయ భాష, జాతి, కులం, మతం, వర్గం ప్రాతిపదికలపై శతృత్వ భావాన్ని, ద్వేషభావాన్ని, వ్యతిరేకతను, మనస్పర్థలను ప్రేరేపించడం, అందుకు ప్రయత్నించడం శిక్షార్హమైన నేరమని సెక్షన్ 196లో ఉన్నట్లు చెప్తున్నారు. వాట్సాప్ ద్వారా లేదా ఇతర మాధ్యమాల ద్వారా పంపే సందేశాలు, లేదా ఉపన్యాసాల విషయంలో స్వీయ నియంత్రణ అవసరం. సమాజంలో అశాంతిని, ఉద్రేకపూరిత వాతావరణం కలిగించే విధంగా రెచ్చగొట్టే వాఖ్యలు చేయడం నైతికంగా సరైన పద్ధతి కాదని సమాజ హితులు అభిప్రాయపడుతున్నారు. ఆధ్యాత్మిక కేంద్రాలు, వాటి విశిష్టత, ప్రాముఖ్యతలకు సంబంధించిన అంశాలు చాలా సున్నితమైనవి. వాటిపై వ్యాఖ్యలు లేదా అభిప్రాయాలు మాధ్యమాల్లో వ్యక్తపరిచేటపుడు స్వీయనియంత్రణ లేకుంటే తిప్పలు తప్పవని అధికారులు చెప్తున్నారు. స్వీయనియంత్రణ అన్నింటికీ మంచిది. సమాజానికీ మంచిది.

ఈ-పంట నమోదుతోనే ప్రభుత్వ రాయితీలు

డీఏవో రామకృష్ణ

పంగులూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో రైతులు సాగు చేసిన పంటలను ఈ - పంటలో నమోదు చేసుకుంటేనే ప్రభుత్వ రాయితీలు వర్తిస్తాయని జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ అన్నారు. మండలంలోని కొండమూరు గ్రామంలో ఈ-పంట నమోదు వివరాలపై రైతులతో నిర్వహించిన గ్రామ సభలో డీఏవో రామకృష్ణ మాట్లాడారు. రైతుకు ఉచిత బీమా సౌకర్యం వర్తించాలన్నా, ప్రకృతి వైపరీత్యాల సమయంలో పంటకు నష్టపరిహారం, సున్నా వడ్డీ లభించాలన్నా, ఉత్పత్తులకు మద్దతు ధర దక్కాలన్నా పంట నమోదు తప్పనిసరిగా చేయాలన్నారు. సర్పంచ్ బండి శివకుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీనివాసరావు, ఏవో సుబ్బారెడ్డి, అంజయ్య, శ్రీనివాసరావు, రైతు సేవా కేంద్రం అధికారులు దినేష్, శివాని, పృధ్వీ, ఫిలిప్స్, రైతులు పాల్గొన్నారు. సాగులో ఉన్న మినుము పైరును డీఏవో అధికారులతో కలిసి పరిశీలించారు. కొండమూరు, రేణంగివరం గ్రామాలలో వర్షం కారణంగా కోత దశకు చేరుకున్న మినుములో మొలక వచ్చిందని, పంట చేతికి దక్కే పరిస్థితి లేదని రైతులు మొరపెట్టుకున్నారు. 950 ఎకరాలలో కోత దశలో ఉన్న మినుముకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక నివేదిక ఉన్నతాధికారలుకు పంపినట్లు రామకృష్ణ తెలిపారు.


రేణంగివరంలో మొలకెత్తిన మినుమును డీఏవోకు చూపిస్తున్న రైతులు

సాగులో మెలకువలు పాటించాలి

బల్లికురవ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : పంటల సాగులో రైతులు మెలకువలు పాటించాలని వ్యవసాయ అధికారి కుమారి సూచించారు. కొమ్మినేనివారిపాలెంలో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా వరి పంటను ఏవో పరిశీలించారు. వరిలో జింకు లోపం లేకుండా రైతులు జింక్ సల్ఫేడ్‌ను పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పంగులూరు : పంటసాగులో రైతులు తగిన యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయాధికారి డి.సుబ్బారెడ్డి సూచించారు. చందలూరులో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రబీలో సాగు చేసే శనగ, పొగాకులో ఎరువుల వినియోగం, పురుగు, తెగుళ్ల నివారణపై సూచనలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కిష్టారావు, సుబ్బారావు, రైతు సేవాకేంద్ర అధికారి ప్రియ, రైతులు పాల్గొన్నారు.

అధ్వానంగా తమ్మవరం రోడ్డు

- భారీ వాహనాలతో ఛిద్రం
- ప్రయాణికుల అవస్థలు


గుంతలతో ఉన్న తమ్మవరం రోడ్డు

మేదరమెట్ల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఐదేళ్ల వైసీపీ పాలనలో రోడ్లను పట్టించుకోకపోవడంతో రోడ్లన్నీ గోతులమయమై వాహనచోదకులకు నరకం చూపిస్తున్నాయి. దాదాపు అన్ని రహదారులూ పూర్తిగా ధ్వంసమయ్యాయి. ద్విచక్రవాహనాలు కూడా వెళ్లడానికి వీలు లేనంతగా గుంతలు పడ్డాయి. మేదరమెట్ల నుంచి తమ్మవరం వెళ్లే రోడ్డు పూర్తిగా గోతులతో నిండిపోయింది. 2007 సంవత్సరంలో ప్రధాన మంత్రి సడక్ యోజన కార్యక్రమంలో తారు రోడ్డు నిర్మాణం చేపట్టారు. తరువాత ఒక్కసారి పైన మరో లేయర్ తారు వేశారు. పైన వేసిన లేయర్ ఎక్కువ భాగం లేచిపోయింది. రోడ్డు మెతక ఉన్న చోట గుంతలు పడడంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. తమ్మవరం కొండ నుంచి భారీ ఎత్తున గ్రావెల్ అక్రమంగా బయటకు తరలించడంతో ఒక్కొక్కటి 50 టన్నుల బరువు ఉన్న టిప్పర్లు ఈ రోడ్డు నుంచే వెళ్తాయి. ఇక్కడున్న సిమెంట్ పైపుల కంపెనీ లారీలు, భారీ యంత్రాలను తయరు చేసే మరో ఫ్యాక్టరీ వాహనాలతో పాటు రేషన్ బియ్యం నిల్వ చేసే భారీ గోడౌన్‌లు, పొగాకు కంపెనీ వీటి అన్నింటికీ మించి ఇక్కడ కొత్తగా నిర్మిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణం కోసం సామగ్రి లారీలు రావాడంతో రోడ్డు పూర్తిగా గోతులమయంగా మారింది. ఇక్కడ నుంచి వెళ్లే ప్రతి వాహనం అధిక బరువుతో వెళ్లడం వలన రోడ్డు పూర్తిగా గుంతలు పడడంతోపాటు కంకర లేచి ద్విచక్ర వాహనాలు పడిపోయే పరిస్థితి ఏర్పడుతోంది. నాలుగు రోజుల కిందట రాళ్లు లేచిన చోట ఎవరో కొద్దిగా ఎర్రమట్టి పోశారు. జాతీయ రహదారులు నిర్మించడానికి ఒక రకమైన పద్ధతి, రాష్ట్రీయ రహదారులు నిర్మించడానికి ఓ పద్ధతి, జిల్లా స్థాయిలోని గ్రామాల రోడ్డులను మరో పద్ధతిలో వేస్తారు. గ్రామీణ రోడ్లు 25 టన్నుల వాహనాలు వేళ్లేలా రోడ్డు నిర్మిస్తారు. అయితే ఇ క్కడ 50 టన్నులకు మించిన వాహనాలు తిరగడం వలన రోడ్లు ధ్వంసమవుతు న్నాయని గ్రామస్థులు చెప్తున్నారు. దీనికి తోడు కల్వర్టు వద్ద సిమెంట్ రోడ్డు రెండు వైపులా కుంగిపోయి పెద్ద గుంతలు పడ్డా యి. భారీ వాహనాలు తిరగడం వలనే ఇ లా రోడ్డు కూలిపోయింది. దాదాపు 3 వేల జనాభా ఉన్న తమ్మవరం గ్రామస్థులతో పాటు ప్రభుత్వానికి అత్యధిక మొత్తంలో పన్నులు చెల్లించే పెద్ద పెద్ద ఫ్యాక్టరీలు ఇ క్కడ ఉన్న గత ఐదేళ్లలో ఒక్కసారి కూడా ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టలేదు. పం చాయతీ రాజ్ అధికారులు ఇప్పటికైనా స్పందించి రోడ్డు మరమ్మతులతో పాటు ని ర్మాణం చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.


కల్వర్టుకు రెండు వైపులా కూలిన రోడ్డు

మద్యం అక్రమ విక్రయాల కట్టడికి పటిష్ట చర్యలు

ఎస్పీ తుషార్ డూడి



ఎస్ఐతో మాట్లాడుతున్న ఎస్పీ డూడి

చినగంజాం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మద్యం అక్రమ రవణా, విక్రయాలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఎస్పీ తుషార్ డూడి అధికారులను ఆదేశించారు. స్థానిక పోలీసుస్టేషన్‌ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీసు స్టేషన్ పరిసరాలను పరిశీలించి, నేర రికార్డులను చూశారు. పేకాట, కోడి పందాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలు జరగడానికి అవకాశం ఉన్న ప్రాంతాలపై నిఘా ఉంచాలని ఎస్పీ ఆదేశించారు. చెడు నడత కలిగిన వ్యక్తుల కదిలికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని, వారు ఏమి చేస్తున్నారు, ఎటువంటి వ్యక్తులను కలుస్తున్నారో దృష్టి పెట్టాలన్నారు. వారు నేరలకు పాల్పడకుండా కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. పల్లె నిద్ర, విజిబుల్ పోలీసింగ్, వాహన తనిఖీలు, బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిపై చర్యలు తీసుకోవడం వంటి కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించడం వలన నేరాలను తగ్గించవచ్చునన్నారు. ప్రజలకు, విద్యార్థులకు గంజాయి, ఇతర మత్తు పదార్థాల వలన కలిగే దుష్ప్రభావాల గురించి, సైబర్ నేరాలు జరుగుతున్న తీరును వివరించి చైతన్యం తీసుకురావాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని గస్తీ, పెట్రోలింగ్ విధులు పటిష్టంగా నిర్వహించాలని ఎస్పీ డూడి సూచించారు. వరదనీరు బ్రిడ్జిలు, కల్వర్టులు, రోడ్లపై నుంచి ప్రవహిస్తుంటే ప్రజలు వెళ్లకుండా చూడాలన్నారు. లోతట్టు ప్రాంతాలలో ఉండే వారిని సురక్షితమైన పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు. వరద ప్రభావ ప్రాంతాలపై ఇంకొల్లు సీఐ రమణయ్య, ఎస్ఐ శీలం రమేష్‌ను అడిగి ఎస్పీ తెలుసుకున్నారు.

శ్రీదేవికి మంత్రి గొట్టిపాటి నివాళి


శ్రీదేవి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి రవికుమార్

సంతమాగులూరు, అక్టోబరు 16 : మండలంలోని వెల్లలచెరువు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు, జడ్పీటీసీ సభ్యులు చింతా రామారావు సతీమణి శ్రీదేవి (56) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బాచిన చెంచుగరటయ్య రామారావు ఇంటికి వెళ్లి శ్రీదేవి చిత్రపటానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారివెంట టీడీపీ నాయకులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో రెండు గొర్రెల మృతి


మృతి చెందిన గొర్రెలు

అద్దంకి, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతానికి గురై రెండు గొర్రెలు మృతి చెందాయి. స్థా నికులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని వెంపరాల కు చెందిన దుద్దారి వెంకటరావుకు చెందిన గొర్రెల మంద శాంతినగర్ వైపు పొలాల నుంచి బుధవారం రాత్రి ఇంటికి వస్తుండగా రెండు గొర్రెలు దర్గా సమీపంలో రోడ్డు వెం బడి ఉన్న విద్యుత్ స్తంభాన్ని తాకుతూ వెళ్లాయి. ఆ సమయంలో విద్యుత్ ప్రసరణ జరిగి అవి అక్కడికక్కడే మృతి చెందాయి. వీటి విలువ రూ.50 వేలు ఉం టుందని బాధితుడు వెంకటరావు తెలిపారు.


నీటమునిగిన ప్రదేశాలను పరిశీలిస్తున్న డాక్టర్ మహేంద్రనాథ్

కాలనీవాసులకు అండగా ఉంటాం

డాక్టర్ మహేంద్రనాథ్

వేటపాలెం(చీరాల), అక్టోబరు 16 : అక్కాయిపాలెం పంచాయతీ పరిధిలోని అబ్దుల్ కలాం కాలనీలో ఇళ్ల మట్టూ చేరిన వర్షపు నీటితో ఇబ్బంది పడుతున్న వారిని బుధవారం టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి డాక్టర్ మహేంద్రనాథ్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులతో మాట్లాడుతూ కాలనీ వాసులకు అన్ని విధాలా అండగా ఉంటామన్నారు. ఎవరూ ఆధైర్య పడొద్దని చెప్పారు. వర్షం నీటితో మగ్గం గుంటలోకి నీరు చేరి ఇబ్బంది పడుతున్న ఓ చేనేత కార్మికునికి రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. సంబంధిత అధికారులతో మాట్లాడి తదుపరి చర్యలు చేపట్టేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

పోలీస్ విచారణ పారదర్శకంగా జరగాలి

మాజీ మంత్రి డాక్టర్ పాలేటి

చీరాల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండలం పాపాయిపాలెంకు చెందిన పులి శ్రీనివాసరావు మృతి యాక్సిడెంట్ కాదని, హత్య కోణంలో విచారణ పారదర్శకంగా జరపాలని మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు డిమాండ్ చేశారు. తన ఆసుపత్రిలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాలేటి మాట్లాడుతూ జరిగింది హత్య అయితే పోలీసులు దాన్ని ప్రమాదంగా చిత్రీకరిస్తున్నారని ఆరోపించారు. వాస్తవ కోణంలో ఆలోచించకుంటే తనవంతు పాత్ర తాను పోషించాల్సి ఉంటుందన్నారు. భవిష్యత్‌లో మరొకరికి ఈ పరిస్థితి ఎదురుకాకుండా ముందస్తుగా తాను మానవతా దృక్పథంతో ముందుకొచ్చానన్నారు. మటనా స్థలంలో తాను గమనించిన అంశాలను, కుటుంబ సభ్యులు, గ్రామస్థులు, కొందరు ముఖ్యులు చెప్పిన మాటల ఆధారంగా తాను పోలీస్ చర్యలపై ఆరోపణలు చేస్తున్నానని పేర్కొన్నారు.

కొత్త మద్యం షాపులు రెడీ

సరుకు తెప్పించిన అత్యధిక షాపుల లైసెన్స్‌దారులు

అద్దంకి, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి) : కొత్త మద్యం షాపుల ప్రారంభానికి చకచకా ఏర్పాట్లు చేస్తున్నారు. అద్దంకి నియోజకవర్గంలో మొత్తం 23 మద్యం షాపులు ఉండగా బుధవారం సాయంత్రానికి నిర్వాహకులు అత్యధిక శాతం షాపులకు ప్రారంభం చారు. మరి కొందరు గురువారం మద్యం తీసుకు వచ్చేందుకు ఏర్పాటు చేసుకుంటున్నారు. గురువారం నుంచి ఎక్కువ షాపులలో మద్యం అమ్మకాలు ప్రారంభించనున్నారు. రెండు రోజులు కిందట ప్రభుత్వ మద్యం దుకాణాలు మూసి వేయడం, కొత్త మద్యం షాపులు తెరవడం ఆలస్యం అవుతుండడంతో మద్యం ప్రియులు ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు. కొత్త బ్రాండ్ల మద్యం అందుబాటులోకి రావడానికి కొంత సమయం పట్టే అవకాశం ఉండడంతో ప్రస్తుతం ప్రారంభించే మద్యం షాపులలోనూ పాత మద్యం అమ్మే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తుంది.


సరుకును దింపుతున్న సిబ్బంది

పోటెత్తిన మద్యం ప్రియులు

ప్రారంభమైన ఒకేఒక్క షాప్ వద్ద బారులుతీరిన వైనం

పర్చూరు, అక్టోబరు, 16 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు మండలంలో నాలుగు మద్యం దుకాణాలకు ప్రభుత్వ అనుమతి లభించింది. అయితే బుధవారం ఒకే ఒక్క వైన్ షాప్ ప్రారంభించడంతో మద్యం ప్రియులు పోటెత్తారు. నిన్నటి వరకూ నాసిరకం మద్యంను ఎక్కువ ధరకు కొని తాగామని, నాణ్యమైన మందు తక్కువ ధరకు లభిస్తుండడంతో పెద్ద ఎత్తున కొనుగోలుకు పోటీ పడ్డారు.

120 మద్యం సీసాలు స్వాధీనం.. నిందితుడి అరెస్ట్

వేటపాలెం(చీరాల), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వల్లారెడ్డిపాలెంలో కిరాణాషాప్ నిర్వహిస్తున్న వ్యక్తి మద్యంను అక్రమంగా విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు ఎస్సై వెంకటేశ్వర్లు, సిబ్బందితో కలసి తనిఖీలు నిర్వహించారు. దుకాణంలో అక్రమంగా నిల్వ ఉంచిన 120 (క్వార్టర్) రాయల్ స్టాగ్ సీసాలను స్వాధీనం చేసుకుని, నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఆ వివరాలను ఎస్సై వెంకటేశ్వర్లు బుధవారం వెల్లడించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

23 నుంచి రెవెన్యూ సదస్సులు

అద్దంకి, అక్టోబరు 16 : మండలంలోని పలు గ్రామాలలో ఈనెల 23 నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీచరణ్ తెలిపారు. 23వ తేదీన నరసింహపురం రెవెన్యూ గ్రామానికి సంబంధించి చక్రాయపాలెం గ్రామ సచివాలయం వద్ద, 25వ తేదీన ధర్మవరం గ్రామ సచివాలయం వద్ద, 26వ తేదీన శంఖవరప్పాడు గ్రామ సచివాలయం వద్ద, 29వ తేదీన ఉప్పలపాడు గ్రామ సచివాలయం వద్ద రెవెన్యూ సదస్సులు జరుగుతాయని తెలిపారు.

ఆగని వర్షం

- పొంగిప్రవహిస్తున్న వాగులు
- స్తంభించిన రాకపోకలు
- గుండ్లకమ్మ నదిలో పెరిగిన నీటి వరద

అద్దంకి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి ప్రాంతంలో బుధవారం ఎడతెరిపి లేకుండా వర్షపు జల్లులు పడ్డాయి. ఉదయం సమయంలో ఒకింత వాన ఆగినా అనంతరం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఇప్పటికే పూర్తి స్థాయిలో నిండిన భవనాసి చెరువు అలుగు పారుతోంది. జలాల్ని చేపల వేటను సాగిస్తున్నారు. ఎగువ ప్రాంతాలలో కురిసిన వర్షాలతో గుండ్లకమ్మ నదిలో వరద నీటి ప్రవాహం బాగా పెరిగింది. దీంతో గుండ్లకమ్మ నదిలో ఉన్న ఊటబావుల మట్టూ వరద నీరు చేరింది. బుధవారం రాత్రి నుంచి గుండ్లకమ్మ నదిలో వరద ఉధృతి పెరిగే అవకాశం ఉంది. అదే సమయంలో నల్లవాగు, చిలకలేరు, దోర్నపు వాగు, భవనాసి వాగు లు కూడా నిండు గా ప్రవహిస్తున్నాయి. రోజంతా వర్షపు జల్లులు పడడంతో ప్రజల రోజువారీ కార్యక్రమాలకు ఆటంకం ఏర్పడింది.


గుండ్లకమ్మ నదిలో అద్దంకి సమీపంలో ప్రవహిస్తున్న వరద నీరు

ఇంకొల్లు : వర్షాలకు పోతుమద్రాను రోడ్డులోని పాతమద్రాను రోడ్డులో వంకాయలపాడు, దుద్దుకూరు గ్రామాల వద్ద వాగులపై ఉన్న నేలచప్టాల మీదగా నీరు ఉధృతంగా ప్రవహిస్తో ది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఇంకొల్లు ఒంగోలు వెళ్లే రోడ్డులో దుద్దుకూరు వద్ద వాగు పారుతోంది. పర్చూరు వెళ్లే రోడ్డు వంకాయలపాడు వద్ద వాగు పా రుతుండడంతో బుధవారం రాకపోకలు నిలిచిపోయాయి.

నీట మునిగిన పంటలు

పర్చూరు : మూడు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలతో వాగులు, కాలువలు పొంగిపొర్లుతున్నాయి. శివారు కాలనీలు జలమయమయ్యాయి. ప్రధాన రహదారులపై భారీగా నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. పర్చూరు - కారంచేడు మధ్య ప్రవహించే ఓగేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పంట పొలాలను ముంచెత్తడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వందల ఎకరాల్లో సాగుచేసిన మిర్చి, వైట్‌బర్లీ మొక్కలు, కారంచేడు పరిసర ప్రాంతాల్లో ఎక్కడ చూసినా పంట పొలాలు నీటమునిగాయి. అంతర్గత రహదారులు చిత్తడిగా మారాయి. పర్చూరు- కారంచేడు ఓగేరు వాగు కర కట్టలు బలహీన పడ్డాయి. అక్కడక్కడా గండ్లు ఏర్పడడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు


పొంగుతున్న పర్చూరు - కారంచేడు మధ్య ఓగేరు వాగు


ఉధృతంగా ప్రవహిస్తున్న దుద్దుకూరు వాగు


కారంచేడు సమీపంలో వాగును తలపిస్తున్న పంట పొలాలు


పర్చూరు సమీపంలో నీట మునిగిన మిర్చి

పల్లెలకు పూర్వ వైభవం

ఎమ్మెల్యే ఏలూరి


పెదగంజాం వద్ద వరదనీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి


సీసీ రోడ్డుకు భూమి చేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చినగంజాం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పల్లెల అభివృద్ధి బాటలు వేస్తూ వాటికి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు కృషి చేస్తుందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా చినగంజాం, సోపిరాల గ్రామాల్లో రూ.89.50లక్షల వ్యయంతో నిర్మించనున్న ఏడు అంతర్గత సిమెంట్ రోడ్లకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే ఏ లూరి మాట్లాడుతూ రాష్ట్రంలో గత ఐదేళ్లు పల్లెల్నీ అంధకారంలో మగ్గాయన్నారు. స్థానిక సంస్థలను వైసీపీ అధ్యక్షుడు జగన్‌రెడ్డి నిర్వీర్యం చేశారన్నారు. వైసీపీ నిరంకుశ పాలనలో నిధుల్ని పక్కదారి పట్టాయన్నారు. పల్లెల అభివృద్ధికి కేటాయించాల్సిన నిధులను దారిమళ్లించి దుర్వినియోగం చేశారన్నారు. ఈ కారణంగా పల్లెలలో కనీస సౌకర్యాలు అమలుకు నోచుకోలేదన్నారు. పంచాయతీలలో సర్పంచులు, పాలకవర్గం ఉత్సవ విగ్రహాలుగా మారారన్నారు. ఎన్నికల సమయంలో హామీ మేరకు మౌలిక వసతులు కల్పనలో భాగంగా రోడ్లు, డ్రైన్లు, తాగునీటికి ప్రభుత్వం ప్రాధాన్యతను ఇస్తుందన్నారు. గ్రామాల సుస్థిర అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలను రచిస్తూ దశలవారీగా గ్రామాలలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. అన్నదాతలకు సాగునీటి ఇబ్బందులు లేకుండా పంట కాలువల ఆధునీకరణ, వరద కాలువల మరమ్మతులు చేపడుతున్నట్లు చెప్పారు. పెదగంజాం, రాజుబంగారుపాలెం గ్రామాల మధ్య గల ఎన్నీల్ వారిని సమీపంలోని తూములవాగు ఉధృతిని ఎమ్మెల్యే ఏలూరి పరిశీలించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆయన పర్యటించి ప్రజలతో మాట్లాడి పరిస్థితులను తెలుసుకున్నారు. అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. స్థానికుల పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో నీటి నిల్వలు లేకుండా చర్యలు చేపట్టాలని, పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. పెదగంజాం వాసులకు ఇబ్బంది లేకుండా తూములవాగు వద్ద బ్రిడ్జి నిర్మాణం చేపట్టి, రోడ్డు ఎత్తును పెంచి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేస్తామని ఏలూరి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ జె.ప్రభాకరరావు, ఎంపీడీవో ఎ.శ్రీనివాసమూర్తి, డీటీ శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ ఈఈ రామకృష్ణ, ఏఈ కే.రామచంద్రుడు, ఉపాధిహామీ పీడీ వెంకట్, ఏపీవో లక్ష్మీదేవి, గ్రామ సర్పంచ్ రాయని ఆళ్వారావు, ఉపసర్పంచ్ రాఘవయ్య, నాయకులు పోద వీరయ్య, టి.ఆయిరావు, ఆకోది సుబ్బారెడ్డి, అజాద్, పి.పార్వతీశం, సవ్వల వీరరాఘవులు, నరహరి శ్రీనివాసరావు, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి దిశగా ముందడుగు

వేటపాలెం(చీరాల) : ప్రతి పల్లెలో ప్రగతి వెలుగులు అభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం ముందడుగు వేసే క్రమంలో పల్లెపండుగ వారోత్సవాలు కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య చెప్పారు. వేటపాలెంలో రూ.30లక్షలు వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు ఎమ్మెల్యే కొండయ్య బుధవారం శంకుస్థాపన చేశారు. కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రత్యేక దృష్టి సారించడంపై ప్రజ లు కృతజ్ఞతలు తెలుపుతున్నారని ఆయన చెప్పారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిని ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వంగులూరు : ఉపాధి నిధులతో రోడ్ల నిర్మాణం చేపట్టడంతో గ్రామాలలో పండుగ వాతావరణం నెలకుందని ఎంపీడీవో కె.సర్పరాపాణి అన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ముప్పవరం, జాగర్లమూడివారిపాలెం, కొండమూరు గ్రామాలలో సీసీ రోడ్డు, గోకుల నిర్మాణాలకు బుధవారం భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ హనుమంతరావు, ఈవోపీఆర్డీ కె.సుమంత్, ఏపీవో సంతోషం, నోడల్ అధికారి కె.నాగభూషణం, నేతలు ఏడుకొండలు, బ్రహ్మానందస్వామి, సర్పంచ్ రౌతు సాంబశివరావు, శివకుమారి, కార్యదర్శులు బేగం, ఖాన్, ఈసీ మురళీ, సచివాలయ, ఎన్‌ఆర్ ఈజీఎస్ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఇంకొల్లు : గ్రామాలలో మౌలికవసతులు కల్పించడమే పల్లె పండుగ లక్ష్యమని ఎంపీడీవో శ్రీనివాసరావు అన్నారు. పావులూరు, నక్కలపాలెంలో బుధవారం రోడ్డు పనులకు భూమి పూజ చేసారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు గుంజి వెంకట్రావు, సర్పంచ్ బలియమ్మ, ఏపీవో రేణుక, రాంబాబు, వెంకట్రావు, రవి, నాయకులు పాల్గొన్నారు.

నేడు పాల్గొన్నున్న మంత్రి

అద్దంకి : పల్లె పండుగ-పంచాయతీ వారోత్సవాలలో భాగంగా గురువారం ఉదయం 10 గంటలకు మండలంలోని మోదేపల్లిలో రూ.30 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి శంకుస్థాపన చేస్తారని ఎంపీడీవో సింగయ్య తెలిపారు.

పర్చూరు : పల్లెల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎంపీడీవో ప్రద్యు మ్నకుమార్ అన్నారు. చిన్ననందిపాడు, అడుసుమల్లి, గొల్లపూడి, బాపాయపాలెం గ్రా మాల్లో రూ.50లక్షల విలువ చేసే సీసీ రోడ్లు, మినీ గోకులాల నిర్మాణాలకు బుధవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు షేక్ మస్తాన్, సీనియర్ నాయకులు చెరుకూరి చిరంజీవి, దొప్పలపూడి ఆదినారాయణ, శివరాం, ఇనోకొల్లు కోసనా సత్యనారాయణ, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

అద్దంకిటౌన్ : పల్లెల్లో వసతుల కల్పనలో భాగంగా సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ఇతర అభివృద్ధి పనులకు చర్యలు తీసుకుంటుందని ఎంపీడీవో బత్తిన సింగయ్య అన్నారు. బుధవారం మండలంలోని పేరాయపాలెం, కుంకుపాడు, కోటికలపూడి గ్రామాలలో పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవాలను నిర్వహించారు. పేరాయపాలెంలో పలు ప్రాంతాలల్లో రూ.30లక్షలతో, కోటికలపూడిలో రూ.40లక్షలతో, కుంకుపాడులో రూ.30లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ప్రసాదరావు, ఏపీవో దుర్గాప్రసాద్, పంచాయతీ రాజ్ ఏఈ వెంకటేశ్వరరావు, ఈసీ నాగరాజు, పంచాయతీ కార్యదర్శులు ఎన్‌ఆర్ఈజీఎస్ టీమ్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, సచివాలయ సిబ్బంది, గ్రామ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మేదరమెట్ల : గ్రామాలల్లో మౌలిక వసతుల ఏర్పాటుకు ప్రభుత్వం అధిక ప్రాధా న్యతను ఇస్తుందని ఎంపీడీవో రాజ్యలక్ష్మి అన్నారు. బుధవారం రావినూతలలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా బీసీ కాలనీలో రూ.40 లక్షలతో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.


ఏబీసీ కాలువలో ఉన్న సాగర్ నీరు

ఏబీసీకి నిలిచిన సాగర్ నీరు

బల్లికురవ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : వర్షాల కారణంగా పంటలు దెబ్బతినకుండా ఉండేందుకు ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తగా అద్దంకి బ్రాంచ్ కెనాల్‌కు సాగర్ నీటిని పూర్తిగా నిలిపి వేయించింది. అద్దంకి బ్రాంచ్ కాలువకు వచ్చే 17వ మైలు వద్ద కాలువకు లీకేజ్ ఉండడం, భారీ వర్షాలు పడుతుండడంతో పంట పొలాలు మునిగి పోకుండా ఏబీసీకి వచ్చే నీటిని జీరో శాతం తగ్గించారు. లీకేజ్ మరమ్మతు పనులు పూర్తి అయిన ఏబీసీకి మాత్రం నీటి విడుదల చేయకుండా అధికారులు తగు జాగ్రత్తలు పాటిస్తున్నారు. వర్షాలు తగ్గ ముఖం పట్టాక తిరిగి ఏబీసీ కాలువకు పూర్తి స్థాయిలో నీటి సరఫరా జరిగేలా చర్యలు చేపడుతున్నారు. రైతులు కూడా ఇప్పుడు నీటితో అవసరం లేదని కాలువ ద్వారా గానీ వచ్చే నీరు పంట పొలాలు మునక వేస్తాయని అంటున్నారు. బల్లికురవ మండలం వల్లాపల్లి వద్ద ఉన్న 33వ మైలు వద్ద ఏబీసీ కాలువ పూర్తిగా ఆడుగంటింది. అధికారులు మరో నాలుగు రోజుల్లో తిరిగి కాలువలకు నీటిని విడుదల చేస్తామన్నారు.

ఎమ్మెల్యే కొండయ్యను కలిసిన సీపీఐ నారాయణ

చీరాల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే ఎంఎం కొండయ్యను బుధవారం సీపీఐ జాతీయ నాయకుడు కే నారాయణ కలిశారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పలు అంశాలపై వారి మధ్య చర్చ జరిగింది. అనంతరం నారాయణను ఎమ్మెల్యే కొండయ్య సత్కరించారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలి : ఎమ్మెల్యే

ఉడ్‌నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రజ హాస్పటల్‌ను బుధవారం ఎమ్మెల్యే కొండయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులకు కొంత సేవాభావంతో మెరుగైన వైద్యసేవలందించాలని కోరారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, గుండె వైద్యనిపుణులు డాక్టర్ వృధ్వీ శ్రీనివాస్, మగర్ వ్యాధి నిపుణుడు డాక్టర్ బీమంజువాణి, సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

కంటి పరీక్షల కేంద్రం మూత

- వృద్ధులకు తిప్పలు » పునరుద్ధరించాలని విజ్ఞప్తి


అద్దంకి సీహెచ్‌సీలో మూసిఉన్న విజన్ సెంటర్ కంటి పరీక్షలు నిలిపివేసినట్లు ఏర్పాటు చేసిన స్టిక్కర్

అద్దంకి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ వైద్యశాలలో కం టి చూపు పరీక్షలు నిలిపి వేయడం తో వృద్ధులకు అవస్థలు తప్పడం లేదు. వైసీపీ పాలనలో ఒప్పందం కుదుర్చుకున్న సంస్థ గడువు ముగియడంతో కంటి పరీక్షలను నిలిపి వేశారు. ఈ క్రమంలో అద్దంకి సీ హెచ్‌సీలో ముఖ్యమంత్రి ఈ ఐ కేంద్రం కూడా సుమారు నెల రోజు ల నుంచి కంటి పరీక్షలు నిలిపి వేశారు. గతంలో ప్రతి రోజు సరాసరి 30 నుంచి 50 మందికి అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలో కంటి పరీక్షలు చేసుకుంటుండేవారు. వీరిలో అవసరమైన వారికి ఉచితంగా కళ్ల జోళ్లను పంపిణీ కూడా జరిగేది. అద్దంకి పట్టణం, మండలంలోని పలు గ్రామాలతో పాటు సమీపంలోని ఉన్న బల్లికురవ, సంతమాగులూరు, కొరిశపాడు, జే.పంగులూరు, మేదరమెట్ల మండలాల నుంచి కూడా వృద్ధులు, కంటి చూపు మందగించిన వృద్ధులు అద్దంకి సీహెచ్‌సీకి వస్తుంటారు. దీంతో కంటి పరీక్షల కోసం ప్రైవేట్ వైద్యశాలలకు లేదా ఉచిత వైద్య శిబిరాల వద్దకు వెళ్లాల్సి వస్తుందని వృద్ధులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అద్దంకి సీహెచ్‌సీలో కంటి చూపు పరీక్షలను పునరుద్ధరించాలని పలువురు కోరుతున్నారు.

చేపల దొంగల పంట పండింది

ఊరచెరువులో యథేచ్ఛగా వేట

ఇంకొల్లు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : దుద్దుకూరులో రెండు రోజులుగా చేపల దొంగల పంట పండింది. గ్రామంలో దేవదాయ శాఖకు చెందిన ఊరచెరువులో యథేచ్ఛగా చేపల వేట సాగుతోంది. ఈ చెరువులో చాలా కాలంగా చేపలు పట్టుకోకపోవడంతో చేపలు బాగా పెద్ద సైజులో పెరిగాయి. చెరువుకు ఒక కాపలాదారు ఉన్నారు. పట్టించుకునే వారు లేకపోవడంతో రాత్రి పగలు అనే తేడా లేకుండా చేపలు పట్టేస్తున్నారు. దీనిని ఏ అధికారి పట్టించుకోలేదు. గ్రామస్థులు కూడా మౌనంగా ఉన్నారు. ప్రస్తుతం కురిసిన వర్షాలతో చెరువులో నీరు ఎక్కువగా చేరింది. దీంతో పగలు, రాత్రి తేడా లేకుండా కొందరు పెద్దపెద్ద చేపలను పట్టుకుంటున్నారు. బుధవారం సుమారు రూ.10వేల విలువైన చేపలను పట్టి అమ్ముకున్నారు. గ్రామస్థులు దేవదాయ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తెలిపారు.





జలదంకి మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న చీకటివాగు, చిప్పలేరువాగు



నెల్లూరు: తల్పగిరి కాలనీని చుట్టేసిన వరదనీరు



అనంతసాగరం : సోమశిలలో నేలవాలిన వరిపైరు

అతలాకుతలం

- రోజంతా ఒకటే వాన
- పోర్టులో మూడో నెంబరు హెచ్చరిక జారీ
- పొంగి ప్రవహిస్తున్న వాగులు, వంకలు
- సురక్షిత ప్రాంతాలకు లోతట్టువాసులు
- సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్న కలెక్టర్, ఎస్పీ
- నేడు కూడా విద్యాసంస్థలకు సెలవు

బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో జిల్లా చిగురుటాకులా వణికిపోతోంది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు ఉప్పొంగి లోతట్టు ప్రాంతాలను ముంచెత్తుతున్నాయి. ఇక్కడున్న ప్రజలను అధికార యంత్రాంగం సురక్షిత ప్రాంతాలకు తరలిస్తోంది. మొన్నటిదాకా నెర్రెలిచ్చిన చెరువులూ జలకళను సంతరించుకుంటున్నాయి. రోడ్లపై వరద ఉధృతి ఎక్కువగా ఉండటంతో కొన్నిగ్రామాలకు రాకపోకలు ఆగిపోయాయి. ఎగువ నుంచి వరద వచ్చి చేరుతుండటంతో సోమశిల డ్యాం నీటిమట్టం అంతకంతకూ పెరుగుతోంది. పెన్నా నదిలోనూ వరద ప్రవాహం ఎక్కువవుతుండటంతో పరివాహక ప్రాంతాలను అప్రతమత్తం చేశారు. కండలేరు, రాళ్లపాడు, కనిగిరి, సర్వేపల్లి రిజర్వాయర్లకు వరద చేరుతోంది. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది.

నెల్లూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం జిల్లాను అతలాకుతలం చేస్తోంది. వరుసగా మూడో రోజు కూడా ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. బుధవారం కుండపోత వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పలు చోట్ల వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. బుధవారం ఒక్కరోజే జిల్లాలో సరాసరి 83.5 మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా జలదంకిలో 185 మి.మీ, కావలిలో 174.4, నెల్లూరు నగరంలో 135.6, నెల్లూరు రూరల్‌లో 123.8 మి.మీ చొప్పున వర్షం కురిసింది. మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం మధ్యాహ్నం వరకూ భారీ వర్షం కురవడంతో జనజీవనం స్తంభించింది. బుధవారం అర్ధరాత్రి తర్వాత సూళ్లూరుపేట-పొన్నేరి మధ్య తీరం వాయుగుండం దాటుతుందని వాతావరణ శాఖ ప్రకటించింది. కృష్ణపట్నం పోర్టులో మూడవ నెంబరు ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. వాయుగుండం తీరానికి వస్తున్న కొద్దీ వర్షం ఎక్కువవడంతోపాటు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులు కూడా ప్రారంభమయ్యాయి. భారీ వర్షాలకు నెల్లూరు నగరంలో పరిస్థితులు దారుణంగా మారాయి. వర్షపు నీరంతా రోడ్లపైనే పారుతోంది. పలుచోట్ల మోకాలిలోతు పారుతుండటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. లోతట్టు ప్రాంతాలు జలమయమ్యాయి. జిల్లాలో పలు చోట్ల వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. ఈ ప్రభావంతో పలు ప్రాంతాల్లో రోడ్లకు గండ్లు పడడంతో రాకపోకలు స్తంభించాయి. భారీ వర్షాల నేపథ్యంలో ఆకస్మిక వరదలు సంభవించే ప్రమాదం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇప్పటి వరకూ 14 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి అక్కడికి 870 మందిని తరలించారు. వీరికి ఆహారంతో పాటు అన్ని వసతులు కల్పించారు.

● నేడు కూడా సెలవు

భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలకు గురువారం కూడా సెలవు ప్రకటించారు. శుక్రవారం నుంచి యథావిధిగా విద్యాసంస్థలు తెరుచుకుంటాయని కలెక్టర్ ఒక ప్రకటనలో తెలియజేశారు.



వెంకటాచలం : సర్వేపల్లి రిజర్వాయర్ వద్ద సిమెంట్ బస్తాలు వేస్తూ..

'సోమశిల'కు పెరిగిన ఇన్‌ఫ్లో

అనంతసాగరం (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో సోమశిల జలాశయానికి నీటి ప్రవాహం పెరుగుతోంది. బుధవారం ఉదయం 6 గంటలకు 10,920 క్యూసెక్కుల వస్తుండగా సాయంత్రానికి 20,161 క్యూసెక్కులకు చేరింది. గురువారానికి మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రతి గంటకు తీస్తున్న నీటి నమోదు వివరాలను ఎస్ఈ వెంకటరమణారెడ్డి పర్యవేక్షిస్తున్నారు. డ్యాంలో 53.071 టీఎంసీల నీరు నిల్వ ఉండగా దిగువ డెల్టాకు 50, కండలేరుకు 6,000, ఉత్తర కాలువకు 40 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

● సంగం బ్యారేజీ వద్ద..

● సంగం (ఆంధ్రజ్యోతి): సంగం బ్యా రేజీకి సుమారు 4,400 స్యూసెక్కుల వరద నీరు చేరుతోంది. బ్యారేజి వద్ద నీటిమట్టం 8.5 అడుగులకు చేరింది. కనిగిరి ప్రధాన కాలువకు 100 క్యూసెక్కులు, నెల్లూరు చెరువుకు 50 క్యూసెక్కులు, నెల్లూరు తాగునీటికి 40 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. మిగిలిన వరదను నెల్లూరు బ్యారేజీకి విడుదల చేస్తున్నట్లు ఏఈ వినయ్ కుమార్ తెలిపారు.

● లింగసముద్రం (ఆంధ్రజ్యోతి) : రాళ్లపాడు ప్రాజెక్టులో నీటిమట్టం 12.4 అడుగులకు చేరింది. 3,800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఇది మరింతే పెరిగే అవకాశం ఉందని ఏఈ చంద్రమౌళి తెలిపారు.

● అధికారులకు సెలవుల రద్దు

బుధవారం అతిభారీ వర్షాలు కురవడం, గురువారం కూడా ఇదే పరిస్థితి కొనసాగుతుందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టర్ ఆనంద్, ఎస్పీ జీ కృష్ణకాంత్‌లు పలు ప్రాంతాల్లో పర్యటిస్తూ నివారణ చర్యలను పర్యవేక్షించారు. ఇప్పటికే కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి 24 గంటలూ సిబ్బందిని అందుబాటులో ఉంచారు. అక్కడకు వస్తున్న ప్రతీ కాల్‌ను తీసుకొని సంబంధిత అధికారులను అలర్ట్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే దసరా సెలవులకు వెళ్లిన అధికారులు, ఉద్యోగులు తక్షణమే విధులకు హాజరుకావాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. పరిస్థితులు చక్కబడే వరకూ అధికారులు, ఉద్యోగులకు సెలవులు రద్దు చేస్తున్నట్లు ప్రకించారు. జిల్లాస్థాయి అధికారుల నుంచి గ్రామస్థాయి ఉద్యోగుల వరకూ ఆయా హెడ్ క్వార్టర్స్‌లో అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. అలానే పోలీసు సిబ్బందితోపాటు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను కూడా సిద్ధంగా ఉంచారు. ప్రమాదకర కల్వర్టర్లు, వంతెనల వద్ద పోలీసు పహారా కొనసాగుతోంది. విద్యుత్ శాఖ కూడా తన సిబ్బంది మొత్తాన్ని 24 గంటలూ విధులు నిర్వహించేలా ఉత్తర్వులు ఇచ్చింది. తాగునీరు కలుషితమయ్యే ప్రమాదముండడంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఎక్కడికక్కడ నీటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. విద్యుత్ సమస్య ఏర్పడినా తాగునీటి సరఫరాకు ఇబ్బందులు లేకుండా తాగునీటి సరఫరా స్కీమ్‌ల వద్ద జనరేటర్లు అందుబాటులో ఉంచారు.

748.5 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు

నెల్లూరు (వ్యవసాయం) : జిల్లాలో 748.5 ఎకరాల్లో వివిధ పంటలు దెబ్బతిన్నాయి. 610 ఎకరాల్లో వరిపైరు నీట మునిగింది. అదేవిధంగా 22 ఎకరాల్లో నారుమడులు నీటిలో నానుతున్నాయి. 100 ఎకరాల్లో పొగాకు పంట దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జిల్లాలో దాదాపు 45గ్రామాల్లో వివిధ పంటలు దెబ్బతిన్నాయి. చేజర్లలో మండలంలో 175, విడవలూరులో 5, జలదంకిలో 8, సీతారామపురంలో 65.5, అనంతసాగరం 350, కలిగిరిలో 10 ఎకరాల్లో వరిపైరు అదేవిధంగా వింజమూరు మండలంలో 10, కొడవలూరులో 4.5, కొండాపురంలో 5ఎకరాల్లో వరినారు మడులు దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెప్పారు. వింజమూరు మండలంలో 10, కలిగిరిలో 20, కొండాపురంలో 10 ఎకరాల్లో పొగాకు దెబ్బతిన్నది. కావలి మండలం చలంచర్ల గ్రామంలో 2, దగదర్తి మండలం ఉలవపాళ్లలో 3, బోగోలు మండలం తాళ్లూరులో 2.5, పొదలకూరు మండలం బట్టులపల్లిపాడు గ్రామంలో 9 ఎకరాల్లో పూలు, కర్బూజ, కూరగాయలు, మిరప పంటలు దెబ్బతిన్నట్లు ఉద్యాన శాఖ అధికారులు తెలిపారు.

మండలం పేరు	వర్షపాతం (మి.మీ)
జలదంకి	185.0
కావలి	174.4
నెల్లూరు అర్బన్	135.6
నెల్లూరు రూరల్	123.8
కొండాపురం	108.2
టీపీగూడూరు	103.4
పొదలకూరు	103.2
కందుకూరు	102.8
ఇందుకూరుపేట	99.8
కోవూరు	99.2
లింగసముద్రం	97.6
సీతారాంపురం	97.2
వరికుంటపాడు	95.6
వింజమూరు	92.8
సైదాపురం	88.2
ఉదయగిరి	87.8
గుడ్లూరు	85.2
వెంకటాచలం	80.8
ముత్తుకూరు	80.2
కలిగిరి	80.2
వలేటివారి పాలెం	77.6
కలువాయి	76.2
ఉలవపాడు	72.6
దగదర్తి	68.4
దుత్తలూరు	68.4
బుచ్చి	68.2
మనుబోలు	65.2
విడవలూరు	65.2
కొడవలూరు	64.6
రాపూరు	62.4
అనంతసాగరం	58.2
బోగోలు	51.6
అల్లూరు	50.2
సంగం	47.6
ఆత్మకూరు	44.6
చేజర్ల	38.4
మర్రిపాడు	35.4
ఏఎస్‌పేట	35.4



సైదాపురం : చెరువును తలపిస్తున్న రోడ్డు



నెల్లూరు : పొగతోటలో మురుగు, వర్షపునీరు కలిసి ప్రవహిస్తుండటంతో అవస్థలు




కొండాపురంలో మిడతవాగు



వరికుంటపాడులో నక్కలగండివాగు





అల్లూరు : ఇస్కపల్లి తీరంలో పడవలు



సైదాపురం : కౌవల్యానదికి జలకళ

బిట్రగుంట : తాటిచెట్లపాలెం వద్ద కసురుమీదున్న కడలి



నెల్లూరు : కేవీఆర్ పెట్రోలు బంకు వద్ద రోడ్డుపై నిలిచిపోయిన వరదనీరు

కొత్త దుకాణాలు
పాత ధరలు

- ప్రైవేటు మద్యం దుకాణాల ప్రారంభం
- పూర్తిస్థాయిలో అందని స్టాకు.. వందషాపులే ఆరంభం
- పాత బ్రాండ్లను చూసి అవాక్కయిన మందుబాబులు
- వారం రోజులపాటు తప్పదన్న ఎక్సైజ్ అధికారులు
- సాంకేతిక సమస్యలు పరిష్కారం తర్వాతే కొత్త బ్రాండ్లు



కలువాయిలో మద్యం కోసం గుమికూడిన మందుబాబులు

కొత్త మద్యం పాలసీ అమలులోకి వచ్చినా మందుబాబులను 'జే' బ్రాండ్లు వదలనంటున్నాయి. కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తడంతో వారం రోజుపాటు వైసీపీ సర్కారు నాటి బ్రాండ్లనే అదే ధరకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. బుధవారం ప్రారంభమైన కొత్త దుకాణాల వద్దకు వెళ్లిన మందుబాబులు 'జే' బ్రాండ్లను చూసి నివ్వెరపోయారు. ధర కూడా తగ్గకపోవడంతో వ్యాపారులను నిలదీశారు. వారం రోజుపాటు ఇవే దొరుకుతాయని ఎక్సైజ్ అధికారులు చెప్పడంతో అంతా శాంతించారు.

- 6లో..

మరో 24 గంటలు అప్రమత్తంగా ఉండాలి

● మత్స్యకారులకు కలెక్టర్, ఎస్పీ సూచన



ఇందుకూరుపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మరో 24గంటలపాటు అప్రమత్తంగా ఉండాలని, సముద్రంలోకి ఎట్టిపరిస్థితుల్లోనూ వేటకు వెళ్లొద్దని కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్ మత్స్యకారులకు సూచించారు. బుధవారం మండలంలోని మైపాడు సముద్రతీరంలో వారు పర్యటించి మత్స్యకారులతో మాట్లాడారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటివరకు ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని చెప్పారు. జలదంకి, కావలిలో అత్యధిక వర్షపాతం నమోదైందన్నారు. లోతట్టు ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి భోజనం, మంచినీరు, మందులు తదితర సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. సుమారు 500 మందినిపైగా పునరావాస కేంద్రాలకు తరలించామన్నారు. ఎస్పీ కృష్ణకాంత్ మాట్లాడుతూ పెన్నానది పరివాహక ప్రాంతంలో కట్టలు బలహీనంగా ఉన్నచోట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కాజ్‌వేల వద్ద పోలీసు పహారా ఉంచామన్నారు. ప్రజలందరూ కూడా అప్రమత్తంగా ఉంటూ ఈ రెండురోజులు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. వారి వెంట నెల్లూరు ఆర్డీవో నాగసంతోష్ అనూష, సీఐ సుధాకర్‌రెడ్డి, మండల తహసీల్దారు, ఎస్ఐ నాగార్జునరెడ్డి, స్థానిక నాయకులు కొండూరు కృష్ణారెడ్డి, తదితరులు ఉన్నారు.

'మిషన్ వాత్సల్య' కొందరికే..!

- లబోదిబోమంటున్న అనాథ పిల్లలు

6





భైరవకోనలో కనువిందు చేస్తున్న జలపాతం



శివుని పాదాలు తాకుతూ ప్రవహిస్తున్న గంగమ్మ

ఆహ్లాదకరంగా భైరవకోన

ప్రముఖ పర్యాటక శైవక్షేత్రం భైరవకోనలోని జలపాతం కనువిందు చేస్తోంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు కొండ ప్రాంతంలో నుంచి నీరు వచ్చి పడుతోంది. ఈ విషయం తెలుసుకున్న చుట్టుపక్కల గ్రామాల వారు జలపాతాన్ని తిలకించేందుకు తరలివస్తున్నారు. అయితే, నీటి ఉధృతి ఎక్కువగా ఉండటంతో అటువైపు ఎవరూ వెళ్లకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టి, హెచ్చరికలు జారీ చేశారు. కాగా, వర్షాలకు భైరవకోన ప్రాంతంలోని కుంటలకు, చెరువులకు నీరు భారీగా వచ్చి చేరుతోంది.

- సీతారామపురం (ఆంధ్రజ్యోతి)



అమ్మా.. భోజనం అందుతోందా!?

'అమ్మా మీకు భోజనం అందుతోందా!?. మందులు అన్నీ సక్రమంగా ఇస్తున్నారా!? సౌకర్యాలకేం కొదవలేదు కదా!' అంటూ కలెక్టర్ ఆనంద్ పునరావాసంలో తలదాచుకున్న ప్రజలకు అడిగి తెలుసుకున్నారు. ఇందుకూరుపేట మండలం గంగపట్నంలోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని కలెక్టర్‌తోపాటు ఎస్పీ కృష్ణకాంత్ పరిశీలించారు. సౌకర్యాల కల్పనపై అక్కడున్న చిన్నపిల్లల తల్లులతో కలెక్టర్ ఆరా తీశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. ఇళ్లు లేనివారికి ఇళ్ల మంజూరుతోపాటు బకింగ్‌హామ్ కాలువ మీద వంతెన నిర్మాణాన్ని పరిశీలిస్తామని చెప్పారు.

- ఇందుకూరుపేట (ఆంధ్రజ్యోతి)



2 పడవులు.. ఏడుగురు గజ ఈతగాళ్లు

● విపత్తును ఎదుర్కొనేందుకు అధికారుల ఏర్పాట్లు

మండలంలోని కోలగట్ల గ్రామంలో రెండు బోట్లు, ఏడుగురు గజ ఈతగాళ్లను రెవెన్యూ అధికారులు బుధవారం సిద్ధం చేశారు. భారీ వర్షాలతో బీరాపేరు, బొగ్గేరు వాగులు ప్రవాహించి సంగం బ్యారేజీకి భారీగా వరద వస్తోంది. ఈ వరద వల్ల మండలంలోని కోలగట్ల దళితవాడ, వీర్లగుడిపాడు గ్రామాలు ముంపునకు గురై రాకపోకలు స్తంభించే అవకాశం ఉంది. దీన్ని ఎదుర్కొనేందుకు ముందుస్తుగా రెవెన్యూ అధికారులు పడవలను, గజ ఈతగాళ్లను రప్పించారు. కాగా, దువ్వూరు ఎస్టీ కాలనీలో బడి పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఏర్పాటు చేసిన ఎర్త్ వైరు తగిలి మధు అనే రైతుకు చెందిన గొర్రె మృతి చెందింది.

- సంగం (ఆంధ్రజ్యోతి)

సేవా పురస్కారాల

సు'ధీరుడు'

ఆయనో బడిపంతులు. తన పని తాను చేసుకునిపోక సమాజ సేవకు శ్రీకారం చుట్టారు. అటు విద్యార్థులకు నాణ్యమైన బోధన అందిస్తూనే వారు ఏ రంగంలోనైనా రాణించేలా తీర్చిదిద్దుతున్నారు. అంతేకాదండోయ్.. సమాజ సేవ, సాహితీవేత్తగా మూడు దశాబ్దాలుగా రాణిస్తూ 2 వేలకుపైగా ప్రశంసలు, 300లకుపైగా పురస్కారాలు అందుకున్న సేవా పురస్కారాల ధీరుడుగా పేరు గడించారు. ఆయనే బుచ్చిరెడ్డిపాళెంకు చెందిన గండికోట సుధీర్‌కుమార్.



బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఎందరో రాజకీయ ఉద్దండులు, స్వాతంత్ర్య సమరయోధులకు నిలయమైన బుచ్చిరెడ్డిపాళెంలో సామాన్య కుటుంబమైన గండికోట రమణయ్య, హైమావతి దంపతులకు 1976లో జన్మించిన సుధీర్‌కుమార్‌కు విద్యార్థి దశ నుంచే సేవాతత్వం, సాహిత్యంపై ఆసక్తి ఉండేది. 1998 ఆగస్టు 14న ఉదయగిరి మండలం ఆర్లపడియ గ్రామం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడిగా బాధ్యతలు చేపట్టారు. రెండేళ్ల పాటు ఆ స్కూల్లో 7వ తరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణతకు కృషి చేశారు. 2002లో సంగం మండలం జెండాదిబ్బ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులను సైన్స్‌ఫెయిర్‌లో రాష్ట్రస్థాయికి తీసుకెళ్లి ద్వితీయ బహుమతి సాధించేలా చేశారు. 2011లో బుచ్చిలో బడి బయట పిల్లలను బడిలో చేర్పించేందుకు ఎంతో కృషి చేశారు. 2021లో బుచ్చి నగర పంచాయతీ రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడిగా విద్యార్థులను వ్యాసరచన, వక్తృత్వ, సాంస్కృతిక కార్యక్రమాలలో చైతన్యవంతుల చేసి రాష్ట్రస్థాయిలో ఎన్నో బహుమతులు సాధించేలా చేశారు.

● ప్రధాన పురస్కారాలు

బడుగు, బలహీన, అణగారిన వర్గాల సమాజం కోసం నిరంతరం కృషి చేస్తున్న గండికోటకు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు ఎన్నో పురస్కారాలు అందజేశాయి. జాతీయ జీవన సాఫల్య పురస్కారం, విద్యా రత్న, సాహిత్య భూషణ్, తెలుగు వెలుగు, కాలాం, సర్వేపల్లి, నేషనల్ ఎక్సలెన్సీ, స్మార్ట్ ఇండియా, పర్యావరణ మిత్ర, సేవారత్న, సేవా వజ్ర, ఇండియన్, బుక్ ఆఫ్ రికార్డ్స్‌తో సహా 300 పురస్కారాలు, 2వేలకుపైగా ప్రశంసా పత్రాలను అందుకున్నారు. విద్యాశాఖతోపాటు పలు శాఖల ఉన్నతాధికారులు, సహోపాధ్యాయులు, ఆత్మీయులు, స్నేహితులు, సాహితీవేత్తలు, సామాజికవేత్తలు, బంధువుల ప్రసంశలు పొందారు. సేవలతో పొందే తృప్తి వెలకట్టలేనివని, ఈ పేరు, ప్రతిష్ఠలు సేవాభావంపై బాధ్యతను పెంచుతుందన్నారు. తాను ఉద్యోగ విరమణ ఆఖరి గడియ వరకు మంచి సమాజం కోసం కృషి చేస్తానని తెలిపారు.

● తెలుగు భాష.. యాసకు...

తెలుగుభాష, యాస శ్వాసగా ఉండే సుధీర్, గిడుగు రామ్మూర్తి జయంతిని విద్యార్థుల నడుమ 3 దశాబ్దాలుగా నిర్వహిస్తూ కవి సమ్మేళనంలో పాల్గొనడం, శ్రీశ్రీ, జాషువా, వేమన, పద్యాలను పిల్లలకు నేర్పించి వారితో పాడించి పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తున్నారు. రామచంద్రాపురంలో జాషువా సాహితీ చైతన్య నిల యం ద్వారా విద్యార్థుల్లో పఠనాశక్తిని పెంపొందించేందుకు కృషి చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఎక్కువగా మొక్కలు నాటడం, ప్లాస్టిక్ రహిత సమాజం కోసం కృషి చేయడం, సెలవు దినాల్లో ప్రజలను చైతన్యవంతులను చేయడం, పిల్లల్లో పచ్చదనం పరిశుభ్రత, సైన్స్‌పై అవగాహన కల్పించడం చేస్తుంటారు.

మిషన్ వాత్సల్య

కొందరికే..!

● 17వేలకుపైగా దరఖాస్తులు ● 497 మందికే ఆమోదం

● లబోదిబోమంటున్న అనాథ పిల్లలు

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఏ అండా లేని నిస్సహాయ స్థితిలో ఉన్న అనాథ పిల్లలకు ఆర్థిక సహాయం అందించి ఆదుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'మిషన్ వాత్సల్య' నీరుగారుతోంది. ఈ పథకానికి కేంద్రం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు చెల్లించేలా నిర్ణయించారు. ఈ పథకంలో అర్హత పొందిన పిల్లలకు 2022-23 ఆర్థిక సంవత్సరానికి ముందు నెలకు రూ.2వేల ఆర్థిక సహాయం చేస్తుండగా ఆ తరువాత ఆ మొత్తాన్ని కేంద్రం రూ.4వేలకు పెంచింది. గత వైసీపీ సర్కారు తన వాటా నిధులను అనాథ పిల్లలకు ఇవ్వడానికి కూడా చొరవచూపలేదు. ఈ పథకం అమలుకు అధికార గణాన్ని పల్లెలకు పంపి అర్హులైన అనాథల పేర్లు నమోదు చేయించింది. ఆనాడు జగన్ మామయ్య అండగా ఉండగా భయమెందుకుకనే ఊకదంపుడు ప్రచారం కూడా సాగింది. అయితే ఏడు నెలల్లోనే రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది దరఖాస్తులు రావడంతో వాటిని అడ్డదిడ్డంగా కోతకోశారు. అందులో భాగంగా జిల్లాలో 2023-24లో 17వేల మందికిపైగా దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. అందులో కేవలం 497 మందికి మాత్రమే లబ్ధి చేకూర్చేలా ఆమోదించి ఆప్యాయత మాటల్లోనే తప్ప లబ్ధి చేకూర్చే విషయంలో కాదని నిరూపించారు. విధి వంచితుల పట్ల వైసీపీ ప్రభుత్వం నిర్దయగా వ్యవహరించడంతో అనాథ పిల్లలు లబోదిబోమంటున్నారు.



● అర్హులు ఎవరంటే..

18 ఏళ్లలోపు వయసులో తల్లిదండ్రులు, తల్లి లేదా తండ్రిని కోల్పోయిన వారు, ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న, పెంచలేని, విడాకులు తీసుకున్న తల్లిదండ్రుల పిల్లలు, బాల న్యాయ (రక్షణ అండ్ ఆదరణ) చట్టం -2015 ప్రకారం ఆదరణ అవసరమైన చిన్నారులు, బాలకార్మికులు, అక్రమ రవాణాకు గురైన వారు, హెచ్ఐవీ బాధిత పిల్లలు, దివ్యాంగులు, యాచక పిల్లలు, వీధుల్లో నివశిస్తున్న వారి పిల్లలు, హింసకు దోపిడీకి గురైన వారు, అనాథ ఆశ్రమాల్లోని బాలలు అర్హులు. గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ వార్షిక ఆదాయం రూ.72వేలు, పట్టణ, నగర ప్రాంతాల్లో రూ.96వేలు, ప్రభుత్వ వసతి గృహాల్లో ఉండి చదువుకునే వారు అనర్హులు. గ్రామ, వార్డు స్థాయిలో సచివాలయ, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది, బాలల కోసం పనిచేస్తున్న ఇతర సిబ్బంది అనాథ పిల్లలను గుర్తించి వారి వివరాలను ప్రభుత్వ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి. మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారుల ఆధ్వర్యంలో అర్హత కలిగిన వారిని గుర్తించి కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తారు. ఇది ఏటా నిరంతర ప్రక్రియ. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో అర్హత ఉన్నా ఆర్థిక సహాయం పొందలేని అనాథలు తమకు న్యాయం జరుగుతుందని, ఆర్థిక సహాయం అందుతుందని ఆశతో ఉన్నారు.

● 17 వేలకు పైగా దరఖాస్తులు

మిషన్ వాత్సల్య పథకానికి జిల్లాలో 2022-23లో 591 మంది, 2023-24లో 497 మందిని మాత్రమే వైసీపీ ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ పథకం కింద అర్హులుగా తేలిన వారిలో 90 శాతం మంది తల్లి లేదా తండ్రిని కోల్పోయిన, హెచ్ఐవీ వ్యాధికి సంబంధించిన వారు కావడం విశేషం. వీరిలో దాదాపు 30 నుంచి 40 శాతం మంది కొవిడ్ సమయంలో తల్లిని లేదా తండ్రిని కోల్పోయారు. ఇవేవీ గత ప్రభుత్వం పరిగణలోకి తీసుకోలేదు.

నిరంతర ప్రక్రియ



మిషన్ వాత్సల్యకు అనాథ పిల్లలను గుర్తించి వారికి ఆర్థిక సహాయం అందచేయడం నిరంతర ప్రక్రియ. ఈ ఏడాది 497 మందికి ఆర్థిక సహాయం అందచేశాం. ఈ పథకానికి ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హులైన అనాథలను గుర్తించి వివరాల నివేదికను కలెక్టర్‌కు అందచేస్తాం. ఆమోదం లభించిన తరువాత వారికి ఆర్థిక ఇస్తాము.

- హేనా సుజన్,
ఐసీడీఎస్
పీడీ

పోర్టు రంగంలో నైపుణ్యాభివృద్ధికి కృషి

● అదానీ స్కిల్ డెవలప్‌మెంట్ సీఈవో జితిన్ త్రివేది



మాట్లాడుతున్న ఏఎస్‌డీసీ సీఈవో జితిన్

ముత్తుకూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అదానీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ద్వారా నైపుణ్యాభివృద్ధికి కృషి చేస్తున్నామని అదానీ స్కిల్ డెవలప్‌మెంట్ సీఈవో జితిన్ త్రివేది పేర్కొన్నారు. బుధవారం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో పోర్టు సంబంధిత కోర్సులను పోర్టు సీఈవో జగదీష్ పటేల్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ అంతర్జాతీయ వేదికలపై పోర్టు, లాజిస్టిక్స్ రంగం ప్రస్తుతం విస్తృతంగా అభివృద్ధి చెందుతూ ఉందన్నారు. ఈ నేపథ్యంలో యువత పోర్టు రంగంలో నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని, తద్వారా ఉజ్వల భవిష్యత్తును పొందాలన్నారు. పోర్టు సీవో జగదీష్ పటేల్ మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు ద్వారా యువత సమగ్ర అభివృద్ధి సాధించాలన్నారు. కార్యక్రమంలో పోర్టు సీఈవో రాజన్‌బాబు, జీ వేణుగోపాల్, కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో అవినీతిపై విజిలెన్స్ విచారణ : సోమిరెడ్డి



చేతితో లాగితే ఇంటి గోడ పెచ్చులు ఊడిపోవడాన్ని చూపిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

వెంకటాచలం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వెంకటాచలం లోని జగనన్న కాలనీలో రూ.కోట్ల అవినీతి జరిగిందని, ఈ అవినీతిపై విజిలెన్స్ విచారణ జరుగుతుందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. తుఫాన్ నేపథ్యంలో బుధవారం వెంకటాచలంలోని జగనన్న కాలనీని ఆయన సందర్శించారు. ఈసందర్భంగా గిరిజనుల ఇళ్లను పరిశీలించారు. ఇళ్ల గోడలు వర్షానికి నాని పెచ్చులు ఊడిపోవడాన్ని గుర్తించారు. శ్లాబ్‌కు స్టీల్ సక్రమంగా వాడకపోవడనాన్ని సైతం గుర్తించిన ఆయన, పూర్తిగా పనులు నాసిరకంగానే జరిగాయన్నారు. అనంతరం మాట్లాడుతూ ఇళ్ల పునాదులు నిర్మించే సమయంలోనే భారీగా అవినీతి జరిగిందన్నారు. లెవలింగ్ పేరిట రూ.20లక్షలకుపైగా వైసీపీ నాయకులు దోచుకున్నారని విమర్శించారు. అవినీతికి పాల్పడిన ఏ ఒక్కరిని విడిచిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో కల్పన, టీడీపీ నాయకులు బొమ్మి సురేంద్ర, కుంకాల నాగేంద్రప్రసాద్, చల్లా నాగార్జున్ రెడ్డి, మునుస్వామి, రాఘురామయ్య తదితరులు పాల్గొన్నారు.

● గిరిజనులకు దుప్పట్ల పంపిణీ

వెంకటాచలం మండలం కొండ కింద ఉన్న గిరిజన కాలనీలో బుధవారం జోరు వానలోనూ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పర్యటించారు. గిరిజనులను ఆప్యాయంగా పలకరించారు. అనంతరం దుప్పట్లు, ప్లాస్టిక్ పట్టాలు పంపిణీ చేశారు. అలాగే పిల్లలకు చాక్లెట్లు, బిస్కెట్ ప్యాకెట్లు అందజేశారు. కాలనీ అంతా తిరిగి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

నెల్లూరు-విజయవాడ బస్సులకు రిజర్వేషన్ సౌకర్యం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): నెల్లూరు నుంచి విజయవాడ రాకపోకలకు సూపర్‌లగ్జరీ సర్వీసులకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించామని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ 1వ డిపో డీఎం మురళీ కృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నెల్లూరు నుంచి విజయవాడకు వెళ్లే సర్వీసుల్లో ఉదయం 4 గంటలకు 42309, 5 గంటలకు 42070, 7.30కు 42231, మధ్యాహ్నం 1.30కు 42250, సాయంత్రం 4 గంటలకు 42259, సాయంత్రం 4.30కు 42245 సర్వీసు నెంబర్లకు రిజర్వేషన్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. అలాగే విజయవాడ నుంచి నెల్లూరుకు వచ్చే ప్రయాణికులు ఉదయం 11.30 గంటలకు 42310, మధ్యాహ్నం 12.30కు 42071, 3.30కు 42232, రాత్రి 9 గంటలకు 42251, రాత్రి 12.05కు 42269, రాత్రి 12.30కు 422 46 సర్వీసు నెంబర్ల బస్సుల్లో రిజర్వేషన్ చేసుకోవచ్చన్నారు.



ఉదయగిరి : ఎక్సైజ్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న బాలాజీనగర్ వాసులు

కొత్త దుకాణాలు
పాత ధరలు

● ప్రైవేటు మద్యం దుకాణాల ప్రారంభం

● పూర్తిస్థాయిలో అందని స్టాకు.. వందషాపులే ఆరంభం

● పాత బ్రాండ్లను చూసి అవాక్కయిన మందుబాబులు

● వారం రోజులపాటు తప్పదన్న ఎక్సైజ్ అధికారులు

● సాంకేతిక సమస్యలు పరిష్కారం తర్వాతే కొత్త బ్రాండ్లు



ఆత్మకూరులో ఓ దుకాణం ముందు మద్యం ప్రియులు

నెల్లూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లుగా మందుబాబులు ఎదురుచూస్తున్న పాత మద్యం విధానం అమలులోకి వచ్చింది. బుధవారం జిల్లావ్యాప్తంగా ప్రైవేటు మద్యం దుకాణాలు తెరుచుకున్నాయి. అయితే లైసెన్సుపరంగా కొన్ని సమస్యలు ఎదురవడంతో తొలిరోజు షాపుల ప్రారంభం ఆలస్యమైంది. బుధవారం సాయంత్రం 7 గంటల ప్రాంతానికి జిల్లావ్యాప్తంగా 100 షాపులు ఓపెన్ అయ్యాయి. మిగిలిన 82 షాపులకు స్టాక్ విడుదల కాకపోవడంతో గురువారం తెరుచుకోనున్నాయి.

● పాత షాపులే

శాశ్వత లైసెన్సు ఇవ్వాలంటే చాలా తతంగం ఉంది. షాపు నిర్వహించే గది అద్దె ఒప్పందం, బ్లూప్రింట్ తదితరాలను ఎక్సైజ్ శాఖకు అందజేయాలి. ఇదంతా జరగాలంటే 15 రోజుల సమయం పడుతుంది. దీనివల్ల మద్యం వ్యాపారులు తీవ్రంగా నష్టపోతారు. అందుకని తాత్కాలిక లైసెన్సులు ఇచ్చారు. మద్యం షాపులను కూడా పాత దుకాణాల్లోనే కొనసాగేలా చర్యలు తీసుకున్నారు. అయితే పాత దుకాణాల్లో స్టాక్, ఫర్నిచర్ అలాగే ఉండటంతో వీటిని తరలించడానికి సాయంత్రం అయ్యింది. దీంతో తొలిరోజు దుకాణాల ఓపెనింగ్ ఆలస్యమైంది.

● పాత బ్రాండ్లే!

షాపులు, వాటి యాజమాన్యాలు కొత్తవి అయినా సరుకు, ధరలు మాత్రం పాతవే. కొంతకాలంపాటు మద్యంప్రియులు పాత బ్రాండ్లు, పాత ధరలతో సర్దుకోక తప్పదు. వైసీపీ ప్రభుత్వంలో పేరున్న బ్రాండ్ల మద్యం కొనుగోళ్లను పూర్తిగా ఆపేశారు. నాసిరకం బ్రాండ్లను మందుబాబులతో తాగించారు. వీటిని పక్కకు నెట్టేసి పేరున్న ప్రముఖ బ్రాండ్ల సరుకును ఎక్సైజ్ శాఖ కొనుగోలు చేయాలి. ఈ సరుకు మద్యం డిపోలకు చేరాలి. అక్కడి నుంచి ఇండెంట్ల వారీగా షాపులకు చేరాలి. ఈ ప్రక్రియ మొదలు కావడానికి 15 రోజుల సమయం పడుతుందని ఎక్సైజ్ శాఖ అంటోంది. అంతవరకు పాత బ్రాండ్లు, పాత ధరలతోనే సర్దుకోక తప్పని పరిస్థితి.

● కొనసాగిన నిరసన

కాగా, తమ ప్రాంతంలో మద్యం దుకాణాలు వద్దంటూ రెండవ రోజు బుధవారం కూడా జిల్లాలో అక్కడక్కడా నిరసనలు వ్యక్తం అయ్యాయి. బుచ్చిరెడ్డిపాళెం, ఉదయగిరి తదితర ప్రాంతాల్లో స్థానికులు ఆందోళన చేశారు. చివరకు ఎక్సైజ్ అధికారులు వారికి సర్దిచెప్పారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

న్యూస్ బాక్స్

డీఎస్పీ సోమశిల సందర్శన



అనంతసాగరం: జలాశయం వద్ద సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎస్పీ

అనంతసాగరం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయాన్ని ఆత్మకూరు డీఎస్పి వేణుగోపాల్ బుధవారం సందర్శించారు. డ్యాంకు వస్తున్న వరద ప్రవాహం వివరాలను సిబ్బందిని అడిగి తెలుకున్నారు. అనంతరం కమ్మవారిపల్లి వద్ద సోమశిల ప్రధాన రోడ్డును వాగును పరిశీలించారు. ఆయన వెంట ఎస్ఐ అనుషా ఉన్నారు.

● కలువాయి (ఆంధ్రజ్యోతి): బుధవారం సాయంత్రం ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్ మండలంలో పర్యటించారు. వాగులు, వంకలను ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఎస్ఐ సుమన్ ఉన్నారు.



కావలి: తుమ్మలపెంట రోడ్డు డైవర్షన్‌లో డీఎస్పీ, సీఐ

● కావలి, (ఆంధ్రజ్యోతి): డీఎస్పీ శ్రీధర్, రూరల్ సీఐ రాజేశ్వరరావులు తుమ్మల పెంట రోడ్డు, చెన్నాయపాలెం రోడ్డులోని చప్టాలు, వాగులను పరిశీలించారు. ఈ మార్గాల్లో రాకపోకలు సాగించవద్దని హెచ్చరిస్తూ దారికి అడ్డుగా ముళ్ల కంచె ఏర్పాటు చేశారు. అనంతరం కావలి తహసీల్దార్ శ్రావణ్, మండల ప్రత్యేకాధికారులు పీఆర్ఏఈ సుబ్రహ్మణ్యం, వీఆర్వో బాలయ్యలు ఆ ప్రాంతాలను పరిశీలించారు.

ఆముదాలదిన్నె ఎస్టీ కాలనీ వాసుల తరలింపు



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీదేవి

కావలి రూరల్, (ఆంధ్రజ్యోతి): మండలం ఆముదాలదిన్నె ఎస్టీకాలనీలోని గిరిజనులను బుధవారం మండల పరిషత్ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలకు తరలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దారు శ్రావణ్ కుమార్, ఎమ్పీడీవో శ్రీదేవిలు ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు చెప్పారు. కార్యక్రమంలో వీఆర్వో బాలకోటయ్య, కుట్టుబోయిన శేషసాయి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నీటి వనరుల పరిశీలన

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తుపాన్ ప్రభా వంతో వర్షాలు కురుస్తున్నందున బుధవారం తహసీల్దారు నాగరాజు తన సిబ్బందితో కలిసి నీటి వనరులను పరిశీలించారు. ఈ సందర్భంగా ముత్తరాశిపల్లి వాగును తనిఖీ చేశారు. అనంతరం దుత్తలూరు కొండమీద గల ఎస్టీ కాలనీని సందర్శించి వర్షాలు కురుస్తున్నందున కాలనీ వాసులు జాగ్రత్తగా ఉండాలని, వర్షాలు అధికమైతే సురక్షిత ప్రాంతాలకు తరలిస్తామని భరోసా ఇచ్చారు.



ఎస్టీ కాలనీ వాసులకు సూచనలిస్తున్న తహసీల్దారు నాగరాజు

పొంగుతున్న వాగులు, వంకలు

● అప్రమత్తమైన అధికారులు ● పునరావస కేంద్రాలకు ప్రజల తరలింపు



చేజర్ల: నల్లవాగును పరిశీలిస్తున్న డీఎస్పీ వేణుగోపాల్, ఎస్ఐ ప్రభాకర్



ఉదయగిరిలో రహదారిపై నిలిచిన వర్షపు నీరు

కందుకూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు వంకలు పొంగి ప్రవమిస్తున్నాయి. ఉలవపాడు, గుడ్లూరు, వలేటివారిపాలెం, కందుకూరు మండలాల్లో 100 మిల్లీమీటర్లపైనే వర్షపాతం నమోదు అయింది. ఉప్పుటేరు, ఎలికేరు ఉధృతంగా పారుతూ మన్నేరుకు వరద చేరుతోంది. రాళ్లపాడు ప్రాజెక్టు నీరు దిగువకు వదిలితే ఉలవపాడు, లింగసముద్రం, గుడ్లూరు మండలాలోని పలు చెరువులు పూర్తి సామర్థ్యంతో నిండుతాయి. కొండముడుసు పాలెం ఎర్రవాగు ప్రవాహంతో ఆర్టీసీ రాకపోకలు ఆగిపోయాయి. ఉప్పుటేరు ఉధృతంగా పారుతుండటంతో పట్టణంలోని ఆదిఆంధ్ర కాలనీ, దివివారిపాలెం, కాకుమానివారిపాలెం, లక్ష్మీనరసింహస్వామి ఎస్టీ కాలనీ ప్రాంతాల ప్రజలు కందుకూరు టౌన్‌కు రాకపోకలు నిలిచిపోయాయి.

● చేజర్ల (ఆంధ్రజ్యోతి): మండలంలోని పందలవాగు, నల్లవాగు పొంగి పొర్లుతున్నాయి. గొల్లపల్లి సమీపంలోని పందలవాగు పొంగి ప్రవహిస్తుండడంతో చేజర్ల ఎస్ఐ ప్రభాకర్ రాకపోకలు నిషేధించారు. అదేవిధంగా చేజర్ల కండ్రిక గ్రామంలో గంగవరపు పద్మమ్మకు చెందిన ఇంటి ప్రహరీ కూలిపోయింది. తిరపతినాయుడు పల్లి గ్రామంలో ఎస్సీ, ఎస్టీ కాలనీలో వరద నీరు చేరడంతో విషయం తెలుసుకున్న ఇన్‌చార్జ్ తహసీల్దారు మస్తానయ్య పరిశీలించి ఎక్స్‌కవేటర్ సహాయంతో నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకున్నారు. చలపనాయుడుపల్లి వద్ద లోతట్టు ప్రాంత ప్రజలతో ఆత్మకూరు ఆర్డీవో పావని మాట్లాడారు. అనంతరం చలపనాయుడు పల్లి, టి.కే.పాడు గ్రామాలలో పునరావస కేంద్రాలను పరిశీలించి అన్ని వసతులు కల్పించాలని తహసీల్దారును ఆదేశించారు. టికే పాడు సమీపంలోని ఉధృతంగా ప్రవహిస్తున్న నల్లవాగును డీఎస్పి కే వేణుగోపాల్, ఇన్‌చార్జ్ తహసీల్దారు మస్తానయ్య పరిశీలించారు. మండలంలో 70 హెక్టార్లలో వరిపైరు నేల వాలిందని, నెల్లూరుకు చెందిన శాస్త్రవేత్తలు వరిపైరును పరిశీలించనున్నట్లు తెలిపారు.

యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు

● ఆత్మకూరు: బుధవారం ఉదయం నుంచి వర్షం తగ్గుముఖం పట్టడంతో అధికారులు యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలను కొనసాగించారు. లోతట్టు ప్రాం తాలు, పెన్నా నది పరివాహక ప్రాంత ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. ఆర్డీవో బి పావని, డీఎస్పీ కె వేణుగోపాల్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాలను సందర్శించి అక్కడ రైతులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. చేజర్ల, అనంతసాగరం మండలంలోని పడమటికంభంపాడులో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాలను ఆర్డీవో పరిశీలించారు. పునరావాసకేంద్రాల్లో గర్భిణులను ముందస్తు జాగ్రత్తగా ప్రభుత్వ వైద్యశాలలో చేర్చాలని అధికారులకు సూచించారు. ఇరిగేషన్ ఈఈ ఆర్ వెంకటేశ్వర్లు స్థానిక ఇరిగేషన్ అధికారులతో కలిసి నియోజక వర్గంలోని పలు చెరువులను, సప్లయ్ చానల్స్‌ను పరిశీలించి అవసరమైన ప్రాంతాల్లో తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

స్తంభించిన జనజీవనం...

● ఉదయగిరి రూరల్: తుపాన్ ప్రభావంతో మెట్ట ప్రాంతమైన ఉదయగిరిలో బుధవారం ఎడతెరిపిలేని వర్షం కురిసింది. గత మూడు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో జనజీవనం స్తంభించింది. వర్షపు నీటితో మురుగు కాలువలు పొంగిపొర్లడంతో రహదారులు చెత్తాచెదారంతో నిండాయి. రహదారులపై వర్షపు నీరు చేరడంతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. మండలంలోని గుడినరవ ఎస్సీ కాలనీకి వెళ్లే రహదారి వద్ద చెట్టు నేలకొరగడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దున్నపోతుల, పిల్లాపేరు వాగులు కొద్దిమేర ప్రవహిస్తున్నాయి. ఈ వర్షాలకు గండిపాళెం జలాశయానికి 2 అడుగుల మేర నీరు చేరినట్లు జలవనరుల శాఖాధికారులు తెలుపుతున్నారు. కాగా, ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున వరి పంటలో నీరు నిల్వ లేకుండా రైతులు చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి ఆంజనేయులనాయక్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని గండిపాళెం, గుడినరవ గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా సాగులో ఉన్న వరి పంటను పరిశీలించి రైతుసేవా కేంద్రాల్లో రైతులకు తగు సూచనలు, సలహాలు అందజేశారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు

● వరికుంటపాడు: అల్పపీడన ప్రభావంతో రోజుల తరబడి కురుస్తున్న వర్షాల తాకిడికి మండలంలోని వాగులు, వంకల్లోకి వరద నీరు చేరడంతో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. బుధవారం సైతం జడివాన కమ్ముకోవడంతో నక్కలగండి పరిధిలోని ఉప్పువాగు, కనియంపాడు- రామదేవులపాడు గ్రామాల సమీపంలోని పిల్లాపేరు, కాంచెరువు సమీపంలోని ఉప్పు వాగుల ఉధృతికి వంతెనలపై నీరు ప్రవహిస్తుండడంతో సమీప గ్రామాల ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అలాగే రిజర్వాయర్లు, చెరువుల్లోకి ఆశించిన మేర నీరు చేరడంతో ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దుక్కులు దున్ని పంటలు సాగు చేసుకునేందుకు పరిస్థితులు అనుకూలంగా మారాయంటూ రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కాగా నివాసాల నుంచి బయటకు వచ్చే పరిస్థితులు లేకపోగా చలిగాలులు పెరుగుతుండడంతో ప్రజలతో పాటు పిల్లలు, వృద్ధులు బెంబేలెత్తిపోతున్నారు.

వరికి తీవ్ర నష్టం

● అనంతసాగరం: అల్పపీడన ద్రోణి ప్రభావంతో మండలంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానతో సోమశిల, కొత్తపల్లి, వడ్డిపాలెం, అనంతసాగరం తదితర గ్రామాల్లో చేతికందిన వరి దెబ్బతింది. మండల వ్యవసాయాధికారి శ్రీధర్‌రెడ్డి మునిగిన వరి పొలాలు పరిశీలించారు. 350 ఎకరాల్లో పంట దెబ్బతిన్నట్లు గుర్తించినట్లు చెప్పారు. కమ్మవారి పల్లి, పాతదేవరాయపల్లి వద్ద పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. సోమశిల సమీపంలో పీకేపాడు చెరువు అలుగు ద్వారా వస్తున్న నీటి ప్రవాహంతో కమ్మవారిపల్లి వద్ద వాగు పొంగిపొర్లుతోంది. సోమశిల, అనంతసాగరం రాకపోకలకు ఇబ్బందికర పరిస్థితి నెలకొంది. పడమటింకంబంపాడు ఎస్సీకాలనీ వాగులు ముంపునకు గురికావడంతో కొన్ని కుటుంబాలను ప్రాథమిక పాఠశాలలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేసి వారికి ఆహార పదార్థాలు అందిస్తున్నారు. ఆ కేంద్రాన్ని ఆత్మకూరు ఆర్డీవో పావని, తహసీల్దారు వీరవసంతరావు పరిశీలించారు.

నిండుకుండలా చినక్రాక రిజర్వాయరు

● జలదంకి: తుఫాను ప్రభావంతో మండలంలో మూడురోజులుగా భారీ వర్షాలు పడుతుండటంతో వాగులు, వంకలు పొంగాయి. సాగునీటి చెరువులతో సహా చినక్రాక రిజర్వాయరు నిండుకుండలా మారింది. ఈ పరిస్థితిని చూసి మండల రైతాంగం ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చిప్పలేరు, చీకటివాగు, కమ్మవారిపాలెం, చామదల, గోపన్నపాలెం వాగులు పొంగడంతో రోడ్లపై ఉన్న కల్వర్టులపైన నీరు పారుతుండడంతో రాకపోకలు స్తంభించి పోయాయి. చినక్రాక, అన్నవరం గోపన్నపాలెం, కమ్మవారిపాలెం, చామదల తదితర గ్రామాల ప్రజలు మండలకేంద్రానికి, కావలికి వెళ్లే వీలులేక ఇళ్లకే పరిమితం అయ్యారు. జలదంకి, కేశవరంలోని లోతట్టుప్రాంతాల వారిని తహసీల్దారు ప్రమీల ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు ముందస్తుగా పునరావాస కేంద్రాలకు తరలించారు. వాగులు దాటకుండా ఎస్ఐ లతీపున్నీసా తమ సిబ్బందిని వాగుల వద్ద బందోబస్తు ఏర్పాట్లు చేశారు. జలదంకి- జమ్మలపాలెం సమీపంలోని జాతీయ రహదారి పక్కన ఉన్న విద్యుత్‌స్తంభం ఒరిగింది. జలదంలోని చల్లాయానాదులను పునరావాస కేంద్రాలకు తరలించాలని సీపీఎం నేతలు రావి మాల్యాద్రి, మేలంగి ఆంథోనీబాబులు బుధవారం డీటీ జూలీభాయ్‌కి వినతిపత్రం అందజేశారు.

వర్షంతో రోడ్లన్నీ జలమయం

● అల్లూరు : అల్లూరులో రోడ్లు జలమయమయ్యాయి. ఇప్పటికే ధ్వంసమైన రోడ్లలో మోకాటి లోతు గుంటల్లో నీరు నిలువడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అల్లూరు చెరువుకు పైడేరు నుండి ఏటీఎస్ ఛానల్ నుండి వరదనీరు ఉధృతంగా వస్తుంది. ఈ నీటిలో చేపలు పట్టేందుకు గిరిజనులు బారులు తీరారు. ఇస్కపల్లి తీరంలో సముద్రం అల్లకల్లోలంగా మారింది. సముద్రంలోకి ఎవ్వరినీ వెళ్లనీయకుండా ముందస్తు సూచనలు చేశారు. దీంతో మత్స్యకారులు తమ బోట్లు, వలలను సురక్షిత ప్రాంతానికి తరలిస్తున్నారు.

పలు ప్రాంతాల్లో తహసీల్దారు పర్యటన: తుఫాను ధాటికి ప్రమాద ప్రాంతాలైన పురిణి పంచాయతీలోని కొన్ని ప్రాంతాలను తహసీల్దారు లక్ష్మీ నారాయణ పరిశీలించారు. పురిణి తుఫాన్ నగర్ వద్ద పైడేరు పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. ఏదైనా ప్రమాదం వాటిల్లితే వెంటనే స్పందించాలని అధికారులకు సూచించారు. లస్కర్లు అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు సమాచారం అందించాలన్నారు.

● లింగసముద్రం: అన్నెబోయినపల్లి ప్రధాన రహదారిపై అడుగులోతులో వర్షపునీరు నిలిచి పోయింది. రోడ్డుకు ఇరువైపులా ఉన్న మార్జిన్లపై ఎత్తుగా మట్టి పోయడంతో ఈ సమస్య నెలకొంది. అలాగే గ్రామంలో సైడు కాలువలు లేక పోవడంతో రోడ్డుపైనే నీరు పారుతోంది. కాలువ పూడిక తీయించి నీరు బయటకు పంపేందుకు పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు. స్థానిక యూపీ పాఠశాలలో మోకాటి లోతులో వర్షపు నీరు నిలిచిపోయింది. పెదపవని సమీపంలోని ఉప్పుటేరులో బ్రిడ్జిని ఆనుకొని నీరు ప్రవహిస్తోంది. రీసర్వే డీటీ ప్రసాద్, ఎంపీడీఓ శ్రీనివాసులు వీఆర్ఓ, కార్యదర్శులను ప్రజలను అప్రమత్తం చేశారు.

114 మి.మీ వర్షపాతం నమోదు

● కొండాపురం : మండలంలో రెండురోజులుగా కురిసిన వర్షం 114 మిల్లీమీటర్లుగా నమోదు అయ్యింది. అన్ని గ్రామాల అంతర్గతరోడ్లన్నీ బురదమయంగా మారాయి. సత్యవోలు పంచాయతీ సత్యవోలు-అగ్రహారం మధ్య ఉన్న మిడతవాగు పొంగి బ్రిడ్జిపె నుండి నీరు పారుతోంది. ఎస్ఐ ఎమ్.వెంకటరావు సిబ్బందిని కాపలాగా ఉంచారు. గానుగపెంట పంచాయతీ అరుంధతీయవాడలో తాడిపర్తి దత్తాత్రమ్మకు చెందిన ఇంటి మట్టిగోడ కూలింది. ప్రజలకు సమస్యలు తలెత్తినట్లయితే సెల్:91775 04911ను సంప్రదించాలని తహసీల్దార్ కోటేశ్వరరావు తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● సీతారామపురం : అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్న నేపధ్యంలో సీతారామపురం గ్రామ పంచాయతీలోని పడమటివీధి వైపున ప్రవహిస్తున్న గుంటమడుగు వాగును బుధవారం స్థానిక ఎంపీడీవో ఎం భాస్కర్, ఈవోపీఆర్డి భార్గవి పరిశీలించారు. ఈసందర్భంగా ఎంపీడీవో భాస్కర్ మాట్లాడుతూ వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



అనంతసాగరం- వడ్డిపాలెం వద్ద దెబ్బతిన్న వరిపైరును పరిశీలిస్తున్న అధికారులు



లింగసముద్రం: చామదల నేరెళ్లవాగును పరిశీలిస్తున్న ఎస్ఐ లతీపున్నీసా

వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటన



కావలి: అన్నపుగుంట బ్రిడ్జి వద్ద వరదను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

కావలి, (ఆంధ్రజ్యోతి) అక్టోబరు 16: వరద ప్రభావిత ప్రాంతాలు అన్నపుగుంట ముంపు ప్రాంతం, బీకేనగర్, మద్దూరుపాడులోని టిడ్కో గృహాల ప్రాంతాలను బుధవారం ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. దశాబ్దకాలంగా పాలకుల నిర్లక్ష్యానికి గురైన కావలి ప్రజల కష్టాలు తీర్చేందుకు నేనున్నానని ప్రజలు ఎవరూ అధైర్యపడాల్సిన పనిలేదని భరోసా ఇచ్చారు. అలాగే బీకే నగర్ ప్రాంతాన్ని పరిశీలించి అక్కడ పునరావాసకేంద్రంలో ఉన్న వారి సమస్యలు తెలుసుకుని వారికి ఆహారం పంపిణీ చేశారు. మద్దూరుపాడులోని టిడ్కో గృహా ల వద్ద ఉన్న వర్షపు నీటిని పరిశీలించి అక్కడ నీటిని మోటార్లు పెట్టి బయటకు పంపాలని అధికారులకు చెప్పారు. ముసునూరు గిరిజనకాలనీలో చేరిన వర్షపునీటినిబయటకు పంపేందుకు చేస్తున్న సహాయక చర్యలను ఆయ న పరిశీలించారు. అనంతరం వరదలతో ప్రజలను కాపాడేందుకు చేపట్టా ల్సిన కార్యక్రమాలు గురించి ఆర్డీవో కార్యాలయంలో బుధవారం అధికా రులతో సమీక్ష నిర్వహించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. నీట మునిగి న ప్రాంతాలను గుర్తించి నిల్వ ఉన్న నీటిని బయటకు పంపేందుకు ఎక్స్‌కవేటర్‌లతో కాలువలు తీయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి భోజనాలు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఆర్డీవో వంశీక్రిష్ణ, మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్, కావలి తహసీల్దార్, శ్రావణ్ ఇతర అధికారులు ఉన్నారు.

రాళ్లపాడు వద్ద అప్రమత్తంగా ఉండండి



ప్రాజెక్టు అధికారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ

లింగసముద్రం, (ఆంధ్రజ్యోతి) అక్టోబరు 16: రాళ్లపాడు ప్రాజెక్టు వద్ద అప్రమత్తంగా ఉండాలని కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ ప్రాజెక్టు అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం 6గంటల సమయంలో ఆమె రాళ్లపాడు ప్రాజెక్టును సందర్శించి మాట్లాడారు. ప్రాజెక్టులోని నీటిమట్టాన్ని పరిశీలించి నీటి విడుదల వివరాలను ప్రాజెక్టు ఏఈ చంద్రమౌలిని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఉన్న 12.2అడుగుల నుంచి 14, 15 అడుగుల నీరు దాటితే తనకు సమాచారం ఇవ్వాలని, మన్నేరు పరీవాహక గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు శ్రీనివాసులు, ఏఈ మనోహర్, నేతలు మాజీ సర్పంచు కిలారి కొండయ్య, మద్దెల రామారావు, అడపా రంగయ్య పాల్గొన్నారు.

కాలనీవాసులకు పునరావాస చర్యలు

కలిగిరి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ, పోలీసు యంత్రాంగం, మండలంలోని పలు గ్రామాల వద్ద ముందస్తు సహాయక చర్యలు చేపట్టారు. తహసీల్దారు చొప్ప రవీంద్రబాబు, వెంకన్నపాలెం ఎస్టీ కాలనీలోని 19కు టుంబాలకు చెందిన 91 మందికి పునరావాసం కల్పించారు. వారికి భోజన ఏర్పాట్లు చేశారు. ఎస్ఐ ఉమాశంకర్ కలిగిరి-కొండాపురం మార్గంలో బ్రిడ్జి నిర్మాణాల వద్ద పేరుకపోయిన చెత్త చెదారాలను జేసీబీ యంత్రాలతో తొలగింపజేశారు. వాగులవద్ద ముందస్తు హెచ్చరికలు జారీ చేశారు.

నేతల చొరవతో వరద నీరు తొలగింపు

బిట్రగుంట (ఆంధ్రజ్యోతి): ముంగమూరు పంచాయతీ పొల్లాలోకి బుధవారం వరద నీటి ప్రవాహం పెరిగింది. గ్రామ సమీపంలోని వంతెన తూముల కు అడ్డుగా ఉన్న కంపచెట్లు, ముళ్ల తుప్పలలను సర్పంచు రాయి సుప్రజ సూచనల మేరకు ఉపసర్పంచు వినోద్‌యాదవ్, టీడీపీ నేత యన్నాబత్తిన వేంకటేశ్వర్లు రెండు ఎక్స్‌కవేటర్‌ను రప్పించి ముళ్లకంప తొలగించి నీరు వెళ్లేలా చేశారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ జితేంద్రరెడ్డి, వీఆర్వో మాల్యాద్రి, కార్యదర్శి పద్మజ, పంచాయతీ, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

● తీరప్రాంతం గ్రామం పరిశీలన

సముద్రతీర ప్రాంతం జువ్వలదిన్నెలో బుధవారం ఎంపీడీవో సుబ్రహ్మణ్యం పర్యటించి పొట్టిశ్రీరాములు స్మారక పర్యాటక కేంద్ర భవనాన్ని పరిశీలించారు. భవన ప్రాంగణంలో పెరిగిన ముళ్లచెట్లు, పిచ్చి మొక్కలను తొలగించేలా చర్యలు చేపట్టాలని కార్యదర్శి శ్రీనివాసులుకు సూచించారు. ఫిషింగ్ హార్బర్‌కు చేరుకున్న పడవలను తహసీల్దారు సురేష్‌బాబు, ఆర్ఐ వాజీద్, వీఆర్వోలతో కలిసి సందర్శించారు. కావలి రూరల్ సీఐ పాపారావు, స్థానిక ఎస్ఐ భోజ్యా జడగోగుల, ఏనుగులబావి మధ్య ఉన్న బ్రిడ్జి వద్ద ఇరుకుపోయిన ముళ్లకంపను సాయంత్రం తొలగింపు చర్యలు తీసుకున్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



బిట్రగుంట, అక్టోబరు 16: బోగోలు మండలం చెంచులక్ష్మీపురం సీతాలక్ష్మణాంజనేయ సమేత కోదండరామ స్వామి ఆలయంలో బుధవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ, ఆలయ ప్రాంగణంలోని నవగ్రహ మండపంలో నవగ్రహాల ప్రతిష్ఠ చేపట్టారు. వరహాచలం సాయిరామాచార్యులు, గుడ్లూరు వినోద్‌కుమార్ ఆచార్యుల బృందం శాస్త్రోక్తంగా ఈ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో ధ్వజస్తంభ దాతలు పసుపులేటి సుధాకర్, సుగుణమ్మ, సిద్దయ్య, ఆదిశేషమ్మ దంపతులు, ఆలయ కార్యనిర్వాహణ సభ్యులు పసుపులేటి వేంకటేశ్వర్లు, తిరుపతమ్మ, వంశీకృష్ణ, ప్రియ దంపతులు పాల్గొన్నారు.

'పల్లె పండుగ'తో గ్రామాలకు మహర్దశ

● జోరువానలోనూ కార్యక్రమం నిర్వహణ

● వింజమూరులో రూ. 2.86కోట్లతో సీసీ రోడ్లకు ఎమ్మెల్యే శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కాకర్ల

వింజమూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకం గా చేపట్టిన పల్లె పండుగ కార్యక్రమం ద్వారా గ్రామాలకు మహర్దశ పడుతుందని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. బుధవారం కాటేపల్లి, రావిపాడు, బీసీ కాలనీ, ఎస్టీకాలనీ, నందిగుంట గ్రామాలలో సీసీ రోడ్లకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురుస్తున్నందున నియోజకవర్గ వ్యాప్తంగా చెరువులను పర్యవేక్షించాలని ఇరిగేషన్‌శాఖ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. మండల కన్వీనర్ గొంగటి రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరా మిరెడ్డి, కంభం అనసూయమ్మ, మాజీ ఏఎంసీ చైర్మన్ దంతులూరి వెంకటేశ్వ రరావు, ఇతర శాఖాధికారులు, తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

వరికుంటపాడు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాల తాకిడికి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రఘునాథ్ అన్నారు. బుధవారం నక్కలగండి ఉప్పువాగుతో పాటు కనియంపాడు, తూర్పుబోయమడుగుల గ్రామాల సమీపంలోని పిల్లాపేరు, తూర్పురొంపిదొడ్ల, కాంచెరువు గ్రామాల సమీపంలోని ఉప్పువాగు వంతెనలను ఆయన పరిశీలించారు. ఎలాంటి ప్రమాదకర సంఘటనలు చోటు చేసుకోకుండా సిబ్బందితో కలిసి పహారా చేపట్టారు.

మద్యం దుకాణాల ఏర్పాటును అడ్డుకున్న స్థానికులు



ఉదయగిరి రూరల్ : సీఐకి వినతిపత్రం అందజేస్తున్న స్థానికులు

ఉదయగిరి రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్ సమీపంలో మద్యం దుకాణం ఏర్పాటును స్థానికులు బుధవారం అడ్డుకున్నారు. లాటరీలో మద్యం దుకాణం దక్కించుకున్న వ్యక్తులు ఆనకట్ట సమీపంలోని దుకాణం ఏర్పాటు చేసేందుకు అద్దెకు ఓ గదిని తీసుకున్నారు. విషయం తెలుసుకున్న స్థానికులు దుకాణం ఏర్పాటును అడ్డుకున్నారు. దీంతో గదిని అద్దెకు ఇచ్చిన యజమానురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐలు ఇంద్రసేనా రెడ్డి, శ్రీనివాసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. దుకాణం ఏర్పాటుపై ఎక్సైజ్ అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

●యూనియన్ రోడ్డులో ఆందోళన: తమ ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దని బుధవారం యూనియన్ రోడ్డు ప్రాంత వాసులు ఆందోళన చేపట్టారు. మద్యం దుకాణం ఏర్పా టుచేసేందుకు ప్రయత్నాలు చేస్తుండడంతో సమాచారం తెలుసుకున్న స్థానికులు అక్కడకు చేరుకొని ఆందోళన చేశారు. అనంతరం ఎక్సైజ్ కార్యాలయానికి చేరుకొని వినతిపత్రం అందజేశారు. మద్యం దుకాణం ఏర్పాటుచేసే సమీపంలో మసీదు, మదరసాలు ఉన్నాయన్నారు. నివాసాల మధ్యలో మద్యం దుకాణం ఏర్పాటుచేస్తే పలు ఇబ్బందులు తలెత్తుతాయని, అధికారులు స్పందించి పట్టణ శివారు ప్రాంతాల్లో ఏర్పాటుచేయాలని వారు కోరారు.

బాలాజీనగర్‌లో ఆందోళన

స్థానిక బాలాజీనగర్‌లో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తొలగించాలని బుధవారం రాత్రి ఆ ప్రాంత వాసులు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయం ఎదుట నినాదాలతో కూడిన ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మద్యం దుకాణం ఏర్పాటు చేసిన సమీపంలో వైద్యశాలలు, పాఠశాలలు ఉన్నాయని, నిత్యం రద్దీగా ఉండే ప్రదేశంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయడం సబబుకాదన్నారు. అనంతరం సీఐ లక్ష్మణ్‌స్వామికి వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఆయన పరిశీలించి చర్యలు తీసుకొంటామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు గడ్డం శ్రీనివాసులనాయుడు, సుధాకర్, కరీం, ఇలియాజ్, అనిల్, బాబుల్‌రెడ్డి, నారాయణరెడ్డి, రవి, శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గదుల్లేక ఇబ్బందులు

లాటరీలో మద్యం దుకాణం వచ్చిందని సంతోషించాలో.. గదులు అద్దెకు దొరక్కపోవడంతో బాధపడాలో తెలియని పరిస్థితి మద్యం దుకాణదారులిది. మంగళవారం రాత్రి 9 గంటలకు ప్రభుత్వ మద్యం దుకాణాలకు తాళం వేశారు. బుధవారం ఉదయం 10 గంటలకు ప్రైవేటు మద్యం దుకాణాలు తెరుచుకోవాల్సి ఉంది. అధికారులు దుకాణాలు కేటాయించిన వ్యాపారస్తులకు లైసెన్సులు జారీ చేయడంతోపాటు గోదాముల నుంచి మద్యం సరఫరా చేసేలా చర్యలు సైతం చేపట్టారు. అయితే మద్యం దుకాణాలు ఏర్పాటు చేసేవారికి అద్దెకు గదులు దొరకడం కష్టంగా మారింది. ఒకవేళ దుకాణం అద్దెకు దొరికినా స్థానికులు తమ ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దని ఆందోళనలు చేపట్టడంతోపాటు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు వినతిపత్రాలు అందజేస్తున్నారు. దీంతో దుకాణాలు ఏర్పాటు చేసేందుకు అనువైన గదుల కోసం వ్యాపారస్తులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

పాత ధరలకే మద్యం.. మందుబాబుల నిరాశ

● ఆత్మకూరు: ఆత్మకూరు సర్కిల్ పరిధిలో 13 మద్యంషాపులు బుధవారం ప్రాంభించాల్సి ఉండగా కొన్నిషాపులు మాత్రమే ప్రారంభ మయ్యాయి. తక్కువ ధరకే మద్యం దొరుకుతుందని వైన్‌షాపులకు వెళ్లిన మందుబాబులు పాత ధరకే మద్యం విక్రయించడంతో నిరాశకు గురయ్యారు. అన్ని రకాల బ్రాండ్ల మద్యం అందుబాటులోకి తేవడంతో పాటు నూతన ధరలకు మద్యం విక్రమించేలా అధికారులు దృష్టి సారించాలని మందుబాబులు కోరుతున్నారు.

● సీతారామపురం: మండల కేంద్రమైన సీతారామ పురంలో నూతనంగా లాటరీ ద్వారా లైసెన్స్ పొందిన మద్యం దుకాణాన్ని మండల టీడీపీ అధ్యక్షుడు కప్ప ప్రభాకర్ రాజు, మండల ప్రధాన కార్యదర్శి పిడుగు రమేష్ ప్రారంభించారు. కొత్త మద్యం బ్రాండ్లు అందుబాటులోకి రాకపోవడంతో పాత మద్యం బ్రాండ్లను బుధవారం విక్రయించారు.

● అనంతసాగరం : మండలంలో మొత్తం మూడు మద్యం షాపులు మంజూరు కాగా బుధవారం సోమశిల, రేవూరులో మాత్రమే కొత్తషాపులు ప్రారంభించారు. అనంతసాగరంలో షాపు తెరవలేదు. మద్యం ధరలు తగ్గుతాయని మద్యం ప్రియులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

● కలువాయి : ప్రభుత్వ మద్యం దుకాణాలు మంగళవారం రాత్రి మూతపడి బుధవారం సాయంత్రం తెరుచుకున్న ప్రైవేటు షాపు వద్ద మద్యం కోసం మందుబాబులు ఎగబడ్డారు. పాత ధరకే విక్రయించడంతో వారు అసంతృప్తి వ్యక్తం చేశారు.